
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత్ శక్తి ®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:194 హైదరాబాద్, సోమవారం, 3 ఫిబ్రవరి 2025 పేజీలు: 12 వెల: 1.00

# బీజేపీపై యుద్ధం ప్రకటిస్తున్నా

హైదరాబాద్, ఫిబ్రవరి 02: సాధారణ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపినందుకు నిరసనగా డాక్టర్ బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా బీజేపీపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సాధారణ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంపై వివక్షకు నిరసనగా ఆదివారం ట్యాంక్ బండపై ఉన్న బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో నిరసన చేపట్టారు. అనంతరం పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ కేడర్‌కు ఆయన పిలుపు నిచ్చారు.

తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి, రాజకీయాలు పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా అందరు కలిసి రావాలని ఆయన సూచించారు. రాష్ట్రానికి కేంద్ర నిధులు ఇచ్చే వరకు శాంతియుతంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డికి రాష్ట్రాభివృద్ధి పట్టదా? అంటూ వారిని పీసీసీ చీఫ్ నిలదీశారు. తెలంగాణ పట్ల ప్రేమ ఉంటే బండి సంజయ్, కిషన్ రెడ్డిలు తమ కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్, మంత్రులు ఒంటరి పోరాటం చేస్తున్నారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

%తెలుంగింటి కోడలు నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సమగ్ర అభివృద్ధికి కాకుండా కేవలం రాజకీయ ప్రయోజనాలకే కేటాయించినట్లుగా ఉందన్నారు. తెలంగాణ సహా కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాలపై బీజేపీ చూపిస్తున్న వివక్ష, రాజకీయ కక్షకు ఈ బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు, 8 ఎంపీలు ఉన్నారని.. అయినా తెలంగాణకు కేంద్రం గాడిదగుడ్డు ఇచ్చిందంటూ మండిపడ్డారు.

'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్'' అంటూ తెలుగు గేయం వినిపించి తెలుగు వారి ఆకాంక్షలకు, తెలుగు నేల అభివృద్ధికి మొండిచేయి చూపించారని వ్యంగ్యంగా అన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులు ఢిల్లీ, బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసమే అన్నట్లుగా ఉందన్నారు. రాజకీయ అవసరాల కోసం బీజేపీ కేంద్ర బడ్జెట్‌ను ఉపయోగించుకుంటూ రాష్ట్రాలను విడదీస్తూ.. జాతి సమగ్రతను పక్కన పెట్టిందని ఈ సందర్భంగా కేంద్రంపై ఆయన నిప్పులు చెరిగారు. బడ్జెట్‌లో దేశ సమ్మిళిత వృద్ధిని కొంచెం కూడా పట్టించుకోలేదంటూ కేంద్ర వైఖరిని తప్పు పట్టారు. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ పట్ల బీజేపీ సవితి ప్రేమను తెలియజేస్తుందన్నారు.

అయినా కొన్ని రాష్ట్రాలకే బడ్జెట్ కేటాయింపులతో వికసిత్ భారత్ ఎలా సాధ్యమవుతోందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. దేశ జీడీపీలో 5.1 శాతం వాటా ఉన్న తెలంగాణకు కేవలం 2.10 శాతమే మాత్రమే తిరిగి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి జీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో సుమారు రూ. లక్ష వేల కోట్లు వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కనీసం రూ. 40 వేల కోట్లు కూడా తిరిగి ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. బడ్జెట్‌లో విభజన చట్టం హామీలు, మెట్రో రెండో దశకు నిధుల కేటాయింపుతో పాటు ఇతర రంగాలకు కేటాయింపులు శూన్యమని గుర్తు చేశారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని గొప్పలకు పోయే బీజేపీకి దేశంలో ఉన్న 140 కోట్ల ప్రజలు, వారి సమస్యలు కనపడక పోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

2025-26 బడ్జెట్ కేటాయింపులు చూసి తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ క్షమించరన్నారు. తెలంగాణ అభ్యున్నతి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతీ తెలంగాణ పౌరుడు ఏకతాటిపైకి రావాలిసిన అవసరం ఉందని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ నొక్కి చెప్పారు. కేంద్రం కక్ష పూరిత వైఖరికి నిరసనగా బీఆర్ఎస్‌తోపాటు తెలంగాణవాదులు ముందుకు రావాలంటూ పిలుపు నిచ్చారు. మాటిమాటికి ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు.. సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనను విమర్శిస్తారని.. మరి ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులపై వారు ఏం సమాధానం చెబుతారంటూ ఈ సందర్భంగా వారిని నిలదీశారు.

రాష్ట్ర నిధుల కోసం సీఎం రేవంత్, మంత్రులు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి యాచించిన తెలంగాణకు మాత్రం ఒరిగిందేమీ లేదని అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ పట్ల కేంద్రం వైఖరికి నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా గల్లీ నుంచి పట్టణం వరకు జరిగే నిరసన కార్యక్రమాల్లో.. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రుల దిష్టి బొమ్మలను దగ్ధం చేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు ఇచ్చారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బీజేపీ వ్యవహారశైలిపై మంత్రి సీతక్క మండిపడ్డారు. తెలంగాణ అంటే బీజేపీకి పిచ్చి విద్వేషమని విమర్శించారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. వారు బడ్జెట్ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి తెచ్చింది గుండు సున్నా అని




ఎద్దేవా చేశారు. అక్షింతలకు ఓటేస్తే తెచ్చింది గుండు సున్నా అని పేర్కొన్నారు.

అక్షింతలు కాదు అభివృద్ధికి నిధులు ఇవ్వండంటూ కేంద్రాన్ని కోరారు. అయినా తెలంగాణపై ఇంత దారుణమైన వివక్షత ఎందుకు? అంటూ కేంద్రాన్ని ఈ సందర్భంగా ఆమె సూటిగా ప్రశ్నించారు. విభజన హామీలు ఎందుకు అమలు చేయలేదంటూ కేంద్రాన్ని నిలదీశారు. అక్షింతలకు ఓటెద్దామా? అభివృద్ధికి ఓటెద్దామా? అంటూ పార్టీ కేడర్‌ను ఆమె ప్రశ్నించారు. తెలంగాణకి ప్రత్యేక బడ్జెట్ ప్రకటించాలంటూ కేంద్రాన్ని సీతక్క డిమాండ్ చేశారు.

ఇదే నిరసన దీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాలు కలిపితేనే కేంద్రమవుతోందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణపై కేంద్రానికి ఎందుకు ఇంత వివక్షా అంటూ సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ నిధుల కోసం బీజేపీ ఎంపీలు గొంతెత్తాలని ఈ సందర్భంగా వారిని డిమాండ్ చేశారు.

చరిత్రహీనులుగా మిగలకండంటూ బీజేపీ ఎంపీలకు ఆయన హితవు పలికారు. ప్రభుత్వం తరఫున నిధులు కావాలని కాలుకు బలపం కట్టుకొని తిరిగినా ఎందుకు ఇవ్వట్లేదని కేంద్రాన్ని ఆయన బల్లగుద్ది మరి ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాలంటూ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, డీసీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు పార్టీ అగ్రనేతలు సూచించారు.

## అందరి అంచనాలు తలకిందులు.. తెలంగాణలో లెక్క తేలిన బీసీ జనాభా.. అధికారికంగా ప్రకటించిన కమిటీ..

హైదరాబాద్: కేబినెట్ సబ్ కమిటీకి కులగణన నివేదికను ప్లానింగ్ కమిషన్ అధికారులు ఇచ్చారు. తెలంగాణలో 50 రోజుల పాటు కులగణన సర్వే జరిగింది. 1,03,889 మంది అధికారులతో ప్రభుత్వం కులగణన సర్వే చేయించింది. 96.9 శాతం



కుటుంబాలను అధికారులు సర్వే చేశారు. 3.1 శాతం మంది సర్వేలో పాల్గొనలేదని కమిషన్ స్పష్టం చేసింది. 3.54 కోట్ల మందిని సర్వే చేసినట్లు అధికారులు వెల్లడించారు. తెలంగాణలో 55.85శాతం బీసీ జనాభా ఉన్నట్లు కమిటీ నివేదికలో ప్రకటించింది. తెలంగాణ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని తెలిపారు.

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆశయం మేరకు సామాజిక, కులగణన సర్వే చేశామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి కులగణన సర్వే నివేదిక అందిందని చెప్పారు. తెలంగాణలో 96.9 శాతం కులగణన సర్వే జరిగిందని చెప్పుకొచ్చారు. 3.1 శాతం మంది సర్వేలో పాల్గొనలేదన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి సర్వే జరగలేదని అన్నారు. బీసీ జనాభా లెక్కించాలనేది రాహుల్ ఆశయమని చెప్పారు. 1,03,889 మంది ఎన్యుమరేటర్లతో కులగణన సర్వే జరిగిందని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 3.54 కోట్ల మందిని సర్వే చేశారని చెప్పారు.

ఎల్లుండి ఉదయం 10 గంటలకు కేబినెట్ సమావేశం జరుగుతుందని అన్నారు. ఫిబ్రవరి 4న కేబినెట్ ముందుకు కులగణన సర్వే నివేదిక తీసుకువస్తామని తెలిపారు. అసలైన పేదలను గుర్తించేందుకే కులగణన చేపట్టామని వివరించారు. బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే కులగణన జరిగిందని తెలిపారు. కులగణన సర్వే నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెడతామని అన్నారు. అసెంబ్లీ తీర్మానమైన తర్వాత.. బలహీన వర్గాల స్థితిగతుల మెరుగు కోసం చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..

హైదరాబాద్: ఏడాది పాలనలోనే ఆకలిచావులు, ఆత్మహత్యల రాష్ట్రంగా తెలంగాణను కాంగ్రెస్ మార్చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (%దీ=ూ ఙశీతీఎఱఅస్త్ర జూతీవంఱసవత్‌ఖు=%) ఆరోపించారు. పదేళ్ల పాలనతో తెలంగాణ (%ఙవశ్రీఖఅస్త్రుఱఖ%)ను దేశానికే అన్నపూర్ణగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ (%ఖజ=%) నిలబెడితే దాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. ఏడాదిలోనే అన్నపూర్ణ తెలంగాణను ఆత్మహత్యల తెలంగాణ మార్చేశారని ఎక్స్ వేదికగా కేటీఆర్ ధ్వజమెత్తారు.

హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేశారని కేటీఆర్ ఆగ్రహించారు. రియల్ ఎస్టేట్ రంగంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టారని కాంగ్రెస్



దెబ్బకు వారు విలవిల్లాడుతున్నారని ఆరోపించారు. పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక, తెచ్చిన అప్పులు చెల్లించలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల ఉసురు తీసుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చి రైతుల్లో కేసీఆర్ ఆత్మవిశ్వాసం నింపారని, వ్యవసాయ రంగానికి ఆయన వెన్నెముకగా నిలిచారని కీర్తించారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనలో సాగునీళ్లు అందక, కరెంట్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. ఆరుగాలం పండించిన పంటలు ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, రైతుభరోసా, రుణమాఫీ అందక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రజాపాలన కాదని, ప్రజలను వేధించే పాలనంటూ చురకలు అంటించారు. జాగో తెలంగాణ జాగో అంటూ రైతులు, ఆటో డ్రైవర్ ఆత్మహత్మలు చేసుకున్న వార్తా పత్రికల క్లిప్పింగులను ట్వీట్‌కు జోడిస్తూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

# మావోయిస్టుల కుట్ర.. భగ్నం చేసిన భద్రతా దళాలు



ఛత్తీస్‌గఢ్, ఫిబ్రవరి 02: ఛత్తీస్‌గఢ్‌లో మవోయిస్టులు, భద్రత దళాల మధ్య బీకర పోరు జరుగుతోంది. అలాంటి వేళ.. మావోయిస్టుల కుట్రను భద్రతా బలగాలు ఆదివారం భగ్నం చేశాయి. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబ్‌ను భద్రతా దళాలు గుర్తించి.. వాటిని ధ్వంసం చేశాయి. ఊసూరు - ఆనపల్లి రహదారిలో 25 కేజీల ఐఈడీనీ బాంబ్ డిటెక్ట్ స్క్వాడ్ గుర్తించింది. అనంతరం ఈ ఐఈడీని సీఆర్‌పీఎఫ్ 196 బెటాలియన్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. మావోయిస్టుల కోసం భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. అందులోభాగంగా ఊసూరు- ఆనపల్లి రహదారిపై ఈ ఐఈడీని గుర్తించాయి.

మరోవైపు బీజాపూర్ జిల్లాలోని గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారు. ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఈ ఘటన స్థలంలో ఆయుధాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. గంగలూరు పీఎస్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భారీగా సమావేశమైనట్లు నిఘా వర్గాల ద్వారా భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు కూబింగ్ చేపట్టాయి. దీంతో మావోయిస్టులకు పోలీసులు తారస పడ్డారు. దాంతో మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. ప్రతిస్పందనగా పోలీసులు సైతం కాల్పులు జరిపారు.

%మరోవైపు గత నెల రోజులుగా ఛత్తీస్‌గఢ్‌లో పలు ఎన్‌కౌంటర్లు జరిగాయి. వీటిలో దాదాపు 50 మంది మావోయిస్టులు మరణించారు. ఇంకా చెప్పాలంటే.. జనవరి 16వ తేదీన బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఆ కొద్ది రోజులకే ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లోని గరియాబంద్ జిల్లా కుల్హాడీఘాట్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ చలపతి అలియాస్ జయరాం మృతి చెందారు. ఆయనపై రూ. కోటి రివార్డుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 24 మంది మరణించారు.

2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం పకడ్బందీ వ్యూహ రచనతో ముందుకు వెళ్తోంది. ఆ క్రమంలో గతేడాది అంటే..2024లో ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 219 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయని గణాంకాలు స్పష్టం చేశాయి. దేశంలో అన్ని రాష్ట్రాల్లో మావోయిస్టులు తుడిచి పెట్టుకు పోయారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కోరుకుపోయింది.. డీకే అరుణ షాకింగ్ కామెంట్స్

మహబూబ్ నగర్ జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. జడ్చర్లలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎంపీ డీకే అరుణ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరు సంతృప్తిగా లేరని అన్నారు.



ప్రజలతోపాటు ఎమ్మెల్యేల్లో కూడా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని చెప్పారు. ఎమ్మెల్యేలు బయట మాట్లాడలేక సమావేశాలు పెట్టుకుని ఇది అవినీతి ప్రభుత్వమని మాట్లాడుకుంటున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కోరుకుపోయింది ఇది పర్సంటేజీల ప్రభుత్వమని ఆరోపించారు. పదిశాతం కమీషన్లు ఇస్తే కానీ ఈ ప్రభుత్వంలో పనులు కావడం లేదని ఆరోపించారు. ఇప్పుడున్న ప్రభుత్వానికి అడ్మినిస్ట్రేషన్ అంటే ఏంటో తెలియదని.. పరిపాలన ఇప్పటివరకు గాడిలోనే పడలేదని విమర్శించారు. తెలంగాణలో అడ్మినిస్ట్రేషన్ కుప్పకూలిందని షాకింగ్ కామెంట్స్ చేశారు. ప్రభుత్వంలో ఉన్న వారందరూ కుర్చీల వేటలోనే ఉన్నారని డీకే అరుణ ఆరోపించారు.

భారత శక్తి
VOICE OF INDIAN

## కెనడా విపరీత పోకడ

ద్వైపాక్షిక సంబంధాలను నెరపడమంటే- రెండు దేశాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా కలుపుగోలుతనాన్ని ప్రదర్శించడం... పరస్పర ప్రయోజనాల సాధనకు ఉమ్మడిగా పనిచేయడం! దౌత్య చర్చలు, వాణిజ్య ఒప్పందాలు, సాంస్కృతిక ఆదాన ప్రదానాలు, భద్రతాపరమైన సహాయ సహకారాల ద్వారా దేశాల నడుమ చెలిమి బలోపేతమవుతుంది. తన సార్వభౌమాధికారానికి, సమగ్రతకు ప్రమాదకరమైన ఉగ్రవాదులు, ముష్కర సంస్థలు, సంఘవిద్రోహ కార్యకలాపాలను ఎదుర్కోవడంలో ఒక దేశానికి మరొకటి తోడ్పడటం కచ్చితంగా ఉభయతారకమవుతుంది. ఆ మేరకు పాటించాల్సిన అంతర్జాతీయ దౌత్య విలువలు, ద్వైపాక్షిక సహకార విధానాలను కెనడా ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. సరికదా, ఖలిస్థానీ ముష్కరులను చంకనెక్కించుకుంటూ ఇండియాతో కోరి తగువు పెట్టుకుంటోంది. ఏడాది కిందట హతమైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్‌కు కెనడా పార్లమెంటు ఇటీవల నివాళులు అర్పించడమే తీవ్ర వివాదాస్పదమైంది. ఇక తాజాగా నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ పేరు చేర్చేందుకు తెగబడటం- కెనడా కయ్యాలమారి పోకడలకు పరాకాష్ఠ!

హత్యలు మొదలు బాంబుపేలుళ్ల వరకు అనేక అకృత్యాలకు పాల్పడిన హర్దీప్ సింగ్ నిజ్జర్- రవిశర్మ పేరిట తప్పుడు పాస్‌పోర్టుతో కెనడాలో ఆశ్రయం పొందాడు. ఆ కర్కోటకుడికి పౌరసత్వం కట్టబెట్టిన కెనడా ప్రభుత్వం- అతడి హత్యకు సంబంధించి ఇండియాపై నిరాధార ఆరోపణలను గుప్పిస్తోంది. ఆ క్రమంలోనే భారత హైకమిషనర్, దౌత్యాధికారులపై అది బురదజల్లి ఇరుదేశాల నడుమ పెనుసంక్షోభానికి కారణమైంది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో రాజకీయంగా గడ్డు పరిస్థితులను చవిచూస్తున్నారు. జీవన వ్యయాలు పెరగడం, నేరాలు అధికం కావడం తదితరాలతో ప్రజల్లో ట్రూడో పరపతి వేగంగా తరిగిపోతోంది. రాబోయే ఎన్నికల్లో ఆయన పార్టీ గెలుపు కష్టతరం కానుందనే విశ్లేషణలూ కొన్నాళ్లుగా వెలువడుతున్నాయి. వాటికి తోడు ట్రూడో నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు న్యూ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షుడు జగ్మీత్ సింగ్ ఇటీవల ప్రకటించారు. ఈ పరిణామాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ట్రూడో తన రాజకీయ భవితకు ఇండియాతో మైత్రీబంధాన్ని బలిపెడుతున్నారు. కెనడాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న సిక్కుల ఓట్లకోసమే ఆయన ఖలిస్థానీలకు పక్కతాళమేస్తున్నారు!

నాలుగు దశాబ్దాల క్రితం పంజాబ్‌లో ఖలిస్థానీ ఉగ్రవాదులు సృష్టించిన రక్తపాతం అంతాఇంతా కాదు. ఇండియాను కుంగదీయాలన్న కుతంత్రంతో ఆ ముష్కరులకు పాకిస్థాన్ పాలుపోసి పెంచింది. కాలక్రమంలో దేశీయంగా ఖలిస్థానీ ఉగ్ర భావజాలానికి నూకలు చెల్లిపోయాయి కానీ, కెనడాలో అది బలంగా వేళ్లూనుకుంది. ఖలిస్థానీ ఉగ్రవాదులకు అండదండలందించే వేర్పాటువాద సంస్థలు కెనడాలో కనీసం తొమ్మిది ఉన్నట్లు అంచనా. వాటిని ట్రూడో సర్కారు కట్టడి చేయకపోగా, భారతదేశంపై నిత్యం విషం కక్కుతున్న వాళ్లపై అవ్యాజ ప్రేమానురాగాలను కురిపిస్తోంది. ఉగ్రవాదులకు కెనడా స్వర్గధామమైందన్నది ఇండియా విమర్శ మాత్రమే కాదు... 'ఇతర దేశాల భద్రతకు ముప్పు వాటిల్లజేసే అత్యంత కరుడుగట్టిన నేరమూకలకు కెనడా సురక్షిత స్థావరమైంది' అంటూ ఇంటర్నేషనల్ కోయలిషన్ ఎగైనెస్ట్ ఇల్లిసిట్ ఎకానమీస్ సంస్థ నిరుడే నివేదించింది. ఓటుబ్యాంకు రాజకీయాలకోసం భారత వ్యతిరేక శక్తులను, ముష్కర మిన్నాగులను ముద్దుచేస్తున్న ట్రూడో ధోరణి- భవిష్యత్తులో కెనడాకు ఆత్మవినాశకరంగా పరిణమిస్తుందన్నది పచ్చినిజం!

# పూర్తయినా నిరుపయోగం.. నిర్వహణలో నిర్లక్ష్యం!



వరంగల్ , అభివృద్ధి పనులు ప్రారంభించడం.. ఆ తర్వాత వదిలేయడం బల్దియా అధికారులకు అలవాటైపోయింది. స్మార్ట్‌సిటీ పథకం ద్వారా చేపట్టిన కోట్లాది రూపాయల ప్రాజెక్టులు, ప్రగతి పనులు అందుబాటులోకి తేవడంలో అధికారులు విఫలమవుతున్నారు. కీలకమైన అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలాయి. గతేడాది వరంగల్ పోతననగర్‌లో ప్రారంభించిన ఆధునిక దోబీఘాట్, ఆధునిక చెత్త రవాణా కేంద్రం నిరుపయోగంగా ఉంటున్నాయి. పురపాలక శాఖ సంచాలకులు వీపీ గౌతమ్ పర్యటనతోనైనా.. నగరంలోని ప్రగతి పనుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. తుప్పుపడుతున్న యంత్రాలు వరంగల్ పోతననగర్‌లో స్మార్ట్‌సిటీ ద్వారా సుమారు రూ.3.78 కోట్లతో ఆధునిక దోబీఘాట్ ఏర్పాటు చేశారు. గతేడాది 2023 అక్టోబరులో అప్పటి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దానిని ప్రారంభించారు. గ్రేటర్ వరంగల్, బీసీ సంక్షేమ శాఖల మధ్య సమన్వయలోపంతో ఆధునిక దోబీఘాట్‌లోని యంత్రాలు తుప్పు పడుతున్నాయి.పోతననగర్‌లో స్మార్ట్‌సిటీ పథకం కింద రూ.3 కోట్లతో ఆధునిక చెత్త రవాణా కేంద్రం గతేడాది అక్టోబరులో ప్రారంభించారు. ఏడాదిన్నర అవుతున్నా.. ఇంత వరకు అందుబాటులోకి రాలేదు.

బాలసముద్రం కేంద్రంలో ఇదే విధమైన పరిస్థితి నెలకొంది.ఇతర పనులుఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) పనులు ఏడాదిన్నర నుంచి కొనసాగుతున్నాయి. సీసీ కెమెరాలు, వైఫై కేంద్రాలు, ఇతర పనులు తుది దశలో ఉన్నాయి. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఐసీసీసీ కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉంది.చింతగట్టులో వీధి కుక్కల శస్త్ర చికిత్సల కోసం అదనంగా యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ) ఏర్పాటు చేస్తున్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయి.నగరంలో నేడు వీపీ గౌతమ్ పర్యటనగ్రేటర్ వరంగల్‌లో జరుగుతున్న ముఖ్యమైన అభివృద్ధి పనులు, చింతగట్టులో ఏబీసీ కేంద్రం, బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ), రాంపూర్ డంపింగ్‌యార్డులో బయోమైనింగ్ పనులను పరిశీలించడానికి సోమవారం తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ.గౌతమ్ వరంగల్ నగరానికి రానున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 వరకు కమిషనర్ డా.అశ్విని తానాజీతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.

# విహారం.. కారాదు విషాదం



వాజేడు, ఫిబ్రవరి 2,జలపాతాలు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లిన వారు మృత్యువాత పడుతున్న సంఘటనలు ఇటీవల తరచూ జరుగుతున్నాయి. తాజాగా భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని చలివాగులో మునిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. నిషేధిత ప్రదేశాల వద్దకు వెళ్లకూడదని అటవీ అధికారులు, పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నా పర్యాటకులు పట్టించుకోవడం లేదు. తెలంగాణ నయాగరా జలపాతంగా ప్రసిద్ధి చెందిన బొగతలో ఇప్పటికి సుమారు 23 మంది, దుసపాటిలొద్ది జలపాతంలో ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. వీరిలో యువకులే అధికంగా ఉన్నారు. వారి కుటుంబాల్లో విషాదం మిగిల్చారు. మండలంలో పర్యాటకుల రద్దీని గుర్తించిన పోలీసులు వాహన తనిఖీలు చేపడుతూ నిషేధిత జలపాతాల సందర్శనకు అనుమతి లేదని చెబుతున్నారు. అయినప్పటికీ పర్యాటకులు మండలంలోని దుసపాటిలొద్ది జలపాతం, అరుణాచలపురంలోని బొల్లిగుండం జలపాతాల వద్దకు అడ్డదారుల్లో వెళ్తున్నారు. అటవీ సిబ్బంది కళ్లుగప్పి వెళ్లడం షరా మామూలుగా మారింది. ఈ ఏడాది బొగత జలపాతం వద్ద కొలనులో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనను మరువకముందే గత ఆదివారం దుసపాటిలొద్ది జలపాతానికి వెళ్లిన ఏడుగురు స్నేహితుల్లో ఒకరు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందాడు.ఆగని సందర్శకులు వాజేడు మండలంలోని దుసపాటిలొద్ది, బొల్లిగుండం జలపాతాల సందర్శనకు వస్తున్న పర్యాటకులను అటవీశాఖ, పంచాయతీ సిబ్బంది అడ్డుకుంటున్నా ఆగడంలేదు. లోతైన ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. దుసపాటిలొద్ది జలపాతంలో నీటి ధారలు లేకపోయినా వెళ్తున్నారు. రహదారి నుంచి కనీసం రెండు, మూడు కి.మి.దూరమైనా నడిచి వెళ్లేందుకు పర్యాటకులు వెనుకాడడంలేదు.నిషేధిత ప్రాంతాల సందర్శన మన్యంలోని గుట్టల సమీపంలో పలు జలపాతాలు ఉన్నాయి. వాటిని సందర్శించేందుకు వెళ్లడం ప్రమాదకరం. దట్టమైన అడవిలో వన్యమృగాలు సైతం సంచరిస్తుంటాయి. కొంగాల సమీపంలోని అడవిలో మూడేళ్ల క్రితం చిరుతపులి సంచరించింది. వన్యమృగాలతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని అటవీ అధికారులు చెబుతున్నా పర్యాటకులు ఖాతరు చేయడంలేదు. ప్రకృతి అందాలను తిలకించేందుకు అనుమతి ఉన్న పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలని, నిషేధిత ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దంటూ అటవీ, పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

# ఉపాధి పనుల్లో బయటపడని అక్రమాలెన్నో!



జనగామ ఫిబ్రవరి 2 గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు వలస బాట పట్టకుండా కనీసం వంద రోజులు పని కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం-2005ను అమలు చేస్తోంది. ఈ పథకంలో కూలీలకు పనులు కల్పించడం ఒక వంతయితే.. అక్రమార్కులకు వరంగా మారుతోందని పలు సామాజిక తనిఖీల్లో వెల్లడవుతోంది. క్షేత్ర స్థాయిలో పనులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో భారీగా అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. సోషల్ ఆడిట్ సిబ్బంది ఆ పనుల తనిఖీకి వెళ్లినప్పటికీ గుర్తించినవి కొన్నే అయినా.. గుర్తించనివి మరెన్నో ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కూలీల హాజరులో అవకతవకలు..ఉపాధి హామీ పథకంలో లేబర్, మెటీరియల్ పేమెంట్స్ రెండు రకాల నిధులుంటాయి. మెటీరియల్(కట్టడాలు, నిర్మాణాలు) కొలతల ప్రకారం ఉంటాయి. కట్టడాలు నిర్మించిన వాటి వివరాలు కంటికి, రికార్డుల ప్రకారం కనిపిస్తుండగా, లేబర్ పెమెంట్స్‌లో పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగేందుకు వీలు ఉండటంతో దీనినే ఆ శాఖాధికారులు, సిబ్బంది ఆసరా చేసుకొని అక్రమాలు, అవినీతికి తెరలేపుతున్నట్లు తెలుస్తోంది. కూలీలు తక్కువగా హాజరైనా, ఎక్కువగా నమోదు చేస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. పనులు చేయకున్నా.. చేసినట్లు నమోదు..పాలకుర్తి, లింగాలఘనపురం, నర్మెట్ట, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలంలో ఈ ఏడాదికి గాను ఫిబ్రవరి 22న ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీలు చేపట్టగా, పనుల నిర్వహన సరిగా లేనందున అధికారులు, సిబ్బందికి రూ.99525 జరిమానా విధించారు.లింగాలఘనపురం మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో రూ.2.85 కోట్లతో చేపట్టిన 467 పనుల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఇందులో జరిగిన అవకతవకలకు గాను ఎఫ్ఏలకు రూ.13వేలు, టీఏలకు రూ.4వేలు, గ్రామ కార్యదర్శులకు రూ.7 వేలు జరిమానా విధించినా, చెల్లింపులు జరగలేదు. నోటీసులు జారీ చేసినట్లు ఎపీవో భిక్షపతి తెలిపారు.నర్మెట్ట మండలం ఇసుకబాయి తండాలో పనులు చేయకున్నా చేసినట్లుగా నమోదు చేయడంపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు 33 మందిపై అభియోగాలు రాగా, రూ.62వేలు తీసుకున్నట్లుగా అధికారులు గుర్తించారు. దీనికి మేట్‌ను బాధ్యుడిని చేస్తూ తొలగించి, ఎఫ్ఏకు సంజాయిషి ఇవ్వాలని నోటీసు జారీ చేశారు.నర్మెట్ట మండలం ఇసుకబాయి తండాలో సామాజిక తనిఖీ (పాత చిత్రం)రికవరీలో ఉదాసీనత?..జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చిల్పూరు, తరిగొప్పుల, జఫర్‌గఢ్, లింగాలఘనపురం, నర్మెట్ట, పాలకుర్తి మండలాల్లో సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో పర్యటించి పనుల వివరాలు సేకరించి జరిగిన పనులు, ఖర్చు నిధులు, లబ్ధిదారులు, కూలీలకు నిధుల చెల్లింపు వివరాలు సేకరిస్తున్నారు. బాధితుల ఫిర్యాదులతో ఆయా ప్రాంతాల్లో ప్రజా వేదిక నిర్వహించి, ముఖాముఖి చేపడుతున్నారు. అవకతవకలు జరిగినట్లుగా నిరూపితమైతే అందుకు బాధ్యులైన వారికి జరిమానా విధిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అక్రమాలు జరిగినట్లుగా నిరూపితమైనా, రికవరీలో ఉదాసీనత కనబరుస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.ఉపాధి హామీ పథకం..ఆర్థిక సంవత్సరం: 2023-2ఇప్పటి వరకు తనిఖీల్లో దుర్వినియోగమైన నిధులు: రూ.11,26,652రికవరి జరిగినవి: రూ.6,15,564, జరగనివి: రూ.5,11,088

# క్రీడాకారుల ఎంపిక పూర్తి.. ప్రవేశాలకు కుస్తీ

వరంగల్‌ఫిబ్రవరి 2 ,విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పట్టుసాధిస్తే.. ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో ప్రావీణ్యం సాధించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ క్రీడా పాఠశాలలు, వసతిగృహాలు అందుబాటులో ఉన్నాయి. అందులో భాగంగా హనుమకొండలోని ప్రాంతీయ క్రీడా వసతిగృహంలో ప్రవేశాలకు రెజ్లింగ్(కుస్తీ) క్రీడాకారులకు అవకాశం కల్పించారు. ఎంపికలు పూర్తి చేసిన అధికార యంత్రాంగం ఇప్పటి వరకు ప్రక్రియ పూర్తి చేయలేదు. దీంతో ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులు అసహనానికి గురవుతున్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారు. జాతీయస్థాయి మాజీ క్రీడాకారులు, ఎన్ఎస్ఐ(నేషనల్ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్)లో తర్ఫీదు పొంది.. ప్రావీణ్యం కలిగిన కోచ్‌లు ఉన్నారు. సుమారు 150 మంది క్రీడాకారులు శిక్షణ పొందేందుకు ప్రభుత్వ అనుమతి ఉంది. కానీ ప్రతిభావంతులైన ఆటగాళ్ల గుర్తింపు, సత్ప్రవర్తన, క్రమశిక్షణ పాటించని వారిని పరిగణనలోకి తీసుకోకపోవడం తదితర కారణాలతో క్రీడాకారుల సంఖ్య 50 శాతానికి చేరింది. దీంతో అదనంగా ఈత(స్విమ్మింగ్), రెజ్లింగ్ క్రీడల కోసం ప్రవేశాలు కల్పించారు. జులై 3, 4వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఎంపికలు చేశారు. ఈత పోటీలకు సరైన సంఖ్యలో క్రీడాకారులు హాజరుకాకపోవడంతో దానిని ప్రాంతీయ క్రీడా వసతిగృహం నుంచి తొలగించారు. 20 మందిని గుర్తించినా..!హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎంపిక ప్రక్రియకు రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో నిర్దేశించిన శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు వరంగల్, నల్గొండ, ఖమ్మం, నిజామాబాద్ నుంచి 70 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అత్యుత్తమ నైపుణ్య ప్రదర్శన కనబర్చిన 20 మంది క్రీడాకారులను హైదరాబాద్ నుంచి వచ్చిన రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ కమిటీ ఎంపిక చేసింది. అయినా.. ఎంపికైన క్రీడాకారులకు ఇప్పటి వరకు ప్రవేశాలు కల్పించలేదు. దీంతో ఎంపికైనవారు ఎక్కడ చదువుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

# లేబుల్ మార్చి.. జనాన్ని ఏమార్చి



బేగంబజార్, ఫిబ్రవరి 2, ప్రముఖ కంపెనీల లేబుళ్లను ఉపయోగించి కల్తీసరకు విక్రయిస్తున్న ముగ్గురు వ్యాపారులను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర ఆదివారం తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన రమేష్‌కుమార్(40), హితేశ్ పవార్(22), రమేష్‌కుమార్(34) బతకుదెరువు కోసం నగరానికి వచ్చారు. బేగంబజార్, గోషామహల్, ఎర్రగడ్డ ప్రాంతాల్లో కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్నారు. అక్రమంగా డబ్బు సంపాదించేందుకు నకిలీ దందా చేపట్టారు. ప్రతి ఇంటా నిత్యం ఉపయోగించే వస్తువులను కల్తీ చేసి విక్రయించడం ప్రారంభించారు. గుడ్‌నైట్ లిక్విడ్స్, కాయిల్స్ సర్ఫేస్, క్లీనర్ లిక్విడ్స్, ఫెవిక్విక్ కంపెనీల నకిలీ లేబుళ్లను తయారు చేయించారు. వారు తయారు చేసిన వస్తువులకు ఆయా లేబుళ్లను అంటించి నగరం, శివారులోని పలు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఎంతోకాలంగా సాగుతున్న కల్తీదందాపై సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ మధ్య మండలం ఇన్‌స్పెక్టర్ ఎన్.రామకష్ణ, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బృందం శుక్రవారం నిందితుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా కంపెనీల ప్రతినిధులను తీసుకొచ్చి సామగ్రిపై అంటించిన లేబుళ్లను నకిలీవిగా గుర్తించారు. రూ.2లక్షల విలువైన కల్తీసరకు స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసి బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

# జిల్లా అభివృద్ధికి ముడా..!

మహబూబాబాద్, ఫిబ్రవరి 2,జిల్లాను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాలను మినహాయించి ప్రత్యేకంగా మహబూబాబాద్ పట్టణ అభివృద్ధి సంస్థ (ముడా)ను ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలను కలిపి దశలవారీగా మౌలిక సౌకర్యాలు కల్పించనుంది. ఈ ప్రాంతాలను ప్రగతిలో ముందుకు తీసుకెళ్లేందుకు నిర్ణయించిన ప్రభుత్వం జిల్లాల వారీగా ప్రతిపాదనలు స్వీకరిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 18 మండలాలతో ఉన్న మహబూబాబాద్ జిల్లాలో 13 మండలాల్లోని 163 రెవెన్యూ గ్రామాలను కలిపి ప్రత్యేక అభివృద్ధి సంస్థ ఏర్పాటు దిశగా సంబంధిత శాఖల అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు సమాచారం. ప్రతిపాదించిన మండలాలు: మహబూబాబాద్ జిల్లా ఐదు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. 'ముడా'లో డోర్నకల్ నియోజకవర్గంలోని డోర్నకల్, కురవి, సీరోలు, మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి మండలాలు, అలాగే మహబాబాబాద్ నియోజకవర్గంలో మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాలు, పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు, పెద్దవంగర మండలాలు చేరనున్నాయి. ములుగు నియోజకవర్గం పరిధిలోని కొత్తగూడ, గంగారం, ఇల్లందు నియోజకవర్గంలో బయ్యారం, గార్ల, మహబూబాబాద్ నియోజకవర్గంలోని గూడూరు మండలం ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నందన ముడాలో వాటిని మినహాయించారు. ప్రస్తుతం ఉన్న వనరులు, సమస్యలు వాటి పరిష్కారానికి ముడా ప్రత్యేక వ్యవస్థగా ఏర్పాటై అభివృద్ధిపైనే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లనుంది. జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారుల ప్రాంతాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యమివ్వనున్నారు.

జాతీయ రహదారులను అనుసంధానిస్తూ..జిల్లాలోని మూడు ప్రధాన జాతీయ రహదారులతో పాటు గ్రీన్‌ఫీల్డ్ హైవేలను అనుసంధానిస్తూ ఆ రహదారుల పొడవునా అభివృద్ధికి ప్రణాళికలను రచిస్తోంది. ప్రధానంగా పట్టణ ప్రణాళిక శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖలు అధికారులు 'ముడా'గా ఏర్పాటు చేసి ప్రభుత్వం అధికారులు, రాజకీయ నేతల ప్రతినిధులతో కలిపి ప్రత్యేక పాలక వర్గాన్ని నియమించనుంది. ఆ పాలకవర్గ పర్యవేక్షణలో పట్టణ విస్తరీకరణ, అభివృద్ధి పనులు అమలుకానున్నాయి. ఈ సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు వచ్చే అవకాశం ఉంది.

# యంత్రాలు మూలకు.. కార్మికులతోనే పనులు



కరీంనగర్ ,ఫిబ్రవరి 2

:కరీంనగర్ నగర పాలక సంస్థ పారిశుద్ధ్య పనుల నిర్వహణ, శుభ్రతలో పేరుగాంచింది.. దీని పేరు ఇలాగే కొనసాగించి మరింత మెరుగుపర్చేలా అధికార యంత్రాంగం పని చేయాల్సి ఉండగా.. సమీక్షలు సమావేశాలకే పరిమితమవుతూ వాహనాల మరమ్మతులు అటకెక్కించారు. ఇంకేముంది దీని ప్రభావం కొన్ని నెలలుగా కనిపిస్తోంది. నగరంలోని 60 డివిజన్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు, రాత్రి నుంచి వేకువజామున వరకు రెండు విడతలుగా పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. రహదారులు, మురుగుకాలువలు, చెత్త సేకరణ వంటి పనులు చేస్తుండగా ప్రధాన రహదారులు ఊడ్చేందుకు ప్రత్యేక యంత్రాలను ఉపయోగిస్తారు.ఏడింటిలో అయిదు..నగరంలో 14.5 కిలోమీటర్ల పొడవునా ఉన్న తారు రోడ్లను రెండు వైపులా ఊడ్చేందుకు ఏడు వాహనాలను ఇన్నాళ్లు వినియోగించారు. కమాన్ నుంచి హైదరాబాద్ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం నుంచి పద్మనగర్ బైపాసు, బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి రామగుండం బైపాసు రోడ్డు, కమాన్ నుంచి బస్టాండ్ మీదుగా పద్మనగర్ శివారు వరకు, తెలంగాణ చౌక్ నుంచి ఆర్అండ్బీ మీదుగా జగిత్యాల రోడ్డు, కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా మీదుగా చొప్పదండి రోడ్డు, మంచిర్యాల చౌరస్తా నుంచి పెద్దపల్లి రోడ్డు, కమాన్ నుంచి తీగల వంతెన రోడ్డుతోపాటు అంతర్గత వీధుల్లోని తారు రహదారులన్నీ ఊడ్చే యంత్రంతోనే ఊడిపించాల్సి ఉంటుంది. మొత్తం ఏడు వాహనాల్లో పెద్దవి 5, చిన్నవి 2 ఉన్నాయి. ప్రస్తుతం పెద్ద వాహనాలు రెండు మాత్రమే పని చేస్తుండగా ఇవి కూడా ఏ సమయంలో నిలిచిపోతాయో తెలియదు.ఎందుకింత నిర్లక్ష్యంపారిశుద్ధ్య పనులు చేసే ట్రాక్టర్లు, ఆటోలు, ఊడ్చే యంత్రాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉండగా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అయిదు వాహనాలకు బ్రష్లు, బేరింగ్లు, సెల్ఫ్ మోటార్లు పాడయ్యాయి. నెలల తరబడి మూలన పడేయడంతో వాటి బ్యాటరీలు కూడా చెడిపోయాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

# చదువుతున్నారా.. బడి మానేశారా?

పెద్దపల్లి ,ఫిబ్రవరి 2



:ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తేల్చలేక విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఏడాది ప్రవేశాల గడువు ముగిసినప్పటికి తుది జాబితా కొలిక్కిరాలేదు. పిల్లలు చదువుతున్నారా? బడి మానేశారా? అనే ప్రశ్నలకు పొంతన కుదరడం లేదుఎందుకింత నిర్లక్ష్య కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీకృత జిల్లా విద్యా సమాచారం) తెచ్చింది. రెండేళ్ల కిందట దీన్ని యూడైస్ ప్లస్గా మార్చారు.ఏటా విద్యార్థుల సమగ్ర వివరాలు పొందుపరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 30,135 మంది పిల్లల సమాచారం లేదు.బడి ఈడు పిల్లలు చదువుతున్నారా? బడి బయట ఉన్నారనే విషయం తేల్చేందుకు యూడైస్ ప్లస్ నివేదిక తేల్చుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నివేదిక కొలమానం కానుంది ప్రవేశం పొందిన విద్యార్థి ఆధార్ అనుసంధానిస్తున్నారు. దీంతో ఒక విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండే అవకాశం లేదు.వివరాలు నమోదు చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పోర్టల్లో నమోదు కాని విద్యార్థుల వివరాలపై ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ ఫలితం లేదు.నెలల తరబడి హాజరు కాకున్నా..బడుల్లో బోగస్ సంఖ్య తప్పించుకునేందుకు ఎత్తుగడ వేస్తున్నారు. కొందరికి ఆధార్ వేలిముద్రలు పడటంలేదని.. మరికొందరు ఉపాధి కోసం వలస వెళ్లి మళ్లీ ఇక్కడినే చదువుకుంటారని.. ఆధార్ నవీకరణలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని.. ఇలా కుంటిసాకులు చెబుతున్నారు. కొన్ని చోట్ల నెలల తరబడి పిల్లలు హాజరు కాకున్నా వారి రిజిస్టర్లో నమోదవుతున్నాయి. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ నుంచి బదిలీ లేదా డిప్యుటేషన్పై పంపిస్తారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారిస్తే బోగస్ సంఖ్య తేలనుంది.బోగస్ లెక్కలేనా?పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పర్మనెంట్ ఎడ్యుకేషనల్ నంబర్) కేటాయించి పోర్టల్లో నమోదు చేస్తారు. ఒక పాఠశాల నుంచి మరో బడికి మారినా, టీసీ తీసుకుని వెళ్లినా యూడైస్లోని డ్రాప్ బాక్స్లో వేస్తారు. ఈ శాశ్వత సంఖ్య ఆధారంగా ప్రవేశం కల్పిస్తే ఎక్కడ చదువుతున్నారో తెలుస్తుంది. ఒక వేళ బోగస్ పిల్లల నమోదు చేసినా వేరే చోట చేరకపోయినా డ్రాప్బాక్స్లో సంఖ్య కనిపిస్తుంది. విద్యార్థుల వివరాలు లేనివారివే డ్రాప్బాక్స్లో ఉంటాయి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 30,135 మంది పిల్లల సమాచారం తేలాల్సి ఉంది. వాస్తవంగా వీరంతా చదువుతున్నారా లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక కార్యాచరణప్రతి విద్యార్థిని పోర్టల్ నమోదు చేస్తున్నాం. జిల్లాలో డ్రాప్ బాక్స్లో ఉన్న వివరాలను తొలగించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం. తమ పరిధిలోని సంఖ్యను తేల్చాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశిస్తున్నాం. నిర్లక్ష్యం చేసిన యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.మాధవి, జిల్లా విద్యాధికారిజిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య

# క్రమబద్ధీకరణలో నిర్లక్ష్యం.. కారణాలనేకం!



గోదావరిఖని పట్టణం,'ఫిబ్రవరి 2

:నాలుగేళ్ల నుంచి లక్షలమంది లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు ఎదురుచూస్తున్నారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ చురుగ్గా సాగడం లేదు. కలెక్టర్లు ఉదాసీనంగా ఉండటం సరికాదు. వెంటనే దృష్టి సారించాలి'.ఈ నెల 1న జిల్లా పాలనాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.నాలుగేళ్ల క్రితం నిర్ణీత గడువులోగా జిల్లాలోని పట్టణాల్లో 19,178.. గ్రామీణ ప్రాంతాల్లో 6,273 దరఖాస్తులురాగా వాటి పరిష్కారం నత్తనడకన సాగుతుంది. ప్రస్తుతం మంత్రి ఆదేశాల మేరకు.. ఆయా దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు ఆయా దరఖాస్తుదారులకు స్వయంగా ఫోన్ చేసి నిర్ణీత రుసుం చెల్లించి సంబంధిత స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు కోరుతున్నా.. స్పందన నామమాత్రంగానే ఉంటుంది.చెల్లింపునకు వెనుకంజఅన్ని దస్త్రాలు సవ్యంగా ఉన్నప్పటికీ నిర్ణీత రుసుం చెల్లించలేక స్థలాలను క్రమబద్ధీకరించుకోలేనివారు కొందరైతే.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ నాలుగేళ్ల క్రితం నాటిది. గడిచిన సమయంలో ఇప్పటికే సంబంధిత స్థలం ఇద్దరు, ముగ్గురి చేతులు మారడం(క్రయ, విక్రయాలు)తో మొదట దరఖాస్తు చేసుకున్న వ్యక్తి.. ఇప్పుడా స్థలం యజమాని కాకపోవడంతో స్పందించడం లేదు.అత్యధిక దరఖాస్తులు వివిధ కారణాలతో ఎల్ఆర్ఎస్ పరిధిలోకి రాకుండా నిషేధిత జాబితాలో చేరాయి. దరఖాస్తుదారులు సంబంధిత శాఖాధికారులను సంప్రదించి ఆయా స్థలం.. నిషేధిత జాబితాలో లేనట్లుగా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తికానుంది. ఇప్పటికే కొందరు జరిమానాతో రుసుం చెల్లించి ప్రభుత్వ అనుమతి తీసుకొని భవనాలు నిర్మించుకున్నారు. నాలుగేళ్ల క్రితం వీరు సమర్పించిన దరఖాస్తులు ఇప్పుడు పెండింగ్ జాబితాలో ఉన్నాయి. అప్పుడు హడావుడిగా కేవలం రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసినవారు.. ప్రస్తుతం నిర్ణీత రుసుం చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు.ప్రత్యేక మొబైల్ యాప్..ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా మొబైల్ యాప్ను రూపొందించారు. దీనిలో భాగంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్, నీటిపారుదలశాఖ ఏఈ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ప్రత్యేకంగా దరఖాస్తుల ప్రక్రియలో లాగిన్ సదుపాయం కల్పించారు.ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం..మనోహర్, కమిషనర్, మంథని మున్సిపాలిటీఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. మరోవైపు దరఖాస్తుదారుల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఆమోదం పొందిన దరఖాస్తుదారులను నిర్ణీత రుసుం చెల్లించాల్సిందిగా కోరుతున్నాం.

## పౌర సేవల్లో జాప్యమేల?

పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని: పురపాలికల్లో వివిధ పౌరసేవలను నిర్ణీత గడువులోగా అందించాల్సి ఉంటుంది కానీ.. గత నెలరోజులుగా జిల్లాలోని వివిధ పురపాలికలు ఇన్ఛార్జి అధికారులు ఏలుబడిలో ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ కారణాలతో వెళ్లిపోయినా.. అధికారుల స్థానంలో కొత్తవారి నియామకం జరగకపోవడంతో ఇన్ఛార్జిలే పరిపాలన సాగిస్తున్నారు.ఇదీ పరిస్థితి రామగుండం నగరపాలిక కమిషనర్గా జిల్లా అదనపు పాలనాధికారి అరుణశ్రీ, మంథని కమిషనర్గా పురపాలిక సూపరింటెండెంట్ మనోహర్, సుల్తానాబాద్ పురపాలిక ఇన్ఛార్జి కమిషనర్గా పెద్దపల్లి కమిషనర్ వెంకటేశ్ వ్యవహరిస్తున్నారు.వారం క్రితం ఇన్ఛార్జి అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయి కానీ.. పౌరసేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందడం లేదు. పెద్దపల్లి పురపాలికలో వివిధ అంశాలపై నిత్యం 40 నుంచి 50 దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. జనన, మరణ ధ్రువీకరణలతోపాటు పేరు మార్పిడి, ఇంటి అనుమతులు తదితర సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి.సుల్తానాబాద్ పురపాలిక కమిషనర్ రెండు నెలలుగా లేకపోవడంతో కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.వారం క్రితం పెద్దపల్లి కమిషనర్కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడంతోపాటు అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయి రెండు నెలలుగా జనన, మరణ ధ్రువీకరణల కోసం 87 దరఖాస్తులు రాగా వాటిలో నిర్ణీత గడువు దాటిన తరువాత కూడా 25 దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదు.

# వ్యర్థాల శుద్ధిలో వెనకడుగు




సిరిసిల్ల: ఫిబ్రవరి 2

జిల్లా 2017లో ఓడీఎఫ్గా, 2022లో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ స్థానం దక్కించుకుంది. తర్వాత వాటర్ప్లస్ హోదాకు వెళ్లాలి. దీనికి జిల్లాలోని పురపాలికలు, ఎంపిక చేసిన పంచాయతీల్లో మానవ ద్రవ వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి పూర్తిస్థాయిలో జరగాలి. జిల్లాలోని పురపాలికల్లో ఎఫ్ఎస్టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్)లు అందుబాటులో ఉన్నా నిర్వహణలో మాత్రం వెనకనే ఉంది. ఇప్పటికే కేంద్రం నుంచి స్వచ్ఛభారత్ మిషన్ బృందం జిల్లాలో పర్యటించి వివరాలు సేకరించాల్సి ఉంది. ఈ ఏడాది ఆలస్యమైంది. వీటి ఆధారంగానే దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ ర్యాంకులు ప్రకటిస్తారు. ఈ సారి జిల్లాకు చోటు లభించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.నీరుగారిన నిర్వహణసిరిసిల్ల పురపాలికలో 2019లోనే ఎఫ్ఎస్టీపీ వినియోగంలోకి వచ్చింది. దీని సామర్థ్యం 18 కేఎల్ (రోజుకు కిలోలీటర్లు). అంటే రోజుకు సగటున 12 వాహనాల మానవ ద్రవవ్యర్థాలు వచ్చినా నిల్వ చేసుకుని శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం 5 కేఎల్ కూడా రావడం లేదు. అంటే పూర్తి సామర్థ్యంలో 30 శాతం కూడా శుద్ధి జరగడం లేదు.ద్రవవ్యర్థాలను సిరిసిల్లలోని ఎఫ్ఎస్టీపీకి తరలించడం, దాని నిర్వహణను మెప్మాలోని మహిళా సంఘానికి అప్పగించారు. దీనికోసం 2023లో ఎన్ఎస్కేఎఫ్డీసీ (నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్) రెండు వాహనాల కొనుగోలుకు రూ.68 లక్షల రుణం మంజూరు చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో వీటి కొనుగోలుకు తీసుకున్న అప్పులకు బ్యాంకులో వాయిదాలు చెల్లించలేని పరిస్థితి ఉంది.వేములవాడ పురపాలికలోనూ రూ.60 లక్షల వ్యయంతో జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో ఎఫ్ఎస్టీపీని నిర్మించారు. రెండేళ్లుగా పనులు చివరి దశలోనే నిలిచిపోయాయి. కారణం గుత్తేదారుకు ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. ఇక్కడ నిర్వహణ బాధ్యతలు కూడా గుత్తేదారు సంస్థదే ఉంటుంది. దీని తర్వాత ట్రయల్ రన్ చేయాలి.పురపాలికలు, పంచాయతీల్లో మరుగుదొడ్ల ట్యాంకులను శుభ్రం చేసుకోవడంపై స్వచ్ఛభారత్ మిషన్ సిబ్బందితోపాటు స్థానిక అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. అక్కడే శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం. ప్రతి మూడేళ్లకోసారి జరగాలి. ఇలా చేయడం వల్ల వాటి జీవితకాలం పెరగడంతోపాటు భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయి. కానీ వీటిపై అవగాహన లేక శుభ్రతకు ముందుకు రావడం లేదు.వేములవాడలో ప్రారంభానికి నోచుకోని ఎఫ్ఎస్టీపీ'స్వచ్ఛభారత్ మిషన్తో దేశ శ్రేయోభివృద్ధికి సరికొత్త మార్గం ఏర్పడింది. 21వ శతాబ్దంలో విజయవంతమైన ప్రజా ఉద్యమం. పరిశుభ్రత వారసత్వంగా మారాల్సిన అవసరం ఉందని, దీని ప్రభావం ప్రజారోగ్యంపైన, వారి జీవన విధానాలపైన సానుకూల ప్రభావం చూపిస్తుంది.'అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ మిషన్ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ అన్న మాటలు ఇవి.బ్యాంకు వాయిదాలు చెల్లించలేని పరిస్థితి2023 మార్చిలో రూ.34 లక్షల బ్యాంకు రుణంతో మానవ ద్రవ వ్యర్థాలను తరలించే వాహనాన్ని కొనుగోలు చేశాం. ప్రతి నెలా సగటున రూ.80 వేల ఆదాయం ఉంటేనే బ్యాంకుకు చెల్లించాల్సిన అసలు, వడ్డీ పోనూ రూ.20 వేల ఆదాయం ఉంటుంది. దీనిపై ప్రజలకు అవగాహన లేక ప్రస్తుతం నెలకు రూ.25 వేలకు మించి రావడం లేదు. బ్యాంకు వాయిదాలకు అదనంగా రూ.15 వేలు కలిపి కట్టాల్సి వస్తుంది. దీనికి తోడు ఎఫ్ఎస్టీపీలో పని చేసే నలుగురు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉంది.


# జుడా ఏర్పాటుకు అడుగులు

జగిత్యాల: ఫిబ్రవరి 2



జగిత్యాల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(జుడా) ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. జుడా ఏర్పాటు చేయాలని ఆరేళ్ల కిందట ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలోనూ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మొదట 53 గ్రామాలతో జగిత్యాల, 17 గ్రామాలతో కోరుట్ల, 22 గ్రామాలతో మెట్పల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరోసారి జగిత్యాలలో ఒకటి, కోరుట్ల, మెట్పల్లి పట్టణాలు 44 గ్రామాలు కలిపి మరో అథారిటీ ఏర్పాటు చేయాలని భావించారు. మరోసారి జిల్లాలోని అన్ని పట్టణాలు, 382 గ్రామ పంచాయతీలను కలిపి ఒకే అథారిటీగా ఏర్పాటు చేయాలని ఆలోచించారు. చివరికి కేవలం జిల్లా కేంద్రంతోపాటు చుట్టు పక్కల 15 కి.మీ పరిధిలోని గ్రామాలను కలిపి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు జగిత్యాల పట్టణం చుట్టుపక్కల 53 గ్రామాలను కలుపుతూ జుడాను ప్రతిపాదించారు.ప్రయోజనంఅర్బన్ డెవలప్మెంట్ అథారిటీతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కానుంది. సంస్థకు ఛైర్మన్ను ప్రభుత్వం నియమిస్తుంది. వైస్ ఛైర్మన్గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. గ్రామపంచాయతీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. జుడా పరిధిలోని పట్టణం, గ్రామాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులు చేపట్టే వీలుంటుంది. రహదారులు, మురుగుకాలువల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు తదితర అభివృద్ధికి నిధులు వస్తాయి. అంతేగాకుండా ప్రణాళిక విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. బహుళ అంతస్థుల నిర్మాణాలు పరిశ్రమల ఏర్పాటు తదితర అనుమతులన్నీ జుడా ఇస్తుంది.జుడాలో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ఏడు మండలాల్లోని 53 గ్రామాలను ప్రతిపాదించారు జగిత్యాల పట్టణం, అర్బన్ మండలం: హస్నాబాద్, అంబారిపేట, మోతె, తిప్పన్నపేట, ధరూర్ గ్రామాలు.జగిత్యాల రూరల్ మండలం: పొలాస, హైదర్పల్లి, కండ్లపల్లి, చెర్లపల్లి, హన్మాజిపేట, పోరండ్ల, బాలపల్లి, నర్సింగాపూర్, వంజరిపల్లి, వెల్దుర్తి, గొల్లపల్లి, తిమ్మాపూర్, జాబితాపూర్, ధర్మారం, లక్ష్మిపూర్, అనంతారం, చల్గల్, తాటిపల్లి, అంతర్గాం, గుట్టరాజ్పల్లి, కన్నాపూర్, తక్కళ్లపల్లి, గుల్లపేట, మోరపల్లి గ్రామాలు.సారంగాపూర్ మండలం: పెంబట్ల, కోనాపూర్, లచ్చక్కపేట, నాగునూరు, రంగపేట, లక్ష్మిదేవిపల్లి, అర్పపల్లి.మేడిపల్లి మండలం: కాచారం, విలాయతాబాద్, మేడిపల్లి, గుండ్లపల్లి, రంగాపూర్, కట్లకుంట, తొంబరావుపేట గ్రామాలు.మల్యాల మండలం: రాజారం, పోతారం, రామన్నపేట, నూకపల్లి.గొల్లపల్లి మండలం: బిబిరాజ్పల్లి, వెంగళాపూర్, ఇబ్రహీంనగర్, తిర్మలాపూర్.రాయికల్ మండలం: అల్లీపూర్, కిష్టంపేట గ్రామాలను జుడాలో ప్రతిపాదించారు.అభివృద్ధికి అవకాశంరాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు జగిత్యాల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(జుడా) ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. జిల్లా కేంద్రం సహా చుట్టు పక్కల మండలాల్లోని 53 గ్రామాలను జుడాలో చేర్చాం. జుడా ఏర్పాటుతో గ్రామ పంచాయతీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అథారిటీ పరిధిలోని పట్టణం, గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందే అవకాశం లభిస్తుంది.

# పెరిగిన వ్యయం.. సేకరణ భారం



సారంగాపూర్: ఫిబ్రవరి 2ప్రతి సీజన్లో కొనుగోలు కేంద్రాలలో నిర్వహణ వ్యయం పెరుగుతూ రావడం.. అందుకు అనుగుణంగా కమీషన్ పెంచకపోవడం.. సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో మహిళా సంఘాలకు ధాన్యం సేకరణ భారంగా మారింది. గత రెండు సీజన్లలో జిల్లాలో సెర్ప్ ఆధ్వర్యంలో 133 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించారు. ఏటా సేకరణలో రాష్ట్రంలోనే జిల్లా ఆదర్శంగా నిలుస్తుండగా గత రెండు పంటల కమీషన్ రాకపోవడం, గతంలో అందించిన కమీషన్లో కోత విధించారు. ప్రస్తుతం జిల్లాలో వరికోతలు ప్రారంభం కావస్తుండడంతో అధికారులు 427 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో సెర్ప్ ద్వారా 175, సహకార సంఘాల ద్వారా 251, మెప్మా ద్వారా ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేకరణ చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. అయితే 2023-24 వానాకాలంలో 90,41,971 క్వింటాళ్ల ధాన్యాన్ని, యాసంగిలో 12,23,330 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించగా కమీషన్ రాకపోవడంతో ఇబ్బందిగా మారింది. దాదాపు రూ.32.84 కోట్ల కమీషన్ మహిళా సంఘాలకు చెల్లించాల్సి ఉంది. అంతేకాకుండా గతంలో ఒక సీజన్లో సేకరించిన ధాన్యం కమీషన్లో కేవలం 70 శాతం చెల్లింపులు చేపట్టి మిగతా 30 శాతం కోత విధించారు.కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ధాన్యానికి మహిళా సంఘాలకు క్వింటాలుకు పదేళ్లుగా రూ.32 చొప్పున కమీషన్ చెల్లిస్తున్నారు. అందులో కేవలం రూ.13 మాత్రమే వ్యయం చేయాల్సి ఉంటుండగా ఇందులో కేంద్రాలలో పనిచేసే మహిళలు, కూలీలకు కూడా సరిపోవడంలేదు. ఇందులో 5 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరిస్తే రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు వ్యయం చేస్తుంటే కేవలం రూ.60 వేలు మాత్రమే చెల్లించేందుకు అనుమతి ఉంది. ఇందులో మహిళల రోజువారీ కూలీ కనీసం రూ.33 వేలు, ట్యాబ్, రికార్డుల అపరేటర్ల వేతనాల కోసం రూ.25వేలు, వాచ్మెన్ కోసం రూ.8వేలు, అంతేకాకుండా సుతిలీ, ఇతరత్రా రూ.15 నుంచి రూ.20 వేల వరకు అదనంగా ఉంటున్నాయి. బలవంతంగా అప్పగింత..గతంలో ధాన్యం సేకరణకు మహిళా సంఘాలు గ్రామాల్లో పోటీ పడతుండేవి. కేంద్రాల అప్పగింత అప్పట్లో సెర్ప్ అధికారులకు తలనొప్పిగా మారేది. ప్రస్తుతం సకాలంలో కమీషన్ రాకపోవడం, వచ్చిన దాంట్లో కోత విధించడంతో మహిళా సంఘాలు ఆసక్తి చూపడంలేదు. బలవంతంగా కేంద్రాలను అప్పగించాల్సి వస్తోంది.

# ఆధునిక శిక్షణ.. అందని ద్రాక్షేనా?



కాటారం,,ఫిబ్రవరి 2

,నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు.. ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)ను ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించగా జిల్లాలోని మంథని నియోజకవర్గ పరిధిలోని కాటారం మండలంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)కు అనుసంధానంగా ఏటీసీ మంజూరైంది. నిర్మాణానికి సుమారు రూ.4కోట్లకు పైగా మంజూరైనా నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. త్వరితగతిన నిర్మాణం చేపడితే నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.స్థల సమస్యతో జాప్యం..గతంలో ఐటీఐ, ఏటీసీ నిర్మాణానికి గంగారం మోడల్ కళాశాల సమీపంలో ఏడెకరాల స్థలాన్ని కేటాయించారు. కొంత ఆక్రమణకు గురై వివాదంతో ఏటీసీ నిర్మాణం ముందుకు సాగలేదు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ త్వరితగతిన ఏటీసీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులు మండలకేంద్రంలో మినీ స్టేడియంకు ప్రతిపాదించిన తిమ్మనకుంట భూమిని పరిశీలించి ఎకరం కేటాయించారు. ఆ స్థలంలోనూ తమ ఇళ్ల స్థలాలు ఉన్నాయంటూ కొందరు అడ్డుకుంటుండడంతో ఏటీసీ నిర్మాణానికి ఆలస్యం జరిగింది. దీంతో మళ్లీ గంగారంలో కేటాయించిన స్థలంలోనే ఐటీఐ, ఏటీసీ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు.కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ప్రవేశాలు ఆలస్యం..ఇప్పటికే చాలా వరకు ఏటీసీల్లో అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభమై దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత మండలంలోనే ఏటీసీ నిర్మాణంలో జాప్యంతో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం లేదు. అడ్మిషన్లు ప్రారంభమైన ఇతర ఏటీసీల్లో చేరాలంటూ ప్రోత్సహిస్తున్నారు. నిరుద్యోగ యువతకు దూర ప్రయాసలు, ఆర్థికభారం పడనుంది. దీంతో అటవీ ప్రాంత నిరుద్యోగ యువత అధునిక శిక్షణకు దూరమయ్యే అవకాశం ఉంది. త్వరితగతిన ఏటీసీ నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత యువతకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.ఆరు కొత్త కోర్సుల్లో శిక్షణయువతలో నైపుణ్యాలు అభివృద్ధిచేసి.. ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చేందుకు టాటా టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఏటీసీలలో ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే కోర్సులు.. మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, రెండు సంవత్సరాల కోర్సులు బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషనింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ అనే ట్రేడుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక ఏడాది కాలపరిమితి గల ట్రేడ్‌లలో 40 చొప్పున సీట్లు, రెండేళ్ల కాలపరిమితి గల ట్రేడ్‌లలో 24 సీట్ల చొప్పున అవకాశం కల్పించనున్నారు. ఇప్పటికే ఆధునిక కోర్సులపై ఐటీఐ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.త్వరలో అందుబాటులోకి కోర్సులుభిక్షపతి, ప్రిన్సిపల్, ఐటీఐ, కాటారంఏటీసీ నిర్మాణంలో జాప్యంతో నూతన కోర్సుల్లో అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభించలేదు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రక్రియ చేపడతాం. ఏటీసీతో ఆరు నూతన కోర్సుల్లో శిక్షణతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

# ‘ఉపాధిహామీ’లో అక్రమాలు..!

ములుగు, ,ఫిబ్రవరి 2

ఎదలకు ఉపాధి కల్పించడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణలేమితో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి సామాజిక తనిఖీలు నిర్వహించి అక్రమాల నిగ్గు తేల్చుతున్నప్పటికీ.. తిరిగి చెల్లించాల్సిన సొమ్మును చెల్లించడం లేదు. పంచాయతీ కార్యదర్శులు అధికారుల అండతో చెల్లింపుల్లో నిర్లక్ష్యం చూపిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అక్రమాలను మొత్తం రూ.4.18 లక్షలుగా నిర్ధారించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఐదు మండలాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, ములుగు, గోవిందరావుపేట మండలాల్లో జరిగిన ఉపాధి హామీ పథకంపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు చేపట్టారు. ఈ మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, ఇతరులు తప్పులు చేసినందుకు జరిమానా, దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ఉపాధి కూలీల హాజరు పత్రాల్లో కొట్టివేతలు, చేసిన పనులకు చెందిన ఎంబీ రికార్డుల గణాంకాల్లో తేడాల్లో అక్రమాలను రూ.4.18 లక్షలుగా నిర్ధారించారు. గ్రామసభల్లో నిర్ధారణ జరిగిన వారికి తప్పుల సవరణ తదితర అంశాలపై కొంత వెసులుబాటు కల్పిస్తారు. ఇందులో భాగంగా ఈ సొమ్ముకు సంబంధించి ఆయా పంచాయతీల కార్యదర్శులకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి వివరణ తీసుకొని నిర్ధారించి రికవరీ సొమ్మును సవరణ చేయాల్సి ఉంది. ఇంకా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. దాంతో పాటు జిల్లాలోని మరికొన్ని మండలాల్లో సామాజిక తనిఖీలే జరగలేదు.ఉపాధి పనులపై ఇటీవల దేవనగర్‌లో నిర్వహించిన గ్రామసభఅధికారుల నిర్లక్ష్యం..జిల్లాలో తొమ్మిది మండలాలు ఉండగా, వీటి పరిధిలో 174 పంచాయతీలున్నాయి. ములుగు, వెంకటాపూర్, తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై(2023-24) సామాజిక తనిఖీలు నిర్వహించారు. గ్రామసభ ఏర్పాటు చేసి



వాస్తవాలను నిగ్గు తేల్చారు. ఇందులో వెంకటాపూర్ మండలంలోని ఐదు పంచాయతీలు, తాడ్వాయి మండలంలోని పదకొండు, గోవిందరావుపేట మండలంలోని ఎనిమిది, ములుగు మండలంలోని 31 పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్లు తేల్చారు. ఈ నాలుగు మండలాల పరిధిలో జరిగిన అక్రమాలకు సంబంధించి రూ.1.97 లక్షలు జరిమానా, రికవరీ సొమ్ముగా నిర్ధారించారు. ఇందులో ఇప్పటివరకు రూ.7,418 మాత్రమే రికవరీ చేయగా, రూ.1.90 లక్షలు పెండింగ్‌లో ఉంది. సొమ్ము రికవరీ చేయడంలో అధికారులు అలసత్వం చూపిస్తున్నారనేది స్పష్టమవుతోంది.తప్పిదాలు జరగకుండా ఆదేశించాం.. జవహర్‌రెడ్డి, ఎంపీడీవో, గోవిందరావుపేటగోవిందరావుపేట, గోవిందరావుపేట మండలంలో ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలో పలువురు పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు స్వల్పంగా జరిమానా విధించారు. రికార్డుల్లో జరిగిన తప్పిదాలకు సంబంధించి కొందరికి, కొలతల్లో తేడాలు, మస్టర్లు సరిగ్గా నమోదు చేయకపోవడంతో జరిమానా వేశారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉండేందుకు ఆదేశాలు జారీ చేశారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించాం.

# చిమ్మచీకటిలో ఈత చెట్టు కింద 15 గంటలు



కమాన్‌పూర్, ,ఫిబ్రవరి 2

కల్లు గీసేందుకు ఈత చెట్టు ఎక్కిన గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి 15 గంటల పాటు నరకయాతన అనుభవించిన ఘటన కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏగోలపు నర్సయ్యగౌడ్ సోమవారం సాయంత్రం ఈత చెట్టుపై నుంచి కింద పడ్డారు. వెన్నెముక, ఇతర అవయవాలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టూ దట్టమైన చెట్ల పొదలుండటం, ఎవరూ చూడకపోవడంతో నర్సయ్యగౌడ్ లేవలేని స్థితిలో అక్కడే ఉండిపోయారు.భారీ వర్షం కురవడంతో తడుస్తూ అర్తనాదాలు చేసినా ఫలితం లేకపోయింది. భార్య సరమ్మ అల్లూరులో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న నర్సయ్య ఇంటికి రాని విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. రాత్రంతా వర్షానికి తడిసి చలిలో, గాయాల బాధతో విలవిలలాడారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అటువైపు వెళ్లిన గ్రామస్థులకు నర్సయ్యగౌడ్ అరుపులు వినిపించడంతో వెళ్లి చూశారు. గోదావరిఖని ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు, అనంతరం వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెన్నెముక, పక్కటెముకలకు బలమైన గాయాలు కావడంతో నర్సయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

# ఫ్రాంకింగ్‌కు పాతర



మూసాపేట, ,ఫిబ్రవరి 2

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయల్లో ‘ఫ్రాంకింగ్’ సేవలకు పాతర వేసినట్లు ‘ఈనాడు’ పరిశీలనలో వెల్లడైంది. రూ.లక్షల విలువైన యంత్రాలను అటకెక్కించారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారు. అత్యవసర, స్టాంపు పేపర్లు లేని సమయాల్లో.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పెద్దఎత్తున భూ, ఆర్థిక లావాదేవీలు జరుగుతుంటాయి. ఏ ఒప్పందాలు చేసుకోవడానికైనా నాన్ జ్యుడీషియల్ రూ.10, 20, 50, 100 స్టాంపు పేపర్లు ఉండాలి. అవి లేని సందర్భాల్లో, అత్యవసర సమయాల్లో తెల్లకాగితాలపై రాసుకున్న ఒప్పందాలకు ‘ఫ్రాంకింగ్’ చేసుకుంటేనే చట్టబద్ధత కలుగుతుంది. అందుకు బ్యాంకు చలానా ఇస్తే, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది ఎర్రని రంగుతో ‘రాజముద్ర’ తరహా చిహ్నాన్ని పత్రాలపై ముద్రించి ఇస్తారు. అలా స్థిర, చరాస్తులకూ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. మార్టగేజ్ డీడ్, బ్యాంకు లాకర్స్‌కు అవసరమైన ధ్రువపత్రాలకు, ఇండెమ్నిటీ బాండ్, ఎల్‌ఐసీ బాండ్ అవసరాలకు సైతం ఫ్రాంకింగ్‌ను వినియోగిస్తున్నారు. రూ.2 వేలలోపైతే ‘టీ యాప్ ఫోలియో’ ద్వారా అంతకుమించిన మొత్తమైతే ఎస్‌బీఐ చలానా చెల్లించి రసీదుతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే నిమిషాల వ్యవధిలోనే ఫ్రాంకింగ్ చేయాలి. కానీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది దీనికి తూట్లు పొడుస్తున్నారు.అవగాహన ఉన్నవారు ఒత్తిడి తెస్తే.. ఫాంకింగ్‌పై అవగాహన ఉన్నవారు నేరుగా కార్యాలయానికి వెళ్లి సిబ్బందిపై ఒత్తిడి తేస్తే అప్పటికప్పుడు యంత్రాలను తీసి సేవలు అందిస్తున్నారు. ఈ దృశ్యం కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కన్పించింది. మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యంత్రం పాడైందని.. మరమ్మతులకు చెన్నై సంస్థకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. రాజేంద్రనగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటకెక్కించారు.జరుగుతున్న తంతు ఇది..గ్రేటర్‌లోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రాంకింగ్ యంత్రాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఈ యంత్రాల నిర్వహణ బాధ్యతను ‘పిట్నీ బోవ్స్’ సంస్థకు అప్పగించారు. ఇవి మరమ్మతులు కావడం అరుదు. కానీ, రకరకాల కారణాలతో సిబ్బంది అటకెక్కించారు. సిబ్బంది లేరని, పనిచేయడం లేదని, ఇంకు అయిపోయిందని సాకులు చెబుతున్నారు. మరికొన్ని కార్యాలయాల్లో బయటి వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారు. సదరు సేవల కోసం బ్యాంకులకు వెళ్లి చలానాలు చెల్లించినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న సదరు వ్యాపారులు వినియోగదారులను దండుకుంటున్నారు.

# ఇదేం చోద్యం!

భగత్‌నగర్:,ఫిబ్రవరి 2

విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ వినియోగదారుడు నష్టపోవాల్సి వచ్చింది. రెండు నెలలుగా మీటర్ పని చేయకపోవడంతో.. దానిని మార్చకపోగా.. సగటు లెక్కించి ఎక్కువ మొత్తంలో బిల్లు వేశారు. దీనికితోడు మీటర్‌కు కెపాసిటర్ బిగించుకున్నా.. సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో మూడు నెలల జరిమానా విధించారు. అక్టోబరులో అధిక మొత్తంలో బిల్లు రావడంతో ఆ వినియోగదారుడు అధికారుల వద్దకు పరుగు తీసినా.. ప్రయోజనం లేకపోయింది. అసలేం జరిగిందంటే..కరీంనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో బి.సదయ్య అనే వ్యక్తి ఓ లాడ్జిని నిర్వహిస్తున్నారు. విద్యుత్తు సిబ్బంది మీటర్ వద్ద కెపాసిటర్ బిగించుకోవాలని గతంలో సూచించారు. అతను బిగించకపోవడంతో నెలనెలా జరిమానా విధించారు. మూడు నెలల కిందట ఆయన కెపాసిటర్ బిగించుకొని.. ఆ రశీదును విద్యుత్తు సంస్థ సెక్షన్ కార్యాలయంలో అప్పగించారు. సిబ్బంది ఆ విషయాన్ని రికార్డుల్లో నమోదు చేసి.. జరిమానా విధించొద్దు. కానీ నమోదు చేయకపోవడంతో ఆగస్టు నెలలో రూ.1837 జరిమానా విధించారు. ఈ విషయాన్ని యజమాని గమనించలేదు. ఇలా అక్టోబరులో వచ్చిన బిల్లులో రూ.4560 జరిమానా పెండింగ్‌లో ఉన్నట్లు చూపింది. దీనికితోడు ఈనెల విద్యుత్తు బిల్లు రూ.55,313 రావడంతో కంగుతిన్న ఆయన వెంటనే అధికారుల వద్దకు వెళ్లారు. మీటర్ సరిగా పని చేయకపోవడంతో బిల్లులో స్టేటస్ 12గా చూపించిందని, సగటుగా లెక్కించి ఆ బిల్లు వచ్చిందని సెలవిచ్చారు.



మీటర్ పని చేయకపోవడంతో అడ్డగోలుగా బిల్లు వేయడమేంటని.. మీటర్‌ను ఎందుకు మార్చలేదంటూ ఆయన అధికారులను నిలదీశారు. వారు ఏం చేయలేమని సమాధానమిచ్చి పంపించారు. ఈ అంశంపై ‘న్యూస్‌టుడే’ టౌన్-9 సెక్షన్ ఏఈ త్రిమూర్తిని వివరణ కోరగా.. పరిశీలిస్తామన్నారు.మేల్కొండి..మీటరు కాలిపోయినా.. పని చేయకున్నా.. ఎప్పటికప్పుడు మార్చాల్సిన అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో వినియోగదారులు ఇలా నష్టపోతున్నారు. వ్యాపార వర్గాలు కెపాసిటర్ బిగించుకోకుంటే జరిమానా విధిస్తున్న అధికారులు.. కెపాసిటర్లను బిగించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో నెలనెలా జరిమానా చెల్లిస్తూ కొందరు నష్టపోతున్నారు. వినియోగదారులు వారికొచ్చిన బిల్లును పరిశీలించుకోవాలి. ఏదైనా తేడా ఉంటే విద్యుత్తు అధికారులను సంప్రదించాలి.

# చెత్త కష్టాలకు చెక్ పెట్టేలా .. నగరం నలువైపులా 4 కేంద్రాలు



ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లుగా.. మహా నగరంలో చెత్త సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపబోతోంది. ప్రస్తుతం నగరంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను జవహర్‌నగర్‌కు మాత్రమే తరలించడంతో ఈ ప్రాంతంలో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. దీన్ని అధిగమించేలా, నగరానికి నాలుగు వైపులా చెత్త తరలింపు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడే చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తికేంద్రాల ఏర్పాటుకూ ప్రణాళిక సిద్ధమైంది. అందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఆదేశించారు. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యచరణపై పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ బల్దియా అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో 150 ఎకరాల భూమిని సేకరించారు. ఇక్కడ చెత్త నిర్వహణతో పాటు 15 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం ఏర్పాటుచేయబోతున్నారు. జవహర్‌నగర్‌లో మ్యానువల్‌గా చెత్త నిర్వహణ చేస్తుండగా ప్యారానగర్‌లో మాత్రం ఆధునిక పద్ధతులను అవలంభించబోతున్నారు. ఒక బంకర్ నిర్మించి నాలుగువైపులా పెద్ద షెడ్డు నిర్మించనున్నారు. బంకర్‌లోనే చెత్తను తడి, పొడి చెత్తగా విభజిస్తామని, దీంతో కాలుష్య సమస్య ఏర్పడదని అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో 1500 టన్నుల పొడి చెత్తను విద్యుదుత్పత్తికి వినియోగించనున్నారు.చౌటుప్పల్ దగ్గర మల్కాపూర్‌లో మరో కేంద్రాన్ని 100 ఎకరాల్లో ఏర్పాటుచేయనున్నారు. ఇక్కడ కూడా 15 ఎంవీ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో కూడా 40 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఇంత తక్కువ స్థలంలో నిర్వహణ కేంద్రం ఏర్పాటు కష్టసాధ్యమని చెబుతున్నారు.నగరంతో పాటు చుట్టుపక్కల మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రతిరోజూ ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తిఅవుతోంది. ఇందులో సగం పొడిగా, మరో సగం తడి చెత్త. మొత్తం చెత్తను కొన్నేళ్లుగా జవహర్‌నగర్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ 24 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని కొన్నాళ్లకిందటే రాంకీ సంస్థ ఏర్పాటుచేసింది. ఇందులో 1400 టన్నుల పొడి చెత్తను వినియోగిస్తున్నారు. మరో 24 ఎంవీ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్మాణం మార్చికల్లా పూర్తవుతుందని ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దుండిగల్‌లో మరో విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక నగర వ్యాప్తంగా చెత్తను జవహర్‌నగర్‌కు తరలించడం కష్టంగా మారడంతో మరో నాలుగు చోట్ల చెత్త నిర్వహణ, విద్యుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. బల్దియా అధికారులు ఏడాదిగా సంబంధిత స్థలాల అన్వేషణ చేశారు. పటాన్‌చెరు మార్గం లక్డారం సమీపంలో వంద ఎకరాల్లో ఒక చెత్త నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. ఇక్కడా 15 ఎంవీ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుచేయనున్నారు. దీనికి కూడా 1500 టన్నుల పొడి చెత్త అవసరమవుతుంది.

## కొత్త ఎత్తులతో రూ.కోట్లు కొల్లగొడుతున్న ఆర్థిక నేరస్థులు

హైదరాబాద్: ఎదుటివారిని బురిడీ కొట్టించడంలో ఆరితేరిన నైపుణ్యం. నేరం బయటపడి పోలీసులు ప్రశ్నించినా తొణకని నైజం. ఇంత చాకచక్యంగా వ్యవహరించే వీరంతా దోపిడీ దొంగలు.. సుపారీ ముఠాల్లో ఉండే కరడుగట్టిన నేరస్థులు అనుకుంటే పొరపాటే. మాటలే పెట్టుబడిగా అందినంత కొట్టేస్తారు. ఉపాధి కల్పించిన సంస్థనే మోసం చేస్తారు. గుట్టు బయటపడితే జైలుకెళ్లేందుకు సిద్ధపడతారు. కాజేసిన సొత్తులో పైసా చెల్లించరు. ఎన్ని ముచ్చట్లో..: బ్యాంకు ఉద్యోగుల్లో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బంధువులు, మిత్రుల ఖాతాల్లోకి సొత్తు మళ్లిస్తున్నారు. తమ వద్ద పైసా లేదని, తిరిగి చెల్లించలేమంటూ చేతులెత్తేస్తున్నారు.

# శాశ్వత రహదారి నిర్మించేదెప్పుడు?



రామడుగు: ,ఫిబ్రవరి 2

,రామడుగులోని వెూతె వాగుపై కొత్త వంతెన అందుబాటులోకి వచ్చినా.. ఇంకా పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం కాలేదు. నెల రోజుల కిందట భారీ వర్షాలకు పాత వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎమ్మెల్యే మేడపల్లి సత్యం కల్పించుకొని భూనిర్వాసితులను ఒప్పించి.. కొత్త వంతెనపై నుంచి తాత్కాలిక రాకపోకలు సాగేలా చూశారు. అటు వైపు వెళ్లే వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డుకు తాత్కాలికంగా మొరం పోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. శాశ్వత రహదారి పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.నవరణ ప్రతిపాదనలు..2019లో రూ.7.9 కోట్లతో చేపట్టిన వంతెన పనులు 2023లో పూర్తయినా.. అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో వృథాగా ఉ ండిపోయింది. ఇరువైపులా భూసేకరణ చేపట్టి రోడ్డు పనులు చేపట్టాల్సి ఉండగా నవరణ ప్రతిపాదనలు రూపొందించారు. మొత్తం రూ.11.20 కోట్లతో నిధులు ప్రతిపాదించారు. భూనిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించకున్నా ఒప్పించారు. మొరం పోసి తాత్కాలిక రహదారి వేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొత్త వంతెనను ప్రారంభించారు. అప్పటి నుంచి దానిపై నుంచి రాకపోకలు మొదలయ్యాయి.తారు రోడ్డు నిర్మించాలికొత్త వంతెన వద్ద కేవలం మట్టి పోసిన రోడ్డు కావడంతో భారీ వాహనాలు దిగబడుతున్నాయి. వర్షాలు కురిస్తే మరింత ఇబ్బంది ఏర్పడుతుంది. రోలర్తో చదును చేసి కంకర పోసిన అనంతరం తారు రోడ్డు నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదు. కొన్నేళ్లుగా పాత వంతెనతో ఇబ్బందిపడ్డాం. ఇప్పుడు తాత్కాలికంగా సమస్య పరిష్కారమైనా.. శాశ్వత పనులు చేపట్టాలి.బొడ్ల శ్రీధర్, రామడుగు వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా ఉందిరామడుగు కొత్త వంతెన వద్ద ఇరువైపులా ద్విచక్ర వాహనాలు సైతం సరిగా వెళ్లలేకపోతున్నాయి. కేవలం మట్టి నింపడంతో సమస్యగా మారింది. పూర్తి స్థాయి రోడ్డు నిర్మిస్తే అన్ని వాహనాలు సజావుగా వెళ్తాయి. అధిక సామర్థ్యం ఉన్న పెద్ద వాహనాలు దిగబడుతున్నాయి. కొత్త వంతెన బాగున్నా ఇరువైపులా రోడ్డు బాగాలేదు.రామడుగులోని కొత్త వంతెనకు ఇరువైపులా శాశ్వత ప్రాతిపదికన పనులను నెల రోజుల్లో చేపడతాం. తాత్కాలికంగా రవాణా పునరుద్ధరించే విధంగా చేపట్టిన పనుల స్థానంలో రెండు పొరలుగా కంకర పనులు, తారు పనులు చేపట్టాల్సి ఉంది. త్వరలోనే రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు మొదలుపెడతాం.

# సాగునీటి సమస్యలకు చెక్!



ధర్మపురి: ,ఫిబ్రవరి 2

ఏళ్ల తరబడి సాగునీటి రంగంలో క్షేత్రస్థాయి సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు నీరందించడం గగనంగా మారింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టాలని భావిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి చేసిన ప్రకటనతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఓ వైపు జిల్లాలో గోదావరి ఎత్తిపోతల పథకాలు, రోళ్లవాగు ప్రాజెక్టు, అక్కపల్లి చెరువు రిజర్వాయర్, బోలిచెరువు, జంగనాల ప్రాజెక్టు, యశ్వంతరావుపేట ప్రాజెక్టు లాంటివి ఉండటం.. మరోవైపు డీ-53, డీ-86 ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటి కింద లక్ష ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. పిచ్చి మొక్కలతో కాలువలుకాలువల ద్వారా నీటిని వదిలిన సమయంలో అవి పూడికతో, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ఏటా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. గోదావరి ఎత్తిపోతల పథకాలు నూతనంగా నిర్మించడంతో వీటి కింద 20 వేల ఆయకట్టు పెరిగింది. ఈ పథకాలకు క్షేత్రస్థాయి సహాయ సిబ్బంది లేక నిర్వహణకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా రైతులు సమష్టిగా పథకాలను బాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన నియామక ప్రక్రియ రైతులకు దోహద పడనుంది.120 మందితో ప్రతిపాదనలుగోదావరి ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లకు ఎంతమంది ఎలక్ట్రిషియన్లు, ఫిట్టర్లు, పంపు మెకానిక్లు అవసరమో ప్రతిపాదించాలని ప్రభుత్వం ఇటీవల ఇరిగేషన్ అధికారులకు లేఖలు ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ద్వారా పంపించింది. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో అన్ని పథకాలకు కలిపి 120 మంది వరకు అవసరం ఉంటారని నివేదించారు.

ప్రకటనతో అన్నదాతల హర్షంప్రభుత్వం 22 జులై 2016న నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ.కి ఒకరు, ఉప కాలువపై ప్రతి 112 కి.మీల వరకు మరొకరు, డిస్ట్రిబ్యూటర్పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు లస్కర్లు ఉండాల్సి ఉండగా అమలు కావడం లేదు. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి చేసిన ప్రకటన, ప్రభుత్వం ప్రతిపాదనలను కోరడం నీటి పారుదల నిర్వహణలో నెలకొన్న దశాబ్దాల సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు.ఆదేశాలకు అనుగుణంగా చర్యలుసాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు వేస్తుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సబంధించిన ప్రతిపాదలను ప్రభుత్వానికి నివేదించాం. వీరిని నియమిస్తే సాగునీటి సరఫరా సమస్యలు చాలా వరకు తగ్గే అవకాశముంది.

# కొన్నారు.. మూలన పెట్టారు




జగిత్యాల,ఇక్కడ కనిపిస్తున్న 4 కొత్త ఆటోలను రూ.25 లక్షల వ్యయం చేసి బల్దియా 2 నెలల కిందట కొనుగోలు చేసింది. ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ పూర్తయినా 2 నెలలుగా విద్యానగర్ నీళ్లట్యాంకు వద్దే ఉంచారు. పట్టణంలో ఓవైపు చెత్త సేకరణ లేక కాలనీలు కంపు కొడుతుంటే కొనుగోలు చేసిన వాహనాలను పక్కనపెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. స్థానిక 45వ వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది వారం రోజులుగా చెత్త తొలగించలేదు. దసరా పండగపూట కాలనీవాసులు దుర్గంధంతో విసిగిపోయారు. కారణమేంటని కాలనీవాసులు ఆరా తీస్తే ఈ వార్డుకు చెందిన వాహనం 2 నెలలుగా మరమ్మతులో ఉందని పురపాలక సిబ్బంది తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినా వార్డులకు కేటాయించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.ఈ చిత్రంలో ముసుగుకప్పి కనిపిస్తుంది కొత్త ట్రాక్టరు. చెత్త సేకరణ కోసం రూ.14 లక్షలు వెచ్చించి బల్దియా ఏడాది కిందట దీన్ని కొనుగోలు చేసింది. షోరూం నుంచి తెచ్చి విద్యానగర్ నీళ్లట్యాంకు వద్ద చెట్టుకింద ఇలా నిలిపారు. పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరం నుంచి వినియోగానికి దూరమై తుప్పుపడుతోంది.జగిత్యాల పట్టణంలో 48 వార్డుల నుంచి నిత్యం 70 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. వార్డుల విలీనం తరువాత గృహాల సంఖ్య పెరగటం, కాలనీలను విస్తరించడంతో చెత్త సేకరణ బల్దియాకు సవాలుగా మారింది. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటోలు, ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో బల్దియా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో ఏడాది క్రితం ట్రాక్టరును.. రెండు నెలల కింద రూ.25 లక్షలతో 4 కొత్త ఆటోలను కొనుగోలు చేశారు. వీటిని వెంటనే ప్రారంభించి వినియోగించాల్సిన అవసరం ఉన్నా.. నిర్లక్ష్యంతో పక్కన పెట్టేశారు.మరమ్మతులపైనే శ్రద్ధపురపాలిక అధికారులకు మరమ్మతులపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మరమ్మతులకు వ్యయం చేస్తున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే డిమాండ్ రెండేళ్లుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం.. సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసినా మరమ్మతుల యావలోపడి వీటి నిర్వహణ మరిచారు. ప్రస్తుతం 15 ఆటోలు మరమ్మతు కోసం నెలల తరబడి మెకానిక్ షెడ్లలో మగ్గుతున్నాయి.

తరచూ కమిషనర్లు మారటం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు సిబ్బంది మరమ్మతుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.ఎక్కడి చెత్త అక్కడే..వాహనాలు పాడైపోయాయని.. కొత్త వాహనాలు లేవనే కారణాలతో పారిశుద్ధ్య సిబ్బంది వార్డుల్లో చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించడం లేదు. మొరాయిస్తున్న వాహనాలతోనే సామర్థ్యానికి మించి చెత్త సేకరిస్తున్నామని కొందరు పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. వార్డుల్లో కనీసం వారం రోజులకోసారి కూడా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో పలు కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. తీవ్రమైన జ్వరాల బారిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీసం దోమల నివారణ మందు కూడా చల్లడం లేదు. సమస్యల పరిష్కారానికి పురపాలిక సభ్యులు స్పందించాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

# చురుగ్గా పనులు... అందుబాటులోకి అత్యవసర చికిత్సలు



గోదావరిఖని ,,ఫిబ్రవరి 2

,ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారితో పాటు అత్యంత క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్న వారికి అత్యాధునిక, అత్యవసర వైద్య సేవలందించి ప్రాణాలను కాపాడేందుకు గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆవరణలో క్రిటికల్కేర్ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. టి.జి.ఎం.ఐ.డి.సి.(తెలంగాణ ఆరోగ్య మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో రూ.23.75 కోట్ల వ్యయంతో 50 పడకల సామర్థ్యంతో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో భవన నిర్మాణ పనులను ఆరు నెలల క్రితం చేపట్టగా ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్నాయి. జాతీయ రహదా రుల వెంట ప్రతి 35 కిలోమీటర్ల దూరంలో ఒక ట్రామాకేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటించగా గోదావరిఖనిలో క్రిటికల్ కేర్ భవనంలో ట్రామాకేర్తో పాటు వివిధ విభాగాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఇందుకోసం ఆసుపత్రి ఆవరణలోని అటెండెంట్ల షెడ్డు, కిచెన్ షెడ్డుతో పాటు నీటి ట్యాంకును కూల్చి వేశారు. పక్కనే ఉన్న నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆనుకొని నిర్మాణ పనులను చేపడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్రిటికల్కేర్ సదుపాయాల కోసం టి.జి.ఎం.ఐ.డి..సి. రూ.23.75 కోట్ల నిధులను కేటాయించగా అందులో రూ.10 కోట్లతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. మిగతా రూ.13.75 కోట్లతో వివిధ విభాగాల్లో అవసరమైన వైద్య సామగ్రిని సమకూర్చనున్నారు.తగ్గనున్న దూరాభారం...రాజీవ్ రహదారిలో నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సాధారణ గాయాలకు గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స చేసి కరీంనగర్, హైదరాబాద్కు తరలించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి విషమంగా మారడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. స్థానికంగానే క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తే ప్రమాదబాధితులకు దూర, ఆర్థిక భారం తగ్గడంతో పాటు ప్రాణహాని తప్పే అవకాశముంది. ఇటీవలి కాలంలో రామగుండం ప్రాంతంలో పలువురు గుండెపోటుకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆసుపత్రి ఆవరణలో గుండె వ్యాధుల శస్త్ర చికిత్స కోసం ప్రత్యేకంగా క్యాథ్లాబ్ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని కోసం ఆసుపత్రి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. స్థానిక పరిశ్రమలు సహకరిస్తే 'ఖని'లో క్యాథ్లాబ్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.మెరుగైన వైద్యం అందనుంది గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణం పూర్తయితే అన్ని విభాగాల్లో అత్యవసరమైన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎంతటి క్లిష్టమైన పరిస్థితుల్లోనైనా తక్షణమే వైద్య సేవలందించే సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఆయా పనులు పూర్తయితే మెరుగైన వైద్యానికి రామగుండం కేంద్రం కానుంది. హైదరాబాద్ తరహా వైద్య సేవలు దశలవారిగా రామగుండంలోనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

# రామగుండానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



గోదావరిఖని: ,ఫిబ్రవరి 2

ఎట్టకేలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రామగుండానికి తరలివస్తుంది. ఏడాదిన్నర కాలంగా పెద్దపల్లిలోనే సేవలందించిన కార్యాలయాన్ని రామగుండంలో ప్రారంభించనున్నారు. రామగుండం ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్పై గత ప్రభుత్వం ఈ ప్రాంతానికి ప్రత్యేకంగా కార్యాలయాన్ని కేటాయించింది. ఈ ప్రాంత భూములు, పెళ్లిళ్లకు పెద్దపల్లికి వెళ్లి రిజిస్ట్రేషన్ సేవలు పొందాల్సి ఉండేది. దీంతో చాలా మంది దూర ప్రాంతంలో ఉన్న కార్యాలయానికి వెళ్లేందుకు ఇబ్బంది ఎదుర్కొన్నారు. పెద్దపల్లిలో ఎక్కువ శాతం రిజిస్ట్రేషన్లన్నీ రామగుండం ప్రాంతానికి చెందినవే ఉండటంతో వెళ్లి రావడానికి ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలోనే గత ఏడాది ఏప్రిల్ 1న పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే తాత్కలికంగా రామగుండం కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే రామగుండానికి ప్రత్యేకంగా కేటాయించినా ఆయా సేవలకోసం మళ్లీ పెద్దపల్లికి వెళ్లాల్సి వచ్చింది.

రామగుండం పట్టణంలోని పాత మండల పరిషత్తు కార్యాలయంలో సబ్రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మండల పరిషత్తు కార్యాలయ భవనానికి మరమ్మతులు చేయించారు. రామగుండం కార్పొరేషన్తో పాటు అంతర్గాం, పాలకుర్తి మండలాల ప్రజలకు సేవలు అందుబాటులో ఉంటాయి. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే మక్కాన్సింగ్తో పాటు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఏడాదిన్నర కాలంగా పెద్దపల్లిలోనే సేవలందించిన రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇప్పటి వరకు 8,462 భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేశారు. వీటి ద్వారా రూ.42.45 కోట్ల ఆదాయం సమకూరింది. వివాహాలకు సంబంధించి 1850 రిజిస్ట్రేషన్లు చేశారు. కాగా పారిశ్రామిక ప్రాంతానికి కేంద్రమైన గోదావరిఖని పట్టణ ప్రజలకు మళ్లీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు దూరం కానున్నాయి. గోదావరిఖనిలోనే ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ఆశించారు. ఈ మేరకే రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. రామగుండం రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలంటే మళ్లీ దూరాభారం తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సన్నాల కొనుగోళ్లలో నూతన విధానానికి శ్రీకారం

పెద్దపల్లి ,,ఫిబ్రవరి 2

రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 ఇస్తామని ప్రకటించడంతో ధాన్యం సేకరణ నాణ్యత, నిర్ధారణలో నిబంధనలు కఠినతరం చేసింది. పొరపాట్లు జరగకుండా సన్న రకాలను కొనుగోలు చేసేందుకు తొలిసారిగా సాంకేతిక విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్షేత్రంలోకి దిగిన అధికార యంత్రాంగం రైతులను చైతన్యం చేసే పనిలో నిమగ్నమైంది.ప్రత్యేక పరికరంతో పరిశీలనధాన్యం నాణ్యత విషయంలో పౌరసరఫరాల శాఖ ఇప్పటి వరకు దొడ్డు, సన్న నిర్ధారణ ప్రమాణాలు పాటించకుండానే వడ్లను కొనుగోలు చేస్తోంది. ఏఈవోలు 'ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ' పరికరంతో దొడ్డు, సన్న రకాలు గుర్తించకుండా తేమ, తాలు, రాళ్లు, రప్పలు తదితర ప్రమాణాల శాతాన్ని పరిశీలించి చేతులు దులుపుకొంటున్నారు. చాలా చోట్ల ఏఈవోలు నామమాత్రంగానే ధాన్యం సేకరణలో భాగస్వామ్యం అవుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. పని ఒత్తిడి భారంతో కేంద్రాలకు వెళ్లకుండానే ధాన్యం కొనుగోళ్లకు అనుమతులు ఇస్తున్నారు. మద్దతు ధర తప్పితే సన్న వడ్ల గుర్తింపుపై ఇప్పటివరకు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలులో గ్రెయిన్ కాలిపర్(డయల్ మైక్రోమీటర్) పరికరాన్ని వినియోగించనున్నారు. వీటి కొనుగోలు బాధ్యతను మార్కెటింగ్ శాఖ తీసుకొంది. గింజ పొడవు, వెడల్పు కొలిచేందుకు గ్రెయిన్ కాలిపర్ పరికరాన్ని వినియోగించనున్నారు. నాణ్యతను కూడా ఈ పరికరం గుర్తిస్తోంది. ప్రమాణాలు పాటిస్తేనే ప్రభుత్వ బోనస్ అందనుంది.నిర్ధారణే సమస్య33 రకాల సన్నాలకు బోనస్ అందనుండటంతో ధాన్యం సేకరణలో సన్న రకాల నిర్ధారణ సవాలుగా మారింది. గింజ పొడవు 6 మిల్లీమీటర్లు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే తక్కువగా ఉండి.. పొడవు, వెడల్పు నిష్పత్తి 2:5 కన్న ఎక్కువ ఉండకుంటేనే బోనస్ ఇవ్వనున్నట్లు ఆంక్షలు పెట్టారు. తేమ శాతం ఉన్న ధాన్యంలో కొన్ని గింజల పొట్టు తీసి గ్రెయిన్ కాలిపర్ పరికరం సన్న, దొడ్డు రకాలుగా నిర్ధారణ తేల్చుతుంది. వ్యవసాయ శాఖ నిర్ధారిస్తేనే కొనుగోలు చేసి బోనస్ ఇవ్వనున్నారు.వేర్వేరుగా సేకరణకేంద్రాల్లో ధాన్యాన్ని వేర్వేరు చోట్ల కొనుగోలు చేస్తారు. అనంతరం సన్నాలు, దొడ్డు రకం ధాన్యం గుర్తించేందుకు సంచులకు రెండు రకాల దారంతో కుట్టే విధానాన్ని పరిశీలిస్తున్నారు. సన్నాలు నిల్వ చేసిన సంచులను ఎరుపురంగు దారంతో కుట్టి.. వాటిపై 'ఎస్' అక్షరం రాస్తారు. దొడ్డు రకానికి పచ్చ రంగు దారం వాడతారు. మిల్లుల్లో వేర్వేరుగా వీటిని భద్రపరుస్తారు. సన్నాల నిర్ధారణలో రాజకీయ పలుకుబడికి తలొగ్గకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిబద్ధత పాటించాలి. అప్పుడే అర్హులైనా రైతులకు బోనస్ దక్కుతోంది.కేంద్రాలకు పరికరాలను సమకూరుస్తాశ్యామ్ప్రసాద్లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లిసన్నాలకు బోనస్ చెల్లించడంలో నిర్ధారణ కీలకమైంది. ధాన్యం పరిమాణాన్ని నిర్ధారించేందుకు కొత్తగా గ్రెయిన్ కాలిపర్ పరికరాన్ని వాడనున్నాం. కేంద్రాలకు సరిపడా పరికరాలను సమకూర్చనున్నాం. సన్నాల కొనుగోళ్లలో సమస్యలు లేకుండా పర్యవేక్షణ చేస్తాం.

# బ్యాంకుల వద్ద.. దొంగలున్నారు జాగ్రత్త!

జనగామ టౌన్,ఫిబ్రవరి 2

బ్యాంకుల వద్ద మాటు వేస్తూ.. చాకచక్యంగా నగదు చోరీ చేస్తున్న ముఠా జిల్లాలో సంచరిస్తోంది. బ్యాంకుల్లో నగదు డ్రా చేసుకుంటున్న వారిని దగ్గరగా గమనిస్తూ నగదు చోరీ చేస్తున్న అగంతకులతో బ్యాంకు ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఇలాంటి పలు చోరీ సంఘటనలు జరుగుతుండటంతో పోలీసులు కూడా అప్రమత్తమై బ్యాంకుల వద్ద భద్రతా చర్యలతో పాటు ముఠాను పట్టుకోవడానికి రంగంలోకి దిగారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నట్లు కనిపించినా నగదు తస్కరిస్తున్నారు. కర్ణాటక దొంగల ముఠాగా అనుమానం..జనగామలో మూడు నెలల క్రితం జరిగిన చోరీ ఘటనలో జనగామ క్రైమ్ ఎస్సై మొగుడుల భరత్ నేతృత్వంలో



క్రైమ్ విభాగం పోలీసులు చోరీ దర్యాప్తులో భాగంగా నిందితుల్లో కర్ణాటకు చెందిన ఒకరిని అరెస్టు చేశారు. ఆ తర్వాత పలు ప్రాంతాల్లో బ్యాంకుల వద్ద చోరీలు వెలుగుచూడటంతో కర్ణాటకు చెందిన ముఠా సభ్యులుగానే అనుమానిస్తూ దర్యాప్తు చేపట్టారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలి..చాకచక్యంగా మాటలు కలిపి, నగదు కాజేస్తున్న అగంతకుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. దొంగలు వృద్ధులు, నడి వయస్సులు, అంతగా చదువు రాని వారిని లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పోలీసులు విచారణలో తేలడంతో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, నడి వయస్సుల వారు బ్యాంకులకు వెళ్తున్న తరుణంలో వెంట ఒకరిని తీసుకువెళ్లే క్షేమం. అలాగే నిరక్షరాస్యులు డ్రా చేసిన తరువాత ఏమరుపాటుగా ఉండొద్దు. కార్లు, ద్విచక్రవాహనాల్లో డబ్బులను పెట్టుకున్నప్పుడు నిర్లక్ష్యం వహించరాదు. బ్యాంకు లోపల, బయట పూర్తిగా సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలని, పార్కింగ్ వద్ద కూడా పలు జాగ్రత్త చర్యలు, సెక్యూరిటీ గార్డుల సాయం తీసుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. బ్యాంకులతో పాటు మార్గ మధ్యలో ఖాతాదారులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని చెబుతున్నారు. జిల్లాలో వరుస సంఘటనలు.. ఖాతాదారుల బెంబేలుజనగామ పట్టణంలో మూడు నెల క్రితం ఓ బ్యాంకులో నగదు విడుదల చేసుకున్న వ్యక్తిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు నుంచి గమనిస్తూ బయటకు వెళ్లే క్రమంలో ద్విచక్రవాహనాలపై వెంబడించారు. ఆయన నగదును కారులో పెట్టి, మధ్యలో ఓ పని మీద వాహనాన్ని నిలిపివేశారు. దీంతో వారు కారు అద్దాలను పగులగొట్టి రూ.2లక్షలను చోరీ చేశారు. అలాగే గత నెల 18న జనగామలోని ఓ బ్యాంకులో డబ్బులను డ్రా చేసిన వ్యక్తిని బ్యాంకులోనే ఉండి గమనించిన అగంతకులు ద్విచక్రవాహనాలపై వెంబడించారు. మధ్యలో కారు ఆపిన క్రమంలో దుండగులు అద్దాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆరు రోజుల కింద ఓ ఖాతాదారుడు పంట రుణం, గృహ రుణం కింద రూ.3.10 లక్షలు తీసుకొని వాహనంలో పెట్టుకున్నాడు. తిరిగి వెళ్తుండగా దుండగులు మాటు వేసి అపహరించుకుపోయారు. బాధితుడు లబోదిబోమంటూ విలపించాడు.

దేవరుప్పుల మండలంలో కొద్ది రోజుల కింద ఓ ఖాతాదారుడు రూ.40 వేలను డ్రా చేసుకొని తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. తిరుగు పయణంలో దుండగులు వెంబడించి, మాటలతో మైమర్చి కవర్లో ఉన్న డబ్బును తస్కరించారు. ఇలా వరుస చోరీలు జరగడం గమనార్హం.బ్యాంకుల వద్ద ప్రత్యేక దృష్టి సారించాం.. రాజమహేంద్రనాయక్, డీసీపీబ్యాంకుల వద్ద ఖాతాదారుల నుంచి నగదు కాజేస్తున్న ఘటనలు జరగడంతో అప్రమత్తత చర్యలు ప్రారంభించాం. బ్యాంకు అధికారులకు సీసీ కెమెరాలు, ఇతర భద్రత చర్యలు తీసుకోవాలని సూచించి జిల్లా వ్యాప్తంగా అమలు చేయిస్తున్నాం. చోరీ ఘటనలపై దర్యాప్తు చేపట్టాం. సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేయిస్తున్నాం.

# ఆచార్యా.. మీకిది తగునా..!



విద్యానగర్, ,ఫిబ్రవరి 2

ఆయన కాకతీయ యూనివర్సిటీలో ఉన్నత స్థానాల్లో ఉన్న ఆచార్యుల్లో ఒకరు. ఏకంగా ఐసెట్ నిర్వహణ నిధులపై కన్నేశాడు.. 'లెక్క' తేలని కారణాలు చెబుతూ పెద్ద మొత్తంలో దారి మళ్లించాడు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఐసెట్ ఒకటి. దాని నిర్వహణ బాధ్యతలను కాకతీయ యూనివర్సిటీకి అప్పగించారు. దీని నిర్వహణ కోసం ఉన్నత విద్యామండలి కేటాయించిన నిధులను ఈ ఆచార్యుడు దారి మళ్లించినట్లు సమాచారం. 2024 -25 విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి పత్రికా ప్రకటన, సీఈటీ సమావేశానికి, కాన్ఫిడెన్షియల్ పనులు, వేతనాలు, అతిథ్యం, రవాణా, సామగ్రి ఖర్చు, స్టేషనరీ తదితర వాటికి రూ.99.50 లక్షలు అవసరం అవుతాయని ఐసెట్ కన్వీనర్ ఉన్నత విద్యామండలికి ప్రతిపాదన పంపిస్తే రూ.92.76 లక్షలను కేటాయించింది. వాటిలో కొన్నింటికి తక్కువ ఖర్చు అయినా ఎక్కువ అయినట్లు లెక్కలు చూపించి రూ.29.25 లక్షలను ఆ ఆచార్యుడు తన వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం ఉన్నత విద్యా మండలి దృష్టికి వెళ్లింది.బదిలీ ఇలాఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.6 లక్షలు, మార్చిలో రూ.5 లక్షలు, ఏప్రిల్‌లో రూ.7 లక్షలు, మే నెలలో రూ.8 లక్షలు, ఆగస్టులో రూ.3.25 లక్షల చొప్పున మొత్తం రూ.29.25 లక్షల అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. ఆరు నెలల్లో రూ.16 లక్షలను సెల్ఫ్ చెక్‌లతో విడుదల చేసుకున్నట్లు సమాచారం. వాటిని ఐసెట్ కాన్ఫిడెన్షియల్ విభాగం ఖర్చు కోసం వాడాలి. వాటిని వినియోగించిన తీరు ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. రవాణా ఖర్చులు నిమిత్తం నెలకు రూ.40 వేలు తీసుకున్నారు. ఐసెట్ పరీక్ష నిర్వహణలో సంబంధం లేని ఒక పెద్దసారుకు వేతనం పేరుతో రూ.2 లక్షలు చెల్లించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐసెట్ కార్యాలయంలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి ఖాతాలోకి ముందు నగదు జమచేసి ఆ తర్వాత విడుదల చేసుకున్నట్లు సమాచారం. విశ్వవిద్యాలయానికి ఎలాంటి సంబంధం లేని మహిళ పేరున రూ.82,600 తీసుకోవడం పట్ల నగదు అక్రమ బదిలీ జరిగినట్లు ఆరోపణలు. కంప్యూటర్ల కొనుగోలులో అవకతవకలకు పాల్పడ్డారు. ఒక్కో కంప్యూటరును రూ.87,849 చొప్పున ఆరింటిని వేర్వేరు దుకాణాల్లో కొనుగోలు చేసినట్లు చూపించారు. ఏవిధమైన కొటేషన్లు, కమిటీ అనుమతి లేకుండానే కొనుగోలు చేయడం గమనార్హం.

# రూ.10 వేలకే ఎకరం భూమికి పోడు పట్టా

నర్సంపేట, ,ఫిబ్రవరి 2

..మీకు తెలుసా.. రూ.10 వేలు ముట్టజెప్పితే ఎకరం భూమి హక్కు పత్రం (పట్టా పుస్తకం) ఇస్తారు. మరో రూ.10 వేలు ఇస్తే బ్యాంకులో పంట రుణం ఇప్పిస్తారు. చదవడానికి ఆశ్చర్యంగా అనిపిస్తున్నా ఇది నిజం.ఎక్కడ అంటారా.. నర్సంపేట నియోజకవర్గంలో.. దళారులు అటవీ భూములకు అటవీ హక్కు పత్రాల(పట్టా పుస్తకాల) పేరుతో నడిపిస్తున్న నయా దందా ఇది. అటవీ, మారుమూల గ్రామాల రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ పోడు పట్టాదారు పుస్తకాలను అంటగట్టి రెండు చేతులా దండుకుంటున్నారు. ఈ నకిలీ పుస్తకాలు చెలామణి బహిరంగంగానే సాగుతున్నా సంబంధిత ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎలా జరిగిందంటే..గతేడాది పోడు భూములు సాగు చేసిన గిరిజన తెగకు చెందిన కోయ, లంబాడ, నాయకపోడు, ఎరుకల సామాజిక వర్గాల వారికి ప్రభుత్వం సర్వే చేసి అటవీ హక్కు పత్రాలు(పట్టాదారు పుస్తకం) జారీ చేసింది. దీనిని అవకాశంగా తీసుకుని సులువుగా డబ్బులు సంపాదించేందుకు నకిలీ అటవీ హక్కు పత్రాల తయారీకి శ్రీకారం చుట్టారు. సదరు దళారీ గ్రామాల్లోకి వెళ్లి తనకు రూ.10 వేలు ఇస్తే ఎకరం భూమి పోడు పట్టా పుస్తకం ఇస్తానని నమ్మబలికాడు. ముందుగా ఒకరిద్దరికి ఇవ్వడంతో నమ్మి వివిధ గ్రామాలకు చెందినవారు మూడు, నాలుగు ఎకరాలకు నగదు ముట్టజెప్పి పుస్తకాలు పొందారు. ఓ అటవీ గ్రామంలో గిరిజనేతరులైన రైతులకు నకిలీ పోడు పట్టాలు ఇవ్వడం కొసమెరుపు. నల్లబెల్లి మండలంలో ఐదు గ్రామాలు, నర్సంపేట మండలంలో మూడు గ్రామాల్లో ఈ నకిలీ పోడు పట్టా పుస్తకాలు జోరుగా



చెలామణి అయ్యాయి. గత యాసంగి సీజన్‌లో నర్సంపేటలోని ఓ బ్యాంకు నుంచి వారు పంట రుణాలు పొందడం విశేషం.నకిలీ అటవీ హక్కు పుస్తకంలోని ఓ రైతుకు చెందిన వివరాలుబ్యాంకర్ల తీరుపైనా అనుమానాలుసాధారణంగా రైతులు పంట రుణం కోసం బ్యాంకుకు వస్తే పట్టాదారు పాసు పుస్తకం, 1బీ పత్రం, ఏ బ్యాంకులో రుణం లేనట్లు (నో డ్యూ) ధ్రువపత్రం తెప్పించుకుంటారు. సదరు రైతు సమర్పించిన పత్రాలు వాస్తవమా కాదా అని ఆన్‌లైన్‌లో రెవెన్యూ రికార్డుల్లో నిర్ధారించుకుంటారు. అనంతరం నానా కొర్రీలు పెట్టి అరకొరగా రుణం ఇస్తారు. ఈ నకిలీ పోడు పట్టా పుస్తకాలకు అటవీ అధికారుల రికార్డులు పరిశీలించకుండా, నో డ్యూ ధ్రువపత్రం లేకుండానే బ్యాంకు అధికారులు రుణం ఇవ్వడం గమనార్హం. దీంతో బ్యాంకర్ల తీరుపైనా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ పోడు పట్టా పుస్తకాల గుట్టు రట్టు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ విషయమై నర్సంపేట అటవీక్షేత్ర అధికారి రవికుమార్ వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# మూడువైపులా.. 'కష్టాలే'



హనుమకొండ ,,ఫిబ్రవరి 2

నిత్యం వేలాది ప్రైవేటు వాహనాలు, కార్ల రాకపోకలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు ఇవన్నీ హనుమకొండ బస్టాండు ప్రాంతంలో కనిపించే ట్రాఫిక్ కష్టాలు. నగరవాసులు ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి వరంగల్‌కు కీలకమైన హనుమకొండ ప్రధాన బస్టాండులో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రత్యామ్నాయ మార్గాలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ డిపోలు 9మొత్తం బస్సులు 908నిత్యం హనుమకొండ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సంఖ్య 60 వేలుఉమ్మడి ఆరు జిల్లాల నుంచి వచ్చే బస్సులు 1200బస్టాండు లోపలికి వెళ్లే రెండు దారులు గందరగోళంగా ఉంటాయి. ఆటో వాలాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుంటారు. కొందరు ఆటో డ్రైవర్లు బస్టాండు నుంచి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అక్కడే చక్కర్లు కొడుతూ ట్రాఫిక్ సమస్యలు తెస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్‌లకు వచ్చే వారి వాహనాలతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతోంది.కట్టడి చేయడం కీలకంఆటోవాలాలు క్రమ పద్ధతిలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడాలి.బస్టాండు రోడ్డుకు రెండు వైపులా ప్రైవేటు ఆసుపత్రుల వారు ఆక్రమించుకున్న ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించాలి. పాదచారులు నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.మూడు మార్గాలు ఉన్నా..ఇదీ కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి.. బస్టాండ్‌లోని బస్సులన్నీ దీని ద్వారానే బయటకు వెళ్లాలిబస్టాండు లోకి వెళ్లడానికి మూడు దారులున్నాయి. కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి, బస్టాండు జంక్షన్ పక్కన ఒకటి, మసీదు పక్కన మరొకటి. అన్ని మార్గాల గుండా వచ్చే బస్సులు మసీదు పక్కన ఉన్న గేటు నుంచే బస్టాండ్‌లోనికి అనుమతి ఇస్తున్నారు. వందలాది బస్సులు ఇదే మార్గంలో లోపలికి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరోవైపు బస్సులన్నీ కేడీసీ దారిలో ఉన్న గేటు గుండా బయటకు వెళ్తుంటాయి.. కీలకమైన బస్టాండ్ జంక్షన్ దారిని ప్రమాదాలు జరుగుతున్నాయని మూసివేశారు.ఇది కీలకమైన జంక్షన్ దారి.. దీన్ని మూసివేయడంలో ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది. ఇది మసీదు పక్క నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే దారి.. బస్సులన్నీ ఇక్కడి నుంచే లోపలికి వెళ్లాలి..ఇలా చేద్దాం గతంలో మాదిరిగానే బస్సులు లోపలికి వచ్చే మార్గాలు రెండు ఉండాలి ఏటూరునాగారం, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట రూట్లలో వచ్చే బస్సులు హనుమకొండ చౌరస్తా మీదుగా మసీదు పక్క ఉన్న దారి గుండా లోపలికి వెళ్లాలి. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జనగామ నుంచి వచ్చే బస్సులు జంక్షన్ వద్ద ఉన్న మార్గం ద్వారా లోపలికి వెళ్లే ఏర్పాటు చేయాలి.ప్రమాదాలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను ఉంచాలి. ప్రైవేటు వాహనాలు లోపలికి రాకుండా కట్టడి చేయగలిగితే ప్రమాదాలు జరగవు.ఇదీ పరిస్థితిములుగు రోడ్డు బస్టాండుహనుమకొండ బస్టాండు ఇరుకుగా ఉంటుంది. పక్కపక్కనే ప్లాట్‌ఫారాలు ఉండటంతో బస్సులు లోపలికి వచ్చి బయటకు వెళ్లాలంటే గంటల కొద్ది సమయం వృథా అవుతోంది. ప్రయాణికులూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.హైదరాబాద్ తరహాలో బస్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ నగరంలో ఎంజీబీఎస్ ప్రధాన బస్ స్టేషన్ ఉన్నప్పటికీ కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఎక్కువ సంఖ్యలో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి నడుస్తాయి. వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి నడుస్తాయి. అదే తరహాలో ఇక్కడ కరీంనగర్, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక బస్‌స్టేషన్ నుంచి పంపిస్తే ఇబ్బందులు తీరుతాయి. హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో 20 శాతం బస్సులను హనుమకొండ బస్టాండు నుంచి కాకుండా కాజీపేట బస్టాండు నుంచి పంపిస్తే సగం ప్రయాణికులకు సమయం ఆదాతో పాటు ఆర్టీసీకి డీజిల్ ఆదా అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు ఉండవు.ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్ వెళ్లే వాహనాలు నేరుగా ములుగు రోడ్డు నుంచి వెళ్లేలా చూడాలి.కరీంనగర్, నిజామాబాద్ బస్సుల్లో కొన్నింటిని హనుమకొండ పెట్రోల్ పంపు నుంచి నేరుగా పంపించొచ్చు.రిజర్వేషన్ బస్సులను సైతం మరో చోటు నుంచి పంపించే ఏర్పాటు చేస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుంది.సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి నాళ్లగిరి రమేష్, ప్రయాణికుడు, హనుమకొండబస్టాండు రోడ్డు నుంచి మచిలీబజార్, పద్మాక్షిరోడ్డుకు వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇష్టారీతిగా పార్కింగ్ చేసి ఉంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నడుస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో పాటు, నగరపాలక సంస్థ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.బస్టాండులోకి ప్రైవేటు వాహనాల రాకకు పూర్తిగా అడ్డుకట్ట వేశాం. కాజీపేట, ములుగు రోడ్డు, పెట్రోల్‌పంపుల నుంచి కొన్ని బస్సులను నేరుగా పంపించేందుకు అక్కడ అనువైన స్థలం లేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తున్నాం.

# వృద్ధులకు ఆదరువు కరువు!

ఇటీవల కాలంలో వయోవృద్ధుల సంరక్షణ ప్రశ్నార్థకమవుతోంది. కనిపెంచిన పిల్లలు రెక్కలొచ్చిన తర్వాత.. తల్లిదండ్రులను వదిలి రివ్వున ఎగిరిపోతున్నారు. ఆస్తులన్నీ చేజిక్కించుకున్నాక.. వయసు మళ్లిన కన్నవాళ్లను వరంగల్ ,ఇటీవల కాలంలో వయోవృద్ధుల సంరక్షణ ప్రశ్నార్థకమవుతోంది. కనిపెంచిన పిల్లలు రెక్కలొచ్చిన తర్వాత.. తల్లిదండ్రులను వదిలి రివ్వున ఎగిరిపోతున్నారు. ఆస్తులన్నీ చేజిక్కించుకున్నాక.. వయసు మళ్లిన కన్నవాళ్లను అనాథలను చేస్తున్నారు. పేద ధనిక తేడాలేకుండా అన్ని వర్గాల్లోనూ వృద్ధులు ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇలా కన్నబిడ్డలు త్యజించిన వృద్ధులు తమకు న్యాయం చేయాలని కోరుతూ.. ప్రజావాణిలో మొరబెట్టుకుంటున్నారు.ఆర్థికంగా స్థిరపడిన వృద్ధులు రూ.వేలకు వేలు చెల్లించి ప్రైవేటు వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతుండగా.. నిరుపేద వృద్ధులు రోడ్డున పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంరక్షణ కేంద్రాలతో పాటు ప్రభుత్వ వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించింది. వక్కనున్న హనుమకొండ జిల్లాలో సంరక్షణ కేంద్రం ఏర్పాటు కోసం ఆ జిల్లా కలెక్టర్ రూ.4.50 లక్షలు కేటాయించారు. జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న ఓ పాత భవనానికి మరమ్మతులు చేసి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈ నెల ఒకటో తేదీన వృద్ధుల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కాగా వరంగల్ జిల్లాలో ఆ దిశగా ఒక్క అడుగు పడకపోవడం శోచనీయం.సంరక్షణ కేంద్రాల్లో ఏముంటాయంటే!వృద్ధుల సంరక్షణ కోసం 'డే కేర్' కేంద్రాల్లో వైద్య సాయం, ఫిజియోథెరపీ వంటి సదుపాయాలు కల్పిస్తారు. అందుకోసం ప్రత్యేకంగా ఓ వైద్య సిబ్బందిని నియమిస్తారు. ఆహ్లాదం కోసం చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్, ఆరోగ్యం కోసం యోగా, జిమ్ వంటి సదుపాయాలుంటాయి. దినపత్రికలతో పాటు వివిధ రకాలైన సామాజిక, ఆరోగ్య, ఆధ్యాత్మిక పుస్తకాలు, టెలివిజన్, విశ్రాంతి కోసం బెడ్లు అందుబాటులో ఉంటాయి. 60 ఏళ్లు పైబడిన వారందరూ కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు కబుర్లు చెప్పుకోనేందుకు, కాలక్షేపం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఈ కేంద్రాల్లో అధికారులు సమకూర్చాల్సి ఉంటుంది.జిల్లా పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన హనుమకొండ జిల్లా వృద్ధుల సంరక్షణ కేంద్రంగుర్తింపు కార్డులకు విలువేది..వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం 60 ఏళ్లు పైబడిన వారికి జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. ఈ కార్డులతో గతంలో ఉచితంగా బస్సు పాసులు, రైళ్లలో వృద్ధులకు రాయితీతో కూడిన ప్రయాణం చేసేందుకు వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం గుర్తింపు కార్డులతో పుణ్యక్షేత్రాల్లో ఉచిత దర్శనం మినహాయించి.. ఎలాంటి సదుపాయాలు అమలు కావడం లేదని వృద్ధులు వాపోతున్నారు. పైగా గుర్తింపు కార్డుల జారీ చేసేందుకు కొందరు అధికారులు వృద్ధుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి..రెండేళ్లుగా.. అధికారులను కోరుతున్నాం..జిల్లాలో 'డే కేర్' కేంద్రాలు ఏర్పాటు చేయాలని రెండేళ్లుగా.. జిల్లా అధికారులను కోరుతున్నాం. అయినా ఎలాంటి ఫలితం లేదు. వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం గురించి మండలాలు, పట్టణాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సమన్వయ సమావేశాలు తప్పనిసరిగా ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాలి. వృద్ధుల భద్రత కోసం స్థానిక పోలీస్‌స్టేషన్ల నుంచి భద్రతా కార్డులు జారీ చేయాలి.ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. రాజమణి, జిల్లా సంక్షేమశాఖ అధికారివయోవృద్ధుల సంక్షేమం కోసం సంరక్షణ కేంద్రాలు, ఉచిత వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వివిధ జిల్లాల్లో అక్కడ పనిచేసే కొన్ని సేవా సంస్థలు సంరక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి.

# ఆ రహదారిలో.. నెలకో ప్రమాదం

మహబూబాబాద్ ,జిల్లాలో ఓ ప్రధాన జాతీయ రహదారి.. అందులోనూ ఓ ముఖ్య మార్గంలో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన ప్రమాద సంఘటనల్లో అతివేగం, నిర్లక్ష్యం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కిలోమీటరు దూరంలో పది నెలల కాలంలో జరిగిన ప్రమాదాల్లో పది మంది మరణించారు. తాజాగా జరిగిన ఘటనలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు దుర్మరణం చెందడం అందర్ని కలువరపరుస్తోంది. ప్రమాదాల్లో మృతి చెందిన వారు ఎక్కువ గూడూరు మండలానికి చెందిన వారే ఉన్నారు.మహబూబాబాద్-నర్సంపేట నెంబర్ 365 జాతీయ రహదారిలో జమాండ్లపల్లి-కంబాలపల్లి మధ్య మార్గంలోని కిలోమీటరు దూరంలోని రహదారిపై వాహన ప్రమాదాలు తురుచుగా జరుగుతున్నాయి. ప్రధానంగా రెండు, మూడు ప్రదేశాల్లోనే జరగడం గమనించాల్సిన విషయం. జమాండ్లపల్లి మూలమలుపు నుంచి కంబాలపల్లి గ్రామ శివారు వరకు కిలోమీటరు రహదారిలో ద్విచక్రవాహనాల నుంచి మొదలు కార్లు విపరీతమైన వేగంతో నడిపిస్తున్నారు. దీనికితోడు కొందరు మద్యం మత్తులో ఉండి వాహనాలు నడిపిస్తున్నట్లు, ఈ మార్గంలో జరిగిన ప్రమాదాల్లో మత్తులో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలే అధికమని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం ఈ మార్గంలోనే అర్బన్ పార్కు వద్ద ద్విచక్రవాహనాన్ని అతి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్కడికక్కడే మరణించారు. మహబూబాబాద్ వైపు నుంచి వస్తున్న కారు రహదారి నిబంధనలు పాటించకుండా వేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం వాటిల్లిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో కారుతో పాటు ద్విచక్రవాహనం కూడా ఆనవాలు పట్టనంతగా మారింది.డిసెంబర్ 31న మహబూబాబాద్ శివారు ఏటిగడ్డతండా సమీపంలో వేంగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతి చెందారు

# ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 2

ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెరువనుకున్నారా? అయితే భ్రమ పడినట్లే. అచ్చం చెరువును తలపిస్తున్న ఈ ప్రాంతం ఏడాది క్రితం వరకు సాగు భూమి. కొన్ని ఎకరాల్లో ఉన్న ఈ భూమి చెరువుగా ఎలా మారిందని అనుకుంటున్నారా. మొరం మట్టి తవ్వడంతో ఈ పరిస్థితి నెలకొంది. వడ్డేపల్లి మండలం జూలకల్‌లోని ఆర్డీఎస్ కాలువకు సమీపంలోని భూములను ఈ ప్రాంతంలో చేపడుతున్న భారత్‌మాల రహదారి కోసం తవ్వారు. ఇక్కడ పట్టా, సీలింగ్ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో ఎకరాలు ఎకరాలు చెరువులను తలిపిస్తున్నాయి. సుమారు 10 అడుగుల లోతు వరకు భూమిని తవ్వి మొరం తరలించారు. మహారాష్ట్రలోని అక్కల్‌కోట నుంచి చెన్నై వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు జోగులాంబ గద్వాల జిల్లాలో 77.5 కిలోమీటర్ల మేరకు సాగుతున్నాయి. ఈ పనుల కోసం కేంద్రం రూ.1,568 కోట్లు కేటాయించింది. పనుల్లో భాగంగా మొరం మట్టిని వాడాలి. ప్రస్తుతం వడ్డేపల్లి మండలంలో పనులు కొనసాగుతున్నాయి. జూలకల్ ప్రాంతంలో కొన్ని ఎకరాల్లోని వ్యవసాయ భూములను మొరం మట్టి పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఇందులో భాగంగా కొందరికి ఎకరాకు రూ.లక్షల్లో ముట్టజెప్పారు. ఈ గ్రామంలోనే ఉన్న ఓ గుట్టను చెరపట్టారు. ఆర్డీఎస్ కాలువ వెంట ఉన్న పలు భూములను జేసీబీ, పొక్లెయిన్లు, టిప్పర్లు పెట్టి 10 అడుగులకుపైగా గుంతలు తీస్తున్నారు. ఇటీవల పడిన వర్షాలతో ఈ ప్రాంతాల్లో కొత్త చెరువులు పుట్టుకొచ్చాయి.వడ్డేపల్లి గట్టు మాయమవుతోంది. ఇక్కడ మాధవస్వామి ఆలయం ఉంది. ఇక్కడి నుంచి కొన్ని లక్షల టన్నుల్లో మొరం మట్టిని తరలించారు. ఇక్కడి గుట్టను ఇష్టారాజ్యంగా తవ్వడంపై స్థానికుల నుంచి అభ్యంతరం వచ్చినా లెక్కజేయడం లేదు. బుడమర్సు, తనగలలోని గుట్టలను కూడా యథేచ్ఛగా తవ్వుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోని ప్రధాన గుట్టలను ఖాళీ చేస్తున్నారు.కిమ్మనని యంత్రాంగం : నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా నాయకులు, అధికార యంత్రాంగం నోరెత్తడం లేదు. నియోజకవర్గంలో కీలకంగా ఉన్న కొందరు వ్యక్తులకు చేయితడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జరిమానాలు విధించామని భూగర్భ గనులశాఖ అధికారులు పైకి చెబుతున్నా అవన్నీ ప్రకటనలకు, కాగితాలకే పరిమితం. సాధారణంగా టన్ను మొరం మట్టికి రూ.35, రాళ్లకు రూ.80 వరకు సినరేజీ ఛార్జీలు చెల్లించాలి. గతంలో గట్టు, కేటీదొడ్డి మండలాల్లో తవ్వకాలు జరిగినప్పుడు విమర్శలు హోరెత్తడంతో సుమారు రూ.56కోట్ల వరకు జరిమానాలు విధించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీనిపై జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణను 'ఈనాడు' సంప్రదించగా క్షేత్రస్థాయికి అధికారులను పంపించి విచారణ చేయిస్తామని తెలిపారు.ఈ చిత్రంలో కనిపిస్తున్నది వడ్డేపల్లి గట్టు. దీనిపై మాధవ స్వామి ఆలయం కూడా ఉంది. ఒక్కప్పుడు 25 ఎకరాలకుపైగా ఈ గుట్ట విస్తరించి ఉండేది. జాతీయ రహదారి కోసమని అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వారు. ప్రస్తుతం 25 ఎకరాల గుట్ట పూర్తిగా మాయమయ్యే పరిస్థితి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరపడంతో జిల్లాలోనే ఎంతో గుర్తింపు ఉన్న ఈ గుట్ట ప్రస్తుతం మాయమయ్యే పరిస్థితి వచ్చింది.

# ఇళ్ల పంపిణీ ఇంకెప్పుడో..?


భూత్పూర్, ఫిబ్రవరి 2

,మెట్టుగడ్డ(మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : పేదవాడి సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతంగా ఇళ్లు ఉండాలనే తలంపుతో కేసీఆర్ హయాంలో ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి పెద్ద మొత్తంలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చాలా గ్రామాల్లో స్థలాల కొరత, గుత్తేదారుల అనాసక్తి లాంటి కారణాలతో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గంలోనూ 2,981 ఇళ్లు నిర్మించగా 2,667 లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాలు, కేటాయింపులు అరకొరగానే మిగిలాయి.ఒక్కటిలేదు.. : జిల్లాలోని కొన్ని మండలాల్లో రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దేవరకద్ర, హన్వాడ, మహ్మదాబాద్, గండీడ్, కోయిలకొండ మండలాల్లో ఒక్క ఇంటిని నిర్మించకపోవడం విశేషం.ఎక్కడెక్కడ ఎన్ని..?ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించిన రెండు పడక గదులను కొన్ని గ్రామాలు, పట్టణాల్లో మాత్రమే లబ్ధిదారులకు కేటాయించినా చాలా చోట్ల సరైన వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు అనాసక్తి చూపుతున్నారు. సౌకర్యాలు లేకపోవడం, ప్రభుత్వం మారడంతో అక్కడక్కడ కొన్ని ఇళ్లు నిర్మాణం పూర్తయినా కూడా లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వకపోవడంతో ఉన్నచోటే శిథిలావస్థలకు చేరుతున్నాయి. దేవరకద్ర నియోజకవర్గంలోని



భూత్పూర్ పురపాలిక పరిధిలోని నర్సింగాపూర్‌లో 24, కౌకుంట్ల మండలం పేరూరులో 80, జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలం కొత్తపల్లిలో 24, నవాబుపేట మండలంలోని తీగల్‌పల్లి 24, రుద్రారం 48 ఇళ్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఎన్మన్‌గండ్లలో 24 ఇళ్లు మాత్రం లబ్ధిదారులకు కేటాయించినా ప్రభుత్వం మారిన తర్వాత పట్టాలను రద్దు చేశారు. రాజాపూర్ మండలం చొక్కంపేటలో 32, బాలానగర్ మండలంలోని పెద్దాయిపల్లిలో 40, గౌతాపూర్ 64 పూర్తయిన డ్రైనేజీ, విద్యుత్తు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పట్టాలు ఇవ్వలేదు. జడ్చర్ల పట్టణం, మండలంలో 1,069 ఇళ్లు పూర్తికాగా 351 మాత్రమే పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలో 314, మండలంలోని పత్తేపూర్‌లో 40, కోడూరు వద్ద 56 ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంది. ఇళ్ల కేటాయింపు విషయమై గృహనిర్మాణ శాఖ ఈఈ భాస్కర్‌ను వివరణ 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సెలవులో ఉన్నానని, తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.పగిలిన కిటికీ అద్దాలు

# పనిచేయని పరికరాలు.. అందని సేవలు



ఆ యంత్రం కూడా కొద్ది రోజుల నుంచి పని చేయడం లేదు. నిత్యం కనీసం 10 మంది గర్భిణులకు సంబంధించిన పరీక్షలు టీ హబ్‌కు వస్తాయి. కానీ ఇక్కడ యంత్రం పని చేయకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లక తప్పడం లేదు.

పాలమూరు, ఫిబ్రవరి 2

, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రంలో యంత్రాలు, వైద్య పరికరాలు సక్రమంగా పని చేయకపోవడంతో తరచుగా సమస్యలు తలెత్తుతున్నాయి. అధునాతన యంత్రాలపై పర్యవేక్షణ లేకపోవడంతోనే అవి మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఏ రోజుకారోజు రావాల్సిన రక్త నమూనాల ఫలితాలు ఆలస్యంగా వస్తుండటంతో వైద్యం సకాలంలో అందక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, నారాయణపేట జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల ద్వారా రక్త నమూనాలను మహబూబ్‌నగర్ టీ హబ్‌కు పంపుతున్నారు. నిత్యం 500 నుంచి 600ల వరకు నమూనాలు ఇక్కడికి వస్తున్నాయి. ఇక్కడ 20 రోజుల నుంచి సిమెన్స్ యంత్రం పని చేయడం లేదు. దీంతో నమూనాలను గద్వాల, వనపర్తికి పంపి అక్కడ పరీక్షలు చేసిన అనంతరం రెండు, మూడు రోజుల తరువాత ఫలితాలు బాధితులకు అందుతున్నాయి. లివర్, కిడ్నీ, కొవ్వు, మధుమేహం, కాల్షియం, అమలైజ్‌సిరం, తదితర వాటికి సంబంధించిన పరీక్షలు నిలిచిపోయాయి.సిబ్బందిపై ఆగ్రహం..టీ హబ్‌లో యంత్రాలు పని చేయడం లేదనే విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంపత్‌కుమార్ సింగ్‌కు దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఆయన నేరుగా ఆర్ఎంవో డా. జరీనాతో కలిసి టీ హబ్‌ను సందర్శించారు. పని చేయని యంత్రాల గురించి తనకు సమాచారాన్ని ఎందుకు చెప్పలేదని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.యంత్రంలో పని చేయని భాగాన్ని సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్‌కు వివరిస్తున్న వైద్య సిబ్బందిపీటీఎన్‌ఆర్ పరీక్షలకు బయటకు..టీ హబ్‌లో గర్భిణులకు సంబంధించిన అతి ముఖ్యమైన పీటీఎన్‌ఆర్ సేవలు అందడం లేదు.

ఆ యంత్రం కూడా కొద్ది రోజుల నుంచి పని చేయడం లేదు. నిత్యం కనీసం 10 మంది గర్భిణులకు సంబంధించిన పరీక్షలు టీ హబ్‌కు వస్తాయి. కానీ ఇక్కడ యంత్రం పని చేయకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లక తప్పడం లేదు. బయట ఒక్క పరీక్ష చేయడానికి రూ.2500ల వరకు ఖర్చు అవుతుండటంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర అతి ముఖ్యమైన పరీక్షలు అందకుండా పోతున్నాయి.వెంటనే మరమ్మతులు చేయిస్తాంసాధ్యమైనంత త్వరగా యంత్రాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తాం. యంత్రాలకు సంబంధించిన విభాగాలు కూడా కొరియర్‌లో వచ్చాయని, వెంటనే వాటికి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం.ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్

# ఫసల్ బీమా అమలుకు రంగం సిద్ధం



తెలకపల్లి, ఫిబ్రవరి 2

,ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ పథకాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై మహబూబానగర్‌లో రెండుసార్లు ఉమ్మడి జిల్లా వ్యవసాయ, ఉద్యాన, ప్రణాళిక అధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఉపసంచాలకుడు హాజరై చర్చ నిర్వహించారు. రైతులు, రైతుల సంఘాల నాయకుల అభిప్రాయలు తీసుకున్నారు.ప్రయోజనాలు ఎక్కువే : ఈ పథకం అమలుతో రైతులకు బోలెడు ప్రయోజనాలు చేకురుతాయి. అననుకూల వాతావరణమే కాకుండా ఏ విధంగా పంట నష్టపోయినా బీమా వర్తిస్తుంది. వర్షాలు లేక పంట వేయకున్నా, సాగుచేసిన పంటలో అడవిపందులు, జింకల వంటి జంతువుల బెడదతో నష్టపోయినా పథకం వర్తిస్తుంది.ప్రకృతి వైపరీత్యాలకూ కవరేజీ ఉంటుంది. పంట కోత సమయంలో వడగళ్లవాన తదితర కారణలతో పంట నష్టపోతే బీమా వర్తిస్తుంది. రైతు యూనిట్‌గా అమలు చేస్తే ప్రయోజనమని కొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.వానాకాలంలో ఇలా... :మహబూబ్‌నగర్ జిల్లాలో మక్కలు, జొన్న, కంది, పత్తి, టమటా పంటలకు మండలం యూనిట్‌గా తీసుకొని పథకం అమలు చేయనున్నారు. వరిపైరు మాత్రం గ్రామం యూనిట్‌గా తీసుకుంటారు.గద్వాల జిల్లాలో వరి, కంది, మక్క, వేరుశనగ, పత్తి, టమట పైర్లు మండలం యూనిట్‌గా తీసుకోనున్నారు.వనపర్తి జిల్లాలో జొన్న, వేరుశనగ, కంది, చెరకు, పత్తి, టమట పంటలకు మండలం యూనిట్‌గా అమలు చేస్తారు.వరిపైరు మాత్రం గ్రామం యూనిట్‌గా అమలవుతుంది.నాగర్‌కర్నూల్ జిల్లాలో మక్కలు, కంది, జొన్న, పత్తి పైర్లకు మండలం యూనిట్‌గా అమలు చేస్తారు. వరి పైరు మాత్రం గ్రామం యూనిట్‌గా తీసుకుంటారు.నారాయణపేట జిల్లాలో కంది, పత్తి, పెసర, జొన్న పైర్లు మండలం యూనిట్‌గా అమలవుతాయి. వరిపైరు గ్రామం యూనిట్‌గా అమలవుతుంది రైతుకు పైసా ఖర్చు లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తున్నందున రైతులు ఈ పథకం వినియోగించుకోవాలని నారాయణపేట జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ అన్నారు.

# సమన్వయలోపం.. సమయాభావం

ఆత్మకూరు, ఫిబ్రవరి 2

,ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు బాధ్యత వహించే కమిటీల ఏర్పాటులో జాప్యమయ్యేలా పరిస్థితి కనిపిస్తోంది. దసరా పండగ నాటికి కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినా సమయాభావంతో పూర్తి చేయలేకపోయారు. వరుస సెలవుల వల్ల గ్రామ పంచాయతీలు, పురపాలికల్లోని వార్డు స్థాయిల్లో కమిటీల ఏర్పాటు కొలిక్కిరాని పరిస్థితి నెలకొంది. అర్హులైన పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఈ పథకం అమలుకు ప్రభుత్వం సంకల్పించింది. గ్రామ, పురపాలికల స్థాయిలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ల నుంచి ఆదేశాలున్నా క్షేత్ర స్థాయిలో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు యంత్రాంగం సమాయత్తం కావాల్సి ఉంది. గ్రామాల్లో పాలకవర్గాలు లేని క్రమంలో ప్రత్యేక అధికారి ఛైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా, స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు, స్థానికులు ముగ్గురు ఇందిరమ్మ కమిటీలో సభ్యులుగా ఉండాలని నిర్దేశించారు. ముగ్గురు స్థానికుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి స్థానం కల్పించనున్నారు. పురపాలికల్లో పాలకవర్గాలు కొనసాగుతున్న నేపథ్యంలో కౌన్సిలర్ ఛైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా, స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు, స్థానికులు ముగ్గురికి అవకాశం దక్కనుంది. ముగ్గురు స్థానికుల్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి చోటు కల్పించనున్నారు.ఆధిపత్యపోరు తప్పదా?ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కమిటీల్లో రాజకీయ ఆధిపత్య పోరు తలనొప్పి వ్యవహారంగా మారే అవకాశం లేకపోలేదు. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన క్రమంలో ఆయా పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో అధికార పార్టీ నాయకులు తమ అనుచరులకు స్థానం కల్పించాలని ఇప్పటికే



సన్నద్ధమయ్యారు. లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణ, ఆర్థికసాయం చెల్లింపులో కీలకంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని.. గ్రామ, వార్డు స్థాయిల్లో ద్వితీయ శ్రేణి నాయకులు తమ పేర్లను నాయకుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

గ్రామ కార్యదర్శులపై ఒత్తిళ్లు!జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీలు, ఐదు పురపాలికల్లోని 80 వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. మొత్తంగా 445 కమిటీల్లో కన్వీనర్, ఛైర్మన్ కాకుండా 1,675 మంది పొదుపు సంఘాల సభ్యులు, స్థానికులకు అవకాశం ఏర్పడనుంది. స్వయం సహాయక పొదుపు సంఘాల సభ్యుల్లో అధికార పార్టీ నాయకుల కుటుంబ సభ్యులకే ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో స్థానం కల్పించే విధంగా ఇప్పటికే గ్రామ కార్యదర్శులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. సమన్వయలోపం, ఆధిపత్య పోరు మధ్య ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు యంత్రాంగం సోమవారం నుంచి కసరత్తు చేపట్టనుందినేడు పూర్తిస్థాయిలో కార్యాచరణ ఇప్పటికే మార్గదర్శకాలు జారీ అయ్యాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో పూర్తి స్థాయిలో కార్యాచరణ ఖరారు కానుంది. అనంతరం కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నాం.

# ప్రభుత్వ గోదాముల్లోనే ధాన్యం నిల్వ!

ధరూరు, ఫిబ్రవరి 2

ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక మీదట రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నేరుగా ప్రభుత్వ గోదాములకు తరలించి నిల్వ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనలకు వ్యవసాయ శాఖ ఆమోదం తెలిపింది. త్వరలోనే దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.గతంలో ఇలావరి ధాన్యం నేరుగా మిల్లులకే కేటాయించటం కస్టమ్ మిల్లింగ్ ద్వారా తిరిగి వారి నుంచి బియ్యంను తీసుకోవటం చేశారు. ఈ ఏడాది మిల్లర్లు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచటంతో పాటు మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని పట్టుబట్టుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నిర్ణయం వెనక మరో అంశం కూడా ఉన్నట్లు సమాచారం. గతంలో మిల్లులు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్‌కు తరలించి అమ్ముకోవటం వాటి స్థానంలో పీడీఎస్ లేదా ఇతర చోట్ల నుంచి సేకరించిన బియ్యం ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది.



కొన్ని మిల్లుల నిర్వాహకులు ధాన్యం నిల్వలను పక్కదారి పట్టించి బియ్యం ఇవ్వలేక బకాయిపడ్డారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు, ఆస్తుల జప్తునకు కలెక్టర్లు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.అవసరమున్న మేరకే మిల్లింగ్‌కొనుగోలు చేసిన ధాన్యం వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఉన్న గోదాములు, స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో నిల్వ చేయనున్నారు. అయితే ఇప్పటికే వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చి ఉంటే వాటిని ఖాళీ చేయించి వరి ధాన్యం నిల్వకు ఉపయోగించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా వచ్చే ధాన్యాన్ని సమీపంలో వ్యవసాయ శాఖ గోదాములకు తరలించి నిల్వ చేస్తారు. రైసు మిల్లర్లతో సమస్య పరిష్కారం అయిన తర్వాత వారికి కేటాయించే అవకాశం ఉంది. ధాన్యం మిల్లులకు కేటాయింపుల్లో కూడా ఈసారి మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలిసింది. సంక్షేమ పథకాలకు అవసరం ఉన్న మేర మాత్రమే మిల్లింగ్ చేయించి మిగిలిన వరిధాన్యం బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు సమాచారం.నేటికి మంచి రోజులుగత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న చోట మండలానికి 5వేల మెట్రిక్ టన్నులు, సాగువిస్తీర్ణం ఎక్కువగా ఉన్నచోట 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను నిర్మించారు. వాటిలో చాలా వరకు వినియోగంలోకి రాలేదు. గట్టు, కేటీదొడ్డి మండలాల పరిధిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములు ఐదేళ్లుగా వృథాగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 65 మండలాల పరిధిలో గోదాములు నిర్మించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ పరిధిలో ఉన్న గోదాముల్లో 4.50 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు అందుబాటులో ఉన్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో మొత్తం 17 చోట్ల దాదాపు 2లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాములున్నాయి. జోగులాంబ జిల్లాలోనే 8 మండలాల పరిధిలో 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16.25 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి రానుందని అంచనా. దీనికి అనుగుణంగా నిల్వకు ఇటు వ్యవసాయ శాఖ అటు పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

# ఉత్కంఠకు తెర



హుజూర్‌నగర్, ,మిల్లర్లు తమ డిమాండ్లు తీర్చాలని పట్టుబడుతున్న క్రమంలో.. కోతలు ప్రారంభం కాగానే ధాన్యం తీసుకునేందుకు మిల్లర్లు ముందుకు రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళనకు తెర పడింది. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తే పరిస్థితి గందరగోళంగా మారుతుందని అటు అధికారులు, రైతులు కొంతమేర ఆందోళనగా ఉన్నారు. తాజాగా ప్రభుత్వం ధాన్యాన్ని నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చర్చల దశలో మిల్లర్ల సమస్యలు..రాష్ట్ర సబ్ కమిటీ ముందు మిల్లర్లు పలు సమస్యలు ఉంచారు. సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు 67 శాతం బియ్యం రావని, 58 శాతం బియ్యం, 9 శాతం నూకలు ఇస్తామని, తేమ శాతం 14 శాతం మార్చాలని అడుగుతున్నారు. 32 రకాల ధాన్యాన్ని సన్న రకాలుగా గుర్తించాలని, మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవి చర్చల దశలో ఉన్నాయి.వీటిపై నిర్ణయం రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వంపై ఒత్తిడి లేకుండా కొనుగోలు చేసిన ధాన్యం గోదాములలో నిల్వ చేసి చర్చలు ముగిసిన తరువాత మిల్లులకు కేటాయించేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం, 10,69,029 మెట్రిక్ టన్నుల దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యంతో ఇబ్బంది లేకపోయినా సన్నరకాల ధాన్యాన్ని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు గోదాముల పరిస్థితి ఏమిటన్న విషయంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం గోదాములో నిల్వ చేసి నిబంధనల ప్రకారం గడువు అయి పోయిన వారిని వెంటనే ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.గోదాముల పరిస్థితి ఏమిటి? ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల గోదాములు కలిపి 59 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా అధికారులు సెప్టెంబరు రెండో వారంలో రాష్ట్ర అధికారులకు ఇచ్చిన సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో 9,49,359 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండగా.. అందులో 6,51,685 మెట్రిక్ టన్నుల మేర గోదాముల్లో నిల్వలు ఉన్నాయి. కేవలం 2,97,674 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఖాళీగా ఉంది. అధికారులు ఇప్పుడు పాత నిల్వలను ఖాళీ చేయించుకుంటేనే ప్రభుత్వ ఆలోచన ప్రకారం నిల్వ చేసుకునే అవకాశం దొరుకుతుంది. నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో అత్యధికంగా గోదాము ఉపయోగంలో ఉన్నందున దాన్ని ఖాళీ చేయించుకునేందుకు అధికారులు కరసత్తు చేయాల్సి ఉంది.

# జయప్రదమైన.. ఆలోచన



చౌటుప్పల్, ,

మహిళలు మక్కువతో కొనుగోలు చేసి, ఇష్టంగా ధరించే ఖరీదైన చీరలు, రవికల అందం, ఆకర్షణ తగ్గకుండా సంరక్షించడాన్ని స్వయం ఉపాధిగా ఎంచుకున్నారు అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్ల జయప్రద. ఈమె మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు. 2002లో గ్రామంలోని పది మంది మహిళలతో కలిసి శ్రీలక్ష్మి-1 పొదుపు సంఘం సభ్యురాలిగా చేరారు. సంఘం సమావేశాల్లో కేవలం పొదుపు చేయడం గురించే కాకుండా మద్యనిషేధం, భావిపౌరుల సంక్షేమం, వనాల పెంపకం, జల సంరక్షణ అంశాలపై చర్చించేవారు. పొదుపు సొమ్మును, బ్యాంకు నుంచి రుణ సహాయాన్ని కలిపి తమ కుటుంబ సంక్షేమానికి, ఆదాయ అభివృద్ధికి వినియోగిస్తున్నారు. సంఘం ఇచ్చిన చైతన్యంతో సొంతంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించి స్వయం ఉపాధితోపాటు కొందరికి పని కల్పించాలని ఆలోచించారు. చీరలు, రవికలు, వివిధ రకాల వస్త్రాలను ఆధునిక పద్ధతిలో శుభ్రం చేయడం, కొత్తవాటిలా మెరిసేలా పాలిషింగ్ చేయడం, మరకలను తొలగించడం, డ్రైక్లీనింగ్ లాంటి వస్త్ర సంరక్షణ పనులు చేయడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందారు. తన వ్యాపార ఆలోచనను స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులకు వివరించడంతో వారు ప్రోత్సహిస్తూ రూ.4లక్షల రుణాన్ని మంజూరు చేశారు. ఆ డబ్బుతో యంత్రాలను కొనుగోలు చేసి 'శ్రీదత్త శారీ కేర్ సెంటర్'ను చౌటుప్పల్‌లో ప్రారంభించారు. తనతోపాటు మరో మహిళకు ఉపాధి కల్పించారు. వస్త్రాలు మహిళల గౌరవాన్ని పెంచుతాయి- నల్ల జయప్రద, శ్రీదత్త శారీ కేర్ సెంటర్ నిర్వాహకురాలు మహిళలు, పురుషులు తమ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచుకునేలా ఆధునికమైన, ఖరీదైన వస్త్రాలను ధరిస్తున్నారు. పెళ్లిళ్లు, పేరంటాలకు విలువైన పట్టుచీరలు, నాణ్యమైన వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. వాటిని ధరించిన తర్వాత ఆధునిక పద్ధతుల్లో శుభ్రం చేయాల్సి ఉంటుంది. మరకలు పడితే, వాటికున్న వెండి జరి, అలంకరణ రంగు మారి, మాసిపోయినట్టు అవుతుంది. వాటిని కొత్త వాటిలా తయారు చేయకపోతే వన్నె తగ్గుతుంది. ఈ పనులు చేయడం ద్వారా పరోక్షంగా మహిళలకు ఉపయోగపడవచ్చు. ప్రత్యక్షంగా ఉపాధి పొందవచ్చునని ఆలోచించి ఈ సెంటర్‌ను ప్రారంభించాను. ఉపాధి పొందుతున్నా.. - జె.సంధ్య, బీఎస్సీ పట్టభద్రురాలు, చౌటుప్పల్ బీఎస్సీ చదివా. ఇంటి వద్ద ఖాళీగా ఉండేదాన్ని. కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ఏదైనా ఉద్యోగం చేయాలని అనుకుంటున్న సమయంలో ఈ సెంటర్‌లో సహాయకురాలిగా పని చేసేందుకు అవకాశం దొరికింది. ఇంటి పనులయ్యాక తీరిక సమయంలో ఇక్కడికొస్తున్నా. పని నేర్చుకుంటూ నిర్వాహకురాలికి సహాయ పడుతున్నా. ఇది గౌరవ ప్రదంగా నిర్వహించే స్వయం ఉపాధి. భవిష్యత్తులో ఈ అనుభవం ఉపయోగపడుతుంది.

# వైన్స్‌లో రూ.10.84 లక్షలు మాయం

గుర్రంపోడు, ఫిబ్రవరి 2 పండగ రోజున గుర్రంపోడులోని ఓ వైన్స్‌లో రూ.10.84 లక్షల నగదు మాయమైంది. ఈ ఘటన తాలుకు దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..



శనివారం అర్ధరాత్రి 1:30 గంటలకు ఓ ఆగంతకుడు ఆదిత్య వైన్స్ పైకప్పు రేకును తొలగించి దుకాణం లోపలికి చొరబడి నగదు కట్టలను తీసుకుని ఉడాయించాడు. దుకాణం యజమాని పొనుగోటి నర్సింహారావు ఆదివారం ఉదయం దుకాణం షట్టరు తెరిచి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ ధనుంజయ, ఎస్ఐ నారాయణరెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన వీడియో ఫుటేజీల ఆధారంగా ముఖానికి మాస్కు, నల్లటి బనియను ధరించిన 30 ఏళ్ల యువకుడు ఈ చోరీకి పాల్పడినట్లు స్పష్టమవుతోంది. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు లభించిన ఆధారాలతో పోలీసులు దొంగ ఆచూకీ కనిపెట్టే ప్రయత్నంలో నిమఘ్నమయ్యారు. ఇదిలా ఉండగా.. నల్గొండ జిల్లాలోని పలు వైన్స్‌ల్లో జరిగిన దొంతనాల్లో గుర్రంపోడు చోరీనే భారీ ఘటనగా చెబుతున్నారు. కొండమల్లేపల్లి, దేవరకొండ, నల్గొండ తదితర పట్టణాల్లో వైన్స్‌ల్లో దొంగతనాలు జరిగాయని, వాటిల్లో కూడా నల్లటి బనియను ధరించి మాస్కు వేసుకున్న వ్యక్తే దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించారు. నెల్లూరు జిల్లా కొవ్వూరులో నివాసం ఉంటున్న నేపాలియన్ రమేష్ బిస్త్ నిత్యం పట్టణాల్లో తిరుగుతూ లాడ్జీల్లో ఉండి వైన్స్‌ల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసుల వద్ద ప్రాథమిక సమాచారం ఉంది.

# గడపకో.. ఉద్యోగి..!




మిర్యాలగూడ ,ఫిబ్రవరి 2

ఊరు పుట్టినప్పటి నుంచి ఉన్న ఆ వీధిలో ఒకప్పుడు కూలీలు, తాపీ పని చేసే వారు మాత్రమే ఉండేవారు. పలువురికి వ్యవసాయ భూములున్నప్పటికీ సాగు చేసేందుకు నీటి సదుపాయం లేక కూలీ పని చేసుకుని జీవనం సాగించేవారు. అత్యధికులు తాపీపని నమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటూ పిల్లలను చదివించేవారు. కాలక్రమంలో వ్యవసాయాన్ని వృద్ధి చేసుకున్నారు. తాపీ కూలీలు.. మేస్త్రీలుగా మారారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడం మొదలుపెట్టారు. పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినోభా బావే పేరుతో ఏర్పడిన ప్రస్తుత 36వ వార్డులోని వినోభా నగర్ నేడు విద్యాధికుల కాలనీగా మారింది. 2005 నుంచి ఉన్నత చదువులు చదువుతున్న వారి సంఖ్య పెరగడంతో ఉద్యోగుల సంఖ్య సైతం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 300 కుటుంబాలున్న ఆ కాలనీలో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, మరో వంద మందికి పైగా ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు.అటు ఉద్యోగం.. ఇటు వ్యవసాయంఈ కాలనీకి చెందిన ఇద్దరు పోలీస్ శాఖలో సీఐలుగా, ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు, ఆరుగురు హోంగార్డులుగా పనిచేస్తున్నారు. ఐదుగురు డాక్టర్లు, 30 మంది ఉపాధ్యాయులు, పరిశ్రమల శాఖలో ఒకరు, డీసీటీవోలో ఒకరు, వ్యవసాయ శాఖ ఏడీ ఒకరు, విద్యుత్తు ఏడీఈ ఒకరు, నీటి పారుదల శాఖలో ఇద్దరు ఏఈలు, మరో ముగ్గురు ఉద్యోగులు, నర్సులు ఐదుగురు, పంచాయతీ కార్యదర్శులు ఐదుగురు, వివిధ శాఖల్లో సీనియర్, జూనియర్ సహాయకులు పది మంది, అటెండర్లు 20 మంది ఉన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు 20 మంది పనిచేస్తున్నారు. మరో 80 మంది వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తం 250 మందికి పైగా ఉద్యోగులు ఉండగా.. వీరిలో పలువురు విధుల అనంతరం వ్యవసాయం చేస్తున్నారు. తాపీ పనిచేస్తూ చదివించారు..- కోడిరెక్క రవికుమార్, విద్యుత్తు ఏడీఈ, మిర్యాలగూడఅమ్మానాన్నలు కోడిరెక్క దోర్నీసు, సుక్కమ్మలు. నాన్న తాపీ పని చేస్తూ మమ్మల్ని ఉన్నత చదువులు చదివించారు. ఎంటెక్ పూర్తి చేసి విద్యుత్తు శాఖలో ఏడీఈగా పని చేస్తున్నా. మా పెద్ద చెల్లి రాధ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, చిన్న చెల్లి వినయరాణి హైదరాబాద్‌లో డాక్టర్, తమ్ముడు వినోద్ కెనడాలో దంత వైద్యుడిగా పని చేస్తున్నారు. అమ్మానాన్న చదువు విలువ తెలుసుకుని ఎంతో కష్టపడి మమ్మల్ని చదివించారు. ఇంటికి ఇద్దరు పట్టభద్రులేకోడిరెక్క శైలజ, పంచాయతీ కార్యదర్శి, తక్కెళ్లపాడు, మిర్యాలగూడ మండలంనాన్న కోడిరెక్క మల్లయ్య తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూనే మాకు ఏ లోటు రాకుండా ఉన్నత చదువులు చదివించారు. ఎం.ఫార్మసీ పూర్తి చేసి 2019 నుంచి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. సోదరి వసంత పట్టణంలోనే వైద్యురాలు. సోదరుడు నాగేందర్ డీసీటీవోగా పని చేస్తున్నారు. చదువు విలువ తెలుసుకున్న తలిదండ్రులు మేము ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించారు. మా కాలనీలో ఇంటికి ఇద్దరు పట్టభద్రులు, ఇంటికొక్కరు చొప్పున ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

# చిగురిస్తున్న ఆశలు

ఆలేరు, ఫిబ్రవరి 2

సేద్యం చేయడానికి గతంలో ఎద్దులు, నాగళ్ల అవసరం ఉండేది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాలలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వ్యవసాయ రంగంలోనూ ఆధునిక యంత్రాలు, పరికరాల వినియోగం పెరిగింది. సాగులో దున్నడం మొదలు పంటనూర్పిడి వరకు ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ పరంగా రాయితీతో కూడిన వివిధ పథకాలు అమలులో ఉండేవి. రాయితీపై వ్యవసాయ సామగ్రి, యంత్రాలు రైతులకు మంజూరయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. పాలకులు ఈ పథకాలను పక్కన పడేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాయితీ పథకాలను అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.ఏటా రూ.600 కోట్లు ఖర్చునకు సిద్ధం వ్యవసాయశాఖ పరంగా ఇప్పటికే రైతుబంధు(రైతు భరోసా), రైతు బీమా పథకాలు అమలవుతున్నాయి. తాజాగా రాయితీతో కూడిన పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. ఇందులో ఉమ్మడి



నల్గొండ జిల్లాకు ఏటా రూ.60 కోట్లకు పైగా నిధుల కేటాయింపు జరగనుంది. రోటోవేటర్లు, మూడుకాళ్ల నాగళ్లు, ఆఫ్‌కేజీ చక్రాలు, గొర్రు, పిచికారీ యంత్రాలు, బోరు మోటార్లు, టార్పాలిన్లు లాంటివి రాయితీపై అందనున్నాయి.తప్పనున్న కొనుగోలు'భారం'బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకు పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం వివిధ రకాల సామగ్రి మంజూరు చేసినప్పటికీ ప్రచార లోపం, ఆయా సంఘాల మహిళలకు వాటిపై పట్టు దొరక్కపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏటా వేలాది మంది రైతులకు రాయితీపై పరికరాలు అందనున్నాయి.

# నిర్వహణ లేమి.. అనారోగ్యమే మరి



కోదాడ ,ఆదివారం వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో మాంసం వంటకాలతో వంట గది ఘుమఘుమలాడాల్సిందే. మాంసం ధరలు రోజురోజుకు పెరుగుతున్నా విక్రయాల్లో మాత్రం తేడాలుండట్లేదు. కానీ విక్రయించే చోట శుభ్రత ఉండటం లేదు. విక్రయదారులకు స్థలం లేకపోవడంతో తోపుడు బండ్ల మీదే విక్రయిస్తున్నారు. ఒక్క కోదాడ పట్టణంలోనే ఆదివారం పదుల సంఖ్యలో బండ్ల మీద విక్రయిస్తున్నారు. రహదారి మీద వచ్చిపోయే వాహనాలకు దుమ్ము, ధూళి మాంసంపై పడుతున్నా, ఈగలు వాలుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రత్యేక షెల్టర్లు లేక.. మాంసం విక్రయించేందుకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలని దుకాణాదారులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేకంగా మార్కెట్ ఉంటే శుభ్రత పాటించవచ్చని, రహదారి మీద ఇబ్బందిగా ఉంటుందని వారు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పురపాలికల్లో మాంసం విక్రయాల కోసం ప్రత్యేక మార్కెట్లు లేక అంతటా ఇదే తరహా విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.శుభ్రత పాటించకుంటే జరిమానాలు-యాదగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోదాడమాంసం విక్రయదారులు ఆరుబయట విక్రయించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. దుమ్ము, ధూళి పడకుండా కవర్లు ఏర్పాటు చేయాలి. శుభ్రత పాటించకుండా విక్రయిస్తే జరిమానాలు విధిస్తాం. పురపాలిక తరఫున విక్రయదారులకు దుకాణాలు ఏర్పాటు చేస్తాం.

## సీఐ.. ఇక ఠాణా బాస్

భువనగిరి , ఫిబ్రవరి 2,ఎస్సైలు.. స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)లుగా ఉన్న పోలీస్ స్టేషన్ల స్థాయి పెంచుతున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమిస్తూ బలోపేతం చేస్తున్నారు. జిల్లాలో బీబీనగర్, ఆత్మకూరు(ఎం) రెండు పోలీస్ స్టేషన్లకు ఇప్పటికే సీఐలను నియమించారు. ఇటీవల వారు బాధ్యతలు చేపట్టారు. త్వరలో మరిన్ని పోలీస్ స్టేషన్ల స్థాయి పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే క్రమంలో రాచకొండ కమిషనర్ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ నడుస్తోంది.రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా జోన్‌లో ప్రస్తుతం మూడు డివిజన్లు, నాలుగు సర్కిళ్లు, 18 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. స్టేషన్ల సీఐలను ఎస్‌హెచ్‌వోలుగా నియమించాలని గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రతిపాదనలో భాగంగా మొదటగా రెండు స్టేషన్లను ఎస్‌హెచ్‌వోలును నియమించారు. భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్లకు మాత్రమే ఇన్‌స్పెక్టర్లు ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. మిగతా పోలీసు స్టేషన్లు నాలుగు సర్కిళ్లలో పరిధిలో విస్తరించి ఉన్నాయి. ఆయా స్టేషన్లకు ఎస్సైలు ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో సర్కిల్ పరిధిలో మూడు నుంచి ఐదు పోలీస్ స్టేషన్ల వరకు ఉన్నాయి.భువనగిరి సర్కిల్ పరిధిలో భువనగిరి గ్రామీణం, బీబీనగర్, బొమ్మలరామారం మూడు స్టేషన్లు ఉండేవి. ప్రస్తుతం భువనగిరి గ్రామీణ, బొమ్మలరామారం స్టేషన్లు మాత్రమే భువనగిరి రూరల్ సీఐ పరిధిలోకి తీసుకొచ్చి రెండు ఠాణాలకు కలిపి సీఐని నియమించారు. రామన్నపేట సర్కిల్ పరిధిలో ఆత్మకూరు(ఎం) ఉంది.


# గడపకో.. ఉద్యోగి..!

మిర్యాలగూడ ఫిబ్రవరి 2

ఊరు పుట్టినప్పటి నుంచి ఉన్న ఆ వీధిలో ఒకప్పుడు కూలీలు, తాపీ పని చేసే వారు మాత్రమే ఉండేవారు. పలువురికి వ్యవసాయ భూములున్నప్పటికీ సాగు చేసేందుకు నీటి సదుపాయం లేక కూలీ పని చేసుకుని జీవనం సాగించేవారు. అత్యధికులు తాపీపని నమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటూ పిల్లలను చదివించేవారు. కాలక్రమంలో వ్యవసాయాన్ని వృద్ధి చేసుకున్నారు. తాపీ కూలీలు.. మేస్త్రీలుగా మారారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడం మొదలుపెట్టారు. పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినోభా బావే పేరుతో ఏర్పడిన ప్రస్తుత 36వ వార్డులోని వినోభా నగర్ నేడు విద్యాధికుల కాలనీగా మారింది. 2005 నుంచి ఉన్నత చదువులు చదువుతున్న వారి సంఖ్య పెరగడంతో ఉద్యోగుల సంఖ్య సైతం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 300 కుటుంబాలున్న ఆ కాలనీలో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, మరో వంద మందికి పైగా ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు.అటు ఉద్యోగం.. ఇటు వ్యవసాయంఈ కాలనీకి చెందిన ఇద్దరు పోలీస్ శాఖలో సీఐలుగా, ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు, ఆరుగురు హోంగార్డులుగా పనిచేస్తున్నారు. ఐదుగురు డాక్టర్లు, 30 మంది ఉపాధ్యాయులు, పరిశ్రమల శాఖలో ఒకరు, డీసీటీవోలో ఒకరు, వ్యవసాయ శాఖ ఏడీ ఒకరు, విద్యుత్తు ఏడీఈ ఒకరు, నీటి పారుదల శాఖలో ఇద్దరు ఏఈలు, మరో ముగ్గురు ఉద్యోగులు, నర్సులు ఐదుగురు, పంచాయతీ కార్యదర్శులు ఐదుగురు, వివిధ శాఖల్లో సీనియర్, జూనియర్ సహాయకులు పది మంది, అటెండర్లు 20 మంది ఉన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు 20 మంది పనిచేస్తున్నారు. మరో 80 మంది వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తం 250 మందికి పైగా ఉద్యోగులు ఉండగా.. వీరిలో పలువురు విధుల అనంతరం వ్యవసాయం చేస్తున్నారు. అమ్మానాన్నలు కోడిరెక్క దోర్నీసు, సుక్కమ్మలు. నాన్న తాపీ పని చేస్తూ మమ్మల్ని ఉన్నత చదువులు చదివించారు. ఎంటెక్ పూర్తి చేసి విద్యుత్తు శాఖలో ఏడీఈగా పని చేస్తున్నా. మా పెద్ద చెల్లి రాధ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, చిన్న చెల్లి వినయరాణి హైదరాబాద్‌లో డాక్టర్, తమ్ముడు వినోద్ కెనడాలో దంత వైద్యుడిగా పని చేస్తున్నారు. అమ్మానాన్న చదువు విలువ తెలుసుకుని ఎంతో కష్టపడి మమ్మల్ని చదివించారు. ఇంటికి ఇద్దరు పట్టభద్రులేకోడిరెక్క శైలజ, పంచాయతీ కార్యదర్శి, తక్కెళ్లపాడు, మిర్యాలగూడ మండలంనాన్న కోడిరెక్క మల్లయ్య తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూనే మాకు ఏ లోటు రాకుండా ఉన్నత చదువులు చదివించారు. ఎం.ఫార్మసీ పూర్తి చేసి 2019 నుంచి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. సోదరి వసంత పట్టణంలోనే వైద్యురాలు. సోదరుడు నాగేందర్ డీసీటీవోగా పని చేస్తున్నారు. చదువు విలువ తెలుసుకున్న తలిదండ్రులు మేము ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించారు.

# ఏం చేద్దాం.. ఎలా అధిగమిద్దాం..? మెట్రో రెండోదశలో 2 ఇంటర్‌ఛేంజ్ స్టేషన్లకు సవాళ్లు



హైదరాబాద్: ఫిబ్రవరి 2

: మెట్రో రైలు రెండో దశలో చాంద్రాయణగుట్టలో ఒకటి, ఎల్బీనగర్‌లో మరోటి ఇంటర్‌ఛేంజ్ స్టేషన్లు రాబోతున్నాయి. ఈ రెండుచోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు ఉండటం పెద్ద సవాలుగా మారుతోంది. మెట్రోరైలు తొలిదశలో అమీర్‌పేట అతిపెద్ద జంక్షన్‌గా ఉంది. ఈ స్టేషన్ నిత్యం ప్రయాణికుల రాకపోకలతో కిటకిటలాడుతోంది. కారిడార్-1, 3 ఇక్కడ కలుస్తుంటాయి. ఎంజీబీఎస్‌లో మరో జంక్షన్ ఉంది. ఇక్కడ దిగి కారిడార్-1, 2లోకి మారిపోవచ్చు. పరేడ్ గ్రౌండ్ వద్ద మరో జంక్షన్ ఉంది. ఇక్కడ వేర్వేరు మార్గాలు రెండు వేర్వేరు స్టేషన్లు ఉన్నాయి. మొత్తం మూడు కారిడార్లలో మూడు ఇంటర్‌ఛేంజ్ స్టేషన్లు నిర్మించారు. ఇదే విధంగా ప్రతిపాదిత రెండోదశలో రెండు ఉండబోతున్నాయి. ఎల్బీనగర్‌లో... నాగోల్ నుంచి విమానాశ్రయం వెళ్లే మార్గం, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ కారిడార్‌కు సంబంధించి ఎల్బీనగర్‌లో ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ ఉంటుంది. ఇప్పటికే ఎల్బీనగర్‌లో స్టేషన్ ఉన్నందుకు విమానాశ్రయ మార్గంలో మరో స్టేషన్‌ను నిర్మించి రెండింటికి అనుసంధానం చేసే అవకాశం ఉంది. ఇందుకోసం ఎస్కలేటర్ మాదిరి వాకలేటర్ వంటి సదుపాయాలు కల్పిస్తారు. ఇక్కడ కూడలిలో ఫ్లైఓవర్, అండర్‌పాస్‌లు ఉండటంతో అధికారులు ఏం చేయాలనే దానిపై ఆలోచిస్తున్నారు. గుట్టలో భారీగా.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు, నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వెళ్లే మార్గం చాంద్రాయణగుట్ట వద్ద కలుసుకోనున్నాయి. ఇక్కడే అమీర్‌పేట మాదిరి భారీ ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ నిర్మిస్తారు. ఇక్కడ సైతం కూడలిలో ఫ్లైఓవర్ ఉంది. మెట్రో అలైన్‌మెంట్‌కు ఇది సవాల్‌గా ఉంది. తొలిదశ మెట్రో మార్గంలో పరేడ్‌గ్రౌండ్ వద్ద ఈ తరహా సవాళ్లు ఎదురయ్యాయి. అందుకోసం అక్కడ వేర్వేరు స్టేషన్లు నిర్మించి మెట్రో మార్గాలను అనుసంధానం చేశారు. రెండోదశలో ఎలా చేస్తారనేది ముున్ముందు స్పష్టత రానుంది.

# సౌకర్యాల కల్పన.. రైతన్నకు సాంత్వన



వికారాబాద్ , ఫిబ్రవరి 2

,ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నాహక చర్యలు చేపట్టింది. మిగతా జిల్లాల కంటే వికారాబాద్ జిల్లాలో వరి పంట 20 రోజుల ఆలస్యంగా చేతికొస్తుంది. ప్రభుత్వ ఆదేశాలతో అన్నదాతలు దళారులను ఆశ్రయించకుండా ఈనెల 3వ వారంలో కేంద్రాల ఏర్పాటుకు జిల్లా పౌర సరఫరాల శాఖ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కేంద్ర మద్దతు ధరను చెల్లించేలా చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే మద్దతు ధరల గోడ పత్రికలను జిల్లా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేశారు. ధాన్యం ముందుగా వచ్చే మండలాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆయా కేంద్రాల వద్ద రైతులకు ఎదురైన సమస్యలు, కేంద్రాల్లో ఏర్పాటుచేయాల్సిన సౌకర్యాలపై కథనం.దెబ్బతీసిన వర్షాలు జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈసారి ఖరీఫ్‌కు సంబంధించి వర్షాలు సకాలంలో కురవలేదు. రైతులు బోర్లు, బావుల కింద పండించేందుకు యత్నించారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన అకాల భారీ వర్షాలతో పలుచోట్ల తెగుళ్లు సోకాయి. ఫలితంగా గతంలో కంటే దిగుబడి తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 107 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 100 శాతం మేర ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం విక్రయానికి రాకుండా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించాం. లింగ్యానాయక్, అదనపు కలెక్టర్.ఇలా చేయాలికొనుగోలు కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం కల్పించాలి.తూకాల్లో మోసాలను అరికట్టాలి.నిర్దేశించిన దానికంటే ఎక్కువ మొత్తంలో తూకం వేయకూడదు. కేంద్రం వద్ద ధాన్యం బస్తాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలి.అవసరమైతే రక్షణ కోసం టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.గన్నీ బస్తాల కొరత ప్రతిసారీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. డిమాండ్‌కు సరిపడా పంపిణీ చేయాలి.ధాన్యం విక్రయించిన అనంతరం కనీసం 48గంటల్లో ఖాతాల్లో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.విక్రయాల్లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కేంద్రాల వద్ద ఏఈఓలు అందుబాటులో ఉండాలి.మద్దుతు ధరలు... (రూ.క్వింటాలుకు) ఎ గ్రేడ్ రకం.. 2320సాధారణ రకం.. 2300నన్నరకానికి బోనస్ రూ.500 ఖరీఫ్ సాగు.. (ఎకరాలు)సాధారణ.. 99,000సాగైంది.. 85,000దిగుబడి అంచనా.. లక్ష మెట్రిక్ టన్నులు .

# మురుగుకు మంగళం.. చెరువులకు అందలం

హైదరాబాద్: ఫిబ్రవరి 2

నగరంలోని చెరువులకు మహర్దశ పట్టనుంది. సహజ పద్ధతుల్లోనే మురుగుతో నిండిన చెరువులను మంచినీటి జలవనరులుగా తీర్చిదిద్దేందుకు హైడ్రా త్వరలో పనులు ప్రారంభించనుంది. బెంగళూరులో కలుషిత నీటితో కాలుష్య కాసారంలా మారిన తటాకాలు, ఆక్రమణలతో కనుమరుగైన చెరువులకు అక్కడి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కొన్నేళ్లుగా ప్రాణం పోస్తున్నాయి. ఇంజినీర్ ఉద్యోగాన్ని వదిలేసి చెరువులను కాపాడటమే లక్ష్యంగా 2017 నుంచి ఆనంద్ మల్లిగవాడ్ ఒక్కరే 35 తటాకాలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. అలాంటి పరిస్థితిని నగరంలో సాకారం చేసేందుకు హైడ్రా చర్యలు చేపట్టనుంది.సహజ పద్ధతిలో మురుగుశుద్ధిచెరువుల వద్ద కోట్ల రూపాయలు ఖర్చు చేసి మురుగు శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం, చుట్టూ కాలిబాటల అభివృద్ధికి రూ.కోట్లలో వెచ్చిస్తున్నారు. దుర్గం చెరువు అభివృద్ధికి ఓ కార్పొరేట్ సంస్థతో రూ.60కోట్లకుపైగా జీహెచ్ఎంసీ ఖర్చు చేయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో.. బెంగళూరులో నామమాత్రపు ఖర్చుతో జలవనరులు మెరుగుపడుతుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది.దశలవారీగా వడపోత..చెరువులకు వరద నీటితోపాటు, మురుగునీటి నాలాలు ఉంటాయి. విస్తీర్ణం ఆధారంగా ఆయా చెరువులను ఆనంద్ పూర్తిగా తవ్వేవారు. పూడిక తొలగించి, క్రమపద్ధతిలో చెరువు అడుగు



భాగాన్ని చదును చేసి, చుట్టూ కట్ట నిర్మించడం మొదటి దశ.కట్ట నిర్మాణం పూర్తయ్యాక చెరువు మధ్యలో మరో కట్ట కడతారు. ఓ వైపున వరదనీరు, మరోవైపు మురుగునీరు నిల్వ ఉండేలా ఏర్పాటు చేస్తారు. చెరువులోకి మురుగు వ్యర్థాలను తీసుకొచ్చే అన్ని పైపులైన్లను ఓ ప్రాంతంలో అనుసంధానిస్తారు. ఆ ప్రాంతం తటాకం కంటే ఎత్తులో ఉంటుంది. ఆ క్రమంలో మరో మూడు వడపోత కుంటలను నిర్మిస్తారు. మొదటి కుంటలో చెట్లు, రెండో కుంటలో పెద్ద రాళ్లు, మూడో కుంటలో కంకర, ఇసుక మిశ్రమాన్ని భారీగా ఉంచుతారు. దీంతో మురుగునీరు చెట్ల మధ్య నుంచి ప్రవహిస్తూ.. రాళ్లు, కంకర, ఇసుక, వేర్వేరు మొక్కలను దాటుకుంటూ పరిశుభ్రంగా మారుతుంది. అదే పద్ధతిలో మొదటి దశ కింద మాదాపూర్ సున్నం చెరువు, గగన్‌పహాడ్ అప్పా చెరువు, ప్రగతినగర్ ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్లచెరువులను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# పల్లెకు మార్గం.. సుగమం

తాండూరు ,ఫిబ్రవరి 2

గ్రామీణ ప్రజల ప్రయాణానికి మార్గం సుగమం కానుంది. అనుబంధ రహదారుల నిర్మాణ కల సాకారం కానుంది. వెరసి తక్కువ దూరం ప్రయాణించి పల్లెలకు చేరుకునే వెసులుబాటు లభించనుంది. సమయం ఆదా కానుంది. ఇతర గ్రామాల మీదుగా రావాల్సిన పరిస్థితి: జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలు, 4 మున్సిపాలిటీలు ఉండగా, 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపుగా అన్ని గ్రామాలకు అనుబంధ దారులు అధ్వానంగా ఉన్నాయి. ఉదాహరణకు.. కొడంగల్, బషీరాబాద్, పెద్దేముల్, వికారాబాద్ మండలాల్లో మారుమూల తండాలు ఎక్కువగా ఉన్నప్పటికీ మట్టిదారులే దిక్కు. వర్షాకాలం వచ్చిందంటే వీటిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.మోమిన్‌పేట మండల పరిధిలో అనుబంధ తండాలకు మట్టిదారుల్లో వెళ్లలేక ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు.తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి అనుబంధంగా మరో 13 గ్రామాలు కొనసాగుతున్నాయి. ఇవి ఒకదానికికొకటి పక్కపక్కనే ఉన్నప్పటికి రహదారి సదుపాయంలేక ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. దీంతో వాహనదారులపై రవాణా భారం



పడుతుండగా సమయం వృథా అవుతోంది. మండలంలోని నారాయణ్‌పూర్-పాతతాండూరు దూరం 5.10కి.మీ. ఉండగా రహదారి నిర్మించని కారణంగా యాలాల మండలం మీదుగా 16 కి.మీ. ప్రయాణించి గ్రామానికి చేరుకుంటున్నారు. తాజాగా ఆయా రహదారుల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు రూ.16.30కోట్లు నిధులతో 22.15కి.మీ మేర తారు రహదారులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టెండరు ప్రక్రియ నిర్వహిస్తున్నాం: గ్రామాలకు కొత్తగా అనుబంధ రహదారులు నిర్మించేందుకు టెండర్లు పిలిచాం. మట్టిదారులు, పానాది మార్గాల్లో తొలిసారిగా తారు రహదారులు నిర్మింపజేస్తాం. త్వరలోనే పల్లెలకు కొత్త తారు రహదారులు అందుబాట్లోకి వస్తాయి.

# అవయవ మార్పిడికి మత్తు వైద్యులేరి?

ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్: అక్టోబర్ 17,ఉస్మానియా ఆసుపత్రిలో అవయవమార్పిడి సమయంలో సీనియర్ మత్తు మందు వైద్యులు (అనస్థీషియా) లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అవయవాలమార్పిడి జరిగే సందర్భంలో గతంలో జిల్లాలకు బదిలీపై వెళ్లిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లను వెనక్కి రప్పించి సర్జరీల సమయంలో వారి సేవలను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా అవయవ మార్పిడి సందర్భంలో 20 గంటలపైగా రోగులను అనస్థీషియాతో కొనసాగించాలి. దీనికి సీనియర్ వైద్యుల సేవలు చాలా ముఖ్యం. గతంలో ఉస్మానియాలో 13 మంది అనస్థీషియా ప్రొఫెసర్లు ఉండగా...8 మంది బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఎవరూ రాలేదు. ప్రస్తుతం ఐదుగురు ప్రొఫెసర్లే ఉన్నారు. వీరంతా ఉస్మానియాతోపాటు వేర్వేరు ఆసుపత్రిల్లో సేవలు అందిస్తున్నారు. మరో 14 మంది అసోసియేట్ ప్రొఫెసర్లలో 13 మంది బదిలీపై వెళ్లగా..ఒక్కరే మిగిలారు. ప్రస్తుతం 15 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లతో నెట్టుకొస్తున్నారు. సేవలపై ప్రభావం...అనస్థీషియా విభాగానికి సంబంధించి సీనియర్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు లేకపోవడంతో అవయవమార్పిడి సేవలపై ప్రభావం పడుతోంది. ఇటీవల ఓ వైద్యునికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేశారు. భువనగిరి ఇతర జిల్లా ఆసుపత్రులకు బదిలీ అయిన సీనియర్ ప్రొఫెసర్లను రప్పించి అవయమార్పిడి పూర్తి చేశారు. ఇలాంటి క్లిష్టమైన సర్జరీ తర్వాత బ్లీడింగ్ లేదా ఇతర సమస్యలు



తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమయంలో మరోసారి సర్జరీ అవసరం కావచ్చు. వెనక్కి వెళ్లిన వైద్యులను అప్పటికప్పుడు వెనక్కి రప్పించడం కుదరదు. దీంతో జూనియర్ వైద్యులతో నెట్టుకొస్తున్నారు. సర్జరీ సమయంలో నర్సుల పాత్ర చాలా కీలకం. రోగి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రధాన వైద్యుల దృష్టికి తీసుకెళుతుంటారు. గత బదిలీల్లో ఉస్మానియా నుంచి 120 మంది సీనియర్ నర్సులను బదిలీ చేశారు. అవయవ మార్పిడి సమయంలో కీలక సేవలందించే 20 మంది నర్సులను బదిలీ చేయడంతో తిరిగి ఉస్మానియాకు రప్పించి వారి సేవలు వినియోగించుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ పరిస్థితిని చక్కదిద్దాలని రోగులు కోరుతున్నారు.

# ఇసుక దందా.. వారికి మామూలే!

మహబూబాబాద్,,ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.. నియంత్రించాల్సిన పోలీసులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు ఆకేరు, పాలేరు, మోరంచ, యశ్వంతాపూర్, పోచన్నపేట, చలివాగుల పరివాహక ప్రాంతాల్లోంచి, ఏజెన్సీల్లోని వంకల నుంచి వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. రాష్ట్రంలోని మల్టీజోన్-2లో ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో విఫలమయ్యారంటూ కొంతమంది పోలీసులపై ఉన్నతాధికారులు వేటువేసినట్లు ఇక్కడి పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.ఉమ్మడి జిల్లాలో ప్రతి రోజు 800 ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.. ముఖ్యంగా ఆకేరు వాగులో అత్యధికంగా తవ్వకాలు జరుపుతున్నారు. వర్ధన్నపేట, ఐనవోలు మండలాల్లో ప్రవహించే వాగు, పరివాహక ప్రాంతంలో జేసీబీ యంత్రాలతోనే తవ్వకాలు చేస్తున్నారు. తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలోని నర్సింహులపేట, నెల్లికుదురు, చిన్నగూడూరు మండలాల్లో పారుతున్న వాగు వరదల్లోంచే ఇసుకను కూలీల ద్వారా తోడుతూ రవాణా చేస్తున్నారు. ఆకేరు వాగులోంచి దాదాపు 600ల ఇసుక ట్రాక్టర్లు పట్టణాలకు తరలుతున్నాయి. మిగిలిన 200 ట్రాక్టర్లు జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని వాగుల్లోని ఇసుక రవాణా చేస్తున్నాయి.మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు వద్ద ఆకేరు ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు (పాతచిత్రం) నెలనెలా సమర్పించాల్సిందే..వరంగల్ కమిషనరేట్ పరిధిలోని వర్ధన్నపేట ఏసీపీ పరిధిలో రెండు పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా కల్పతరువుగా మారింది. ఒక స్టేషన్ పరిధిలో మూడేళ్ల కిందట దాదాపు 250 వరకు ట్రాక్టర్లు నడిచేవి.. ఒక్కో ట్రాక్టరు నుంచి నెలకు రూ.500 చొప్పున రూ.1.25 లక్షలు తీసుకునేవారు. ఇప్పుడు ఈ స్టేషన్ పరిధిలో ఒక గ్రామం నుంచి రవాణా చేస్తున్నారు. రెండు వారాల కిందట పది ట్రాక్టర్లను పట్టుకున్న ఎస్సై విలేకరులకు రెండు పట్టుకున్నట్లు వివరాలు వెల్లడించారు. తాజాగా కొద్ది రోజుల కిందట ఐదు వాహనాలను పట్టుకున్నారు. కానీ, ఆ వివరాలు వెల్లడించేందుకు వెనుకాడుతున్నారు. దీని వెనుక 'మతలబు' ఏమిటో మరి..? వర్ధన్నపేట ఏసీపీ పరిధిలో జాతీయ రహదారి అనుకుని ఉన్న స్టేషన్‌లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్సైలు, సీఐలు ఇసుకాసురులకు అండగా నిలిచారు. ఇటీవల మరో ప్రాంతానికి వెళ్లిన ఎస్‌హెచ్‌వో వసూళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఆ మండలంలోని రెండు ప్రాంతాల్లో ఏడు జేసీబీ యంత్రాల తవ్వకాలు జరుగుతుండగా నియంత్రించడం లేదు. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు సబ్‌డివిజన్ పరిధిలో ఒక స్టేషన్‌లో ఎనిమిదేళ్ల కిందట పనిచేసిన ఒక ఎస్సై 20 ట్రాక్టర్ల నుంచి అమ్యామ్యాలు తీసుకుంటూ



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.. నియంత్రించాల్సిన పోలీసులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు ఆకేరు, పాలేరు, మోరంచ, యశ్వంతాపూర్, పోచన్నపేట,

రేయింబవళ్లు ఇసుక రవాణా జరిగేలా వత్తాసు పలికారు. ఆయన బదిలీపై వెళ్లాక ట్రాక్టర్ల సంఖ్య 50కి చేరింది. ఆ స్టేషన్‌కు ఎస్సైగా ఎవరు వచ్చినా అదే పంథా కొనసాగిస్తున్నారు.టేకుమట్ల మండలం కలికోట, చిట్యాల మండల కాల్వపల్లి, మల్హర్ మండలం మల్లారం, కాటారం మండలం విలాసాగర్ ప్రాంతాల నుంచి దందా సాగుతోంది. చిట్యాల మండలం నవాబు శివారు చలివాగు, మొగుళ్లపల్లి మండలం పెద్దవాగు నుంచి తవ్వుతున్నారు. భూపాలపల్లి మండలంలోని బొగ్గులవాగు, చెలిమెల వాగులు అటవీ ప్రాంతాల్లో ఉండటంతో సాయంత్రం 6 దాటితే కూలీలతో ట్రాక్టర్లలో ఇసుక నింపి పట్టణానికి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.మహదేవపూర్, పలిమెల మండలాల్లోని ఇసుక రీచుల నుంచి అదనపు లోడ్లతో లారీలు వెళ్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదనపు బకెట్‌కు నిర్వాహకులు రూ.2 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అదనపు లోడింగ్‌తో రహదారులు ధ్వంసమవుతున్నట్లు ఇటీవల మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో స్థానికులు నిరసన తెలిపారు. ఇసుక రీచులు, లారీలను పోలీసులు తనిఖీలు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి.వర్ధన్నపేట, మామునూరు ఏసీపీ పరిధిలోని ఐదు స్టేషన్ల అధికారులు దాదాపు 500 ట్రాక్టర్ల యజమానుల నుంచి మామూళ్లు పుచ్చుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మామూళ్లు తీసుకుంటే ఉపేక్షించేది లేదు..-అంబర్ కిషోర్ ఝా, సీపీ పోలీసు అధికారులు నెలవారీ మామూళ్లు తీసుకోవద్దని ప్రతి ఠాణా అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాతో సంబంధం ఉన్న అధికారులు డబ్బులు తీసుకుంటే ఉపేక్షించేది లేదు. ఇప్పటికే కొంతమందిని బదిలీ చేశాం.. రానున్న రోజుల్లో మరిన్ని చర్యలు తీసుకుంటాం.

# గృహ లబ్ధికి ఇందిరమ్మ కమిటీలు

వికారాబాద్ , ,నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు సర్కారు చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజక వర్గానికి 3500 ఇళ్ల కేటాయించనున్నారు. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. దీనికోసం ప్రత్యేకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలోని సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందిరమ్మ కమిటీల నియమాకానికి గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తారు. వీరికి స్థానం కల్పిస్తారు: జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. తొలి విడతలో భాగంగా జిల్లాకు 14 వేల ఇళ్లు మంజూరు చేస్తారు. పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో వార్డు కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపడుతున్నారు. పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఒకరు చొప్పున పంచాయతీ కార్యదర్శి గ్రామ కమిటీలో భాగస్వామ్యం అవుతారు. పురపాలిక సంఘాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం వీరికి ఉంటుంది. అన్నీ పారదర్శకంగా సాగుతాయి: రాకేశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వికారాబాద్ఇళ్లకు సంబంధించిన పనులన్నీ పారదర్శకంగా సాగుతాయి. వికారాబాద్ పురపాలిక సంఘంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక చేస్తున్నాం. వార్డుకు 7 మంది సభ్యులతో కమిటీ నియమిస్తాం. వార్డులన్నింటిలో కమిటీలను ఏర్పాటు చేస్తాం. జిల్లాలో గ్రామ పంచాయతీలు: 566ఒక్కో గ్రామ కమిటీలో సభ్యులు.. 7 మొత్తం సభ్యులు .. 3,962 4 పురపాలికల వార్డు కమిటీల్లో సభ్యులు : 679 గ్రామాల్లో 566 పట్టణాల్లో 97 ఇవీ నిబంధనలుపేద మధ్య తరగతి వారై ఉండాలి.

# కన్నీటి మేట..కలిగేనా ఊరట?



కూసుమంచి, ఫిబ్రవరి 2

కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం గ్రామీణం, తిరుమలాయపాలెం మండలాల్లో పాలేరు, మున్నేరు, ఆకేరు ఏటి పరీవాహక ప్రాంతాల్లో గత నెలారంభంలో ఉప్పొంగాయి. వరదలతో సుమారు 5 వేల ఎకరాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయి. నాట్లు వేసిన కొన్నాళ్లకే పెద్ద ఎత్తున పొలాలు ముంపునకు గురయ్యాయి. వాటిల్లో ఇసుక, రాళ్లు, చెట్లు గుట్టలుగా మేటలు వేసిన దృశ్యాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల ఐదడుగుల మేర మేటలు పేరుకుపోయాయి. బాధిత రైతులకు పరిహారం నేటికీ దక్కకపోగా, ఖరీఫ్-రబీ రెండు పంటలూ నష్టపోయే పరిస్థితి. మేటలు తొలగించేదెన్నడు? మళ్లీ పొలాలను పూర్వ స్థితికి తెచ్చేదెన్నడు? అని అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. ఇటీవల వరదల కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దసరా లోపే ఈ మొత్తాన్ని అందిస్తామని ప్రకటించినా అలా జరగలేదు. మరోవైపు.. ఇసుక, రాళ్ల మేటలు వేసిన పొలాలకు మెరుగైన పరిహారం అందేలా చూస్తామని పరామర్శల సందర్భంగా జిల్లా మంత్రులు రైతులకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత దీనిపై ఎలాంటి స్పష్టత, ప్రత్యేక ప్రకటన వెలువడలేదు. దీంతో రూ.10 వేలకు మించి పంట నష్టం సాయం దక్కకపోవచ్చని రైతులు దిగాలు చెందుతున్నారు.హట్యాతండాలో.. ఓ వైపు పొట్ట దశలో పొలాలు.. మరోవైపు ముంపున మేటలు..రెండు విధాలా తీరని నష్టంఏటి ఒడ్డు పొలాల్లో నాలుగైదు అడుగుల మేర వేసిన మేటను తొలగించడం అంత సులువైన పనేంకాదు. ఇసుక, రాళ్లు, కూలిన చెట్లను యంత్రాల సాయంతో అడుగు వరకు తొలగించాలి. ట్రాక్టర్లతో బయటకు తరలించాలి. ఆ స్థానంలో నాణ్యమైన మట్టిని తెచ్చి చదును చేయాలి. గట్లు పటిష్ఠపరచాలి. ఇదంతా వచ్చే రబీ సీజన్ తర్వాత, ఎండాకాలంలో సాధ్యమయ్యేలా ఉంది. ప్రస్తుతం పై పొలాల్లోంచి నీటి ఊటలు రావడం, మట్టి కొరత ఉండటంతో వేసవి కోతల తర్వాతే ఓ రూపు రేఖకు తేవడం సాధ్యమని రైతులు యోచిస్తున్నారు. దీనివల్ల వానాకాలం, యాసంగి రెండు పంటలూ కోల్పోవాల్సి వస్తోంది. ఒక ఎకరాకు రెండు పంటలు కలిపి రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు పంట నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు మేటల తొలగింపునకు ఎకరాకు కనీసం రూ.25,000-రూ.50,000 వరకు భారం మోయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవ చూపి న్యాయమైన పరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నారు.సాంకేతిక లోపంతో నష్టపరిహారం బాధిత రైతుల ఖాతాలకు జమ కాలేదని, సమస్యను పరిష్కరిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు 'న్యూస్టుడే'తో పేర్కొన్నారు.

# రెండు పడకల ఇళ్లలో కదలిక



నిజామాబాద్: ఫిబ్రవరి 2

,గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన రెండు పడకగదుల ఇళ్లు పంపిణీ చేసేందుకు కసరత్తు మొదలైంది. అర్హులైన పేదలను ఎంపిక చేసి.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆమోదం మేరకు వీటిని అందజేయాలని ప్రస్తుత సర్కారు నిర్ణయించింది. ఇటీవల ఆయన కలెక్టరేట్‌లో జరిపిన సమీక్షలోనూ ఈ విషయంలో సూచనలు చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లా అధికారులు ఇళ్ల నిర్మాణ బాధ్యతలు చూసిన పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. పూర్తయిన చోట.. మౌలిక సదుపాయాలు కల్పించి పంపిణీ చేయటంతోపాటు స్లాబు దశలో ఆగిపోయిన చోట మిగిలిన పనులు చేయించేలా గుత్తేదారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రస్తుతం నిర్మాణాలు ఉన్న దశ ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.15,300 ఇళ్లు మంజూరు..ప్రభుత్వం నుంచి గత తొమ్మిదేళ్లలో పలు విడతల్లో జిల్లాకు 15,300 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిల్లో 13 వేల ఇళ్లకు టెండర్లు పూర్తయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కొందరు గుత్తేదార్లు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. యూనిట్ వ్యయం రూ.5 లక్షలు గిట్టుబాటు కాదంటూ నిరాసక్తి చూపారు. ఒప్పందాలు చేసుకున్న వారిలో కొందరిని ఒప్పించి పనులు చేపట్టడంతో 3700 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిల్లో పలు మండలాల్లో 2100 వరకు పంపిణీ చేశారు. మిగిలిన 1600 ఇళ్లను ఇదివరకు వచ్చిన దరఖాస్తుల్లో నిబంధనలకు లోబడి అర్హులను ఎంపిక చేసి అందించనున్నారు. ఇవి కాకుండా బోధన్ రెవెన్యూ డివిజన్‌లో సొంత స్థలాలు ఉన్నవారికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయగా.. ఇలా మరో 4 వేలు పూర్తికాగా.. లబ్ధిదారులు గృహాల్లోకి చేరిపోయారు. వీరితో పాటు ఇందల్‌వాయి మండలంలో ఇప్పటికే ఇళ్లలో చేరిన వారికి ప్రభుత్వ పట్టాలు జారీ కాలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనుమతి తీసుకొని వీటికి పట్టాలు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.వివిధ దశల్లో 3,400..జిల్లాలో వివిధ దశల్లో ఆగిపోయిన సుమారు 3400 ఇళ్లను కూడా రెండు, మూడు నెలల్లో పూర్తి చేయించాలని ఇటీవల జరిగిన సమీక్షలో జిల్లా అధికారులను ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించిన కలెక్టర్, గుత్తేదారులతో సంప్రదింపులు జరిపి ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన యూనిట్ ధర పరిధిలోనే వ్యయాలు ఉండేలా వాటిని పూర్తి చేయించాలని చెప్పారు. గుత్తేదారులు ముందుకు రాక, భూమి విషయంలో సమస్యలతో మరో 3 వేల వరకు నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ప్రస్తుతం వీటిని చేపట్టే ఆలోచన లేదంటున్నారు.మరమ్మతులకు నిధులు..కొన్నిచోట్ల మూడేళ్ల కిందటే నిర్మాణాలు పూర్తయినా పంపిణీలో జాప్యంతో ఆకతాయిలకు అడ్డాలుగా మారాయి. కిటికీలు, అద్దాలు ధ్వంసమై.. నల్లాలు ఎత్తుకెళ్లిన పరిస్థితి. ఆయా చోట్ల మరమ్మతులు చేపట్టి.. పంపిణీకి సిద్ధం చేయడానికి రూ.2 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులిచ్చారు. తాగునీరు, మురుగు వ్యవస్థ, రహదారి సౌకర్యం వంటివి ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

# అరచేతిలో పత్తి కొనుగోళ్ల సమాచారం

ఖమ్మం , ఫిబ్రవరి 2

,ఈ సీజన్‌లో పత్తి పంట కోతకొస్తోంది. రైతులు తెల్ల బంగారాన్ని విక్రయించాలంటే గతంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) కేంద్రాల వద్ద రోజుల తరబడి నిరీక్షించేవారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. రైతు ఎప్పుడు సరకు తీసుకెళ్లాలనే సమాచారం నుంచి నగదు జమ వరకు సకల వివరాలు తెలుసుకోవచ్చు.ఉమ్మడి జిల్లాలో పత్తి ప్రధాన పంటగా సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఈ నేపథ్యంలో కొనుగోళ్ల పరంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సీసీఐ అధికారులు వన్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో 'వాట్సాప్ టాప్ యాప్' రూపొందించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు దీన్ని అనుసంధానించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సీసీఐ కేంద్రాల కొనుగోళ్ల తాజా వివరాలను యాప్‌లో అందుబాటులో ఉంచుతారు.ఖమ్మం జిల్లాలోని సీసీఐ కేంద్రాలుజీఆర్ఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, వెంకటగిరి, ఖమ్మం గ్రామీణం శ్రీసాయి బాలాజీ జిన్నింగ్ అండ్ ఆయిల్ మిల్, తల్లంపాడుమంజీరా కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, మాటూరు (మధిర)అమరావతి టెక్స్‌టైల్స్ ప్రైవేటు లిమిటెడ్, దెందుకూర శ్రీశివగణేశ్ కాటన్ ఇండస్ట్రీస్, ఇల్లెందులపాడఉష్రశ్రీ కాటన్, జిన్నింగ్ మిల్స్, సువర్ణాపురం (నేలకొండపల్లి)స్టాపిల్‌రిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, తల్లాడ (వైరా డివిజన్)జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్స్, పొన్నెకల్లు, ఖమ్మం గ్రామీణం శ్రీభాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్, గోలితండ, తిరుమలాయపాలెం మండలం.ఏమిటీ ప్రయోజనం?వానాకాలం సీజన్‌లో పత్తి రైతులు, దిగుబడి అంచనా వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు నమోదు చేశారు. ఆ సమాచారాన్ని సీసీఐ కేంద్రాలకు అందజేశారు. వ్యవసాయ శాఖ వద్ద వివరాలు నమోదు చేసుకున్న రైతులకే యాప్ అందుబాటులో ఉంటుంది. రైతులు తమ వద్ద ఎంత పత్తి దిగుబడి



ఉంది? అనే వివరాలను తొలుత యాప్‌లో నమోదు చేయాలి. అప్పుడు స్థానికి సీసీఐ/జిన్నింగు మిల్లు పరిధిలో కొనుగోలుకు ఎంత సమయం పడుతుందో సమాచారం అందుతుంది. సీరియల్‌లో ఉన్న వాహనాల సంఖ్య, లోడింగ్, అన్‌లోడింగ్ వివరాలు ప్రత్యక్షం అవుతాయి.సరకు విక్రయించిన తర్వాత తక్‌పట్టీ వివరాలు, ధరల వివరాలు, నగదు ఎన్ని రోజుల్లో జమ అవుతుందో స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు 'యాప్'లో వివరాలు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంటాయి.ఒకసారి పంట విక్రయించిన రైతులు.. తదుపరి చేతికందే పత్తి అంచనాను సైతం యాప్‌లో పొందుపరచవచ్చు తద్వారా అధికారులకు కొనుగోళ్లపై ఓ అంచనా ఉంటుంది.పత్తి కొనుగోళ్ల తాజా సమాచారం యాప్ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తుంది. జిన్నింగ్ మిల్లులో ఎన్ని వాహనాలు ఉన్నాయి? తమ సీరియల్ ఎప్పుడ వస్తుందో కూడా ఫోన్ ద్వారా తెలుసుకునే సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. రైతు తన సరకును ఇంటి దగ్గర్నుంచి తెచ్చుకుని వెంటనే అమ్ముకునే సౌలభ్యం కలుగుతుంది. నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి కనీస మద్దతు ధర పొందాలి.

# గుట్కా దందా ఏ బిచ్కుంద

కామారెడ్డి, బిచ్కుంద: నిషేధిత గుట్కా వ్యాపారం బిచ్కుందలో 'మూడు పువ్వులు ఆరు కాయలు' అనే చందంగా సాగుతోంది. కామారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతం కావడం, సమీపంలోనే కర్ణాటక రాష్ట్రం ఉండడంతో అక్రమార్కులు అవకాశంగా మలుచుకుంటున్నారు. బిచ్కుంద ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు, చోటా నేతలు ముఠాగా ఏర్పడి అక్రమ రవాణా సాగిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. నియంత్రించాల్సిన ఆహార కల్తీ నియంత్రణ శాఖ, పోలీసులు 'మామూలు'గా తీసుకుంటున్నారు.ఇతర ప్రాంతాలకూ తరలిస్తూ..కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి వ్యాపారులు బిచ్కుందకు రాత్రి, పగలు తేడా లేకుండా గుట్కా రవాణా చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో నిషేధం లేకపోవడం ఇక్కడి వ్యాపారులకు కలిసివస్తోంది. తెలంగాణలో గుట్కాకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. బీదర్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లావాసులే గుట్కా తయారీ పరిశ్రమలను విరివిగా స్థాపించారు. బీదర్ నుంచి బిచ్కుంద, పిట్లం మీదుగా సంగారెడ్డి, హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకూ తరలిస్తున్నారు. వారం రోజుల కిందట బీదర్ నుంచి బిచ్కుందకు మినీ వ్యాన్‌లో తరలిస్తున్న గుట్కాను పోలీసులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. ముఠాగా ఏర్పడిన వ్యాపారులు, చోటా నేతలు బిచ్కుంద పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లోని గోదాంలలో గుట్కాను నిల్వ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ముందుగానే సమాచారం చేరవేసి..గుట్కా రవాణా దందా పోలీసులతో పాటు స్థానికులకు తెలిసిన బహిరంగ రహస్యమే. జీవనోపాధి నిమిత్తం స్థానికంగా గుట్కా విక్రయించుకునే వ్యాపారులపై పోలీసులు కేసులు



నమోదు చేస్తూ మమ అనిపిస్తున్నారు. లారీల కొద్దీ రవాణా చేసే వ్యాపారుల జోలికి వెళ్లకుండా దాడుల సమాచారాన్ని ముందుగానే చేరవేస్తున్నారు. వ్యాపారులకు పోలీసుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి.బిచ్కుంద పోలీసులు పట్టుకున్న బీదర్ నుంచి రవాణా చేస్తున్న గుట్కా వాహనంనిండు జీవితాలు బలివిచ్చులవిడిగా లభిస్తున్న గుట్కా, పాన్‌మసాలా ఉత్పత్తుల వినియోగంతో బిచ్కుంద పట్టణానికి చెందిన పలువురు యువకులు క్యాన్సర్ బారినపడ్డారు. గడిచిన రెండు నెలల కాలంలో పలువురు నోటిక్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు.కేసులు నమోదు చేస్తున్నాం- సింధుశర్మ, ఎస్పీ, కామారెడ్డి నిషేధిత గుట్కా విక్రయించిన వారిపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. స్థానిక పోలీసులకు సైతం పకడ్బందీగా నియంత్రించాలని ఆదేశాలు జారీ చేస్తాను. నిషేధిత వస్తువులను రవాణా చేసినా, విక్రయించినా, నిల్వ చేసినా చట్టరీత్యా నేరం.

# పొడిబారిన లక్ష్యం



కొత్తగూడెం , ఫిబ్రవరి 2

,పాతకొత్తగూడెం, బూడిదగడ్డ ఏరియాల్లో నాలుగేళ్ల క్రితం ఘన వ్యర్థాల సేకరణ కేంద్రాలను (డీఆర్‌సీసీ) అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కోదాని ఏర్పాటుకు రూ.36 లక్షల వరకు ఖర్చు చేశారు. వీటిల్లో పొడి (ఘన వ్యర్థాలు) చెత్తను వేరుచేసి విక్రయించడం, తడి వ్యర్థాలను వర్మి కంపోస్టుగా తయారు చేసి విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 16.10 చదరపు కిలో మీటర్లు విస్తరించి ఉన్న ప్రథమశ్రేణి 'గూడెం' పురపాలకంలో 36 వార్డులున్నాయి. ప్రతి వార్డు నుంచి 'స్వచ్ఛ ఆటో'లో ఇంటింటికి చెత్త సేకరిస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. డంపింగ్ యార్డులతో పాటు డీఆర్‌సీసీ కేంద్రాలకు సుమారు 18 నుంచి 24 మెట్రిక్ టన్నుల పొడి చెత్త, 14 మెట్రిక్ టన్నుల తడి చెత్తను తరలిస్తున్నారు. అధికారుల అంచనా ప్రకారం 8 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలు వెలువడుతున్నాయి. స్వచ్ఛ ఆటో కార్మికులు సేకరించే ఘన వ్యర్థాలు కిలోకు కేంద్రం వారు రూ.5 చెల్లిస్తున్నారు. తిరిగి దుకాణాలకు రెండు, మూడు రెట్లకు విక్రయిస్తున్నారు. సేకరించిన వ్యర్థాలు, ఆదాయం తాలూకు లెక్కాపత్రాల్లేకపోవడంతో నిర్వాహక సిబ్బంది పురపాలక ఖజానాకు చిల్లులు పొడుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి"తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చిన ట్రాలీల కార్మికులకు డీఆర్‌సీసీల్లో మార్కెట్ ధరనే చెల్లిస్తున్నారు. త్వరలో రామవరంలో బయో మైనింగ్ ప్లాంట్ ప్రారంభించనున్నాం. ఇకపై ఘన వ్యర్థాలను అక్కడకు తరలించి అవకతవకల్లేకుండా విక్రయాల ఏర్పాట్లు చేస్తాం" అని పురపాలక అధికారులు 'న్యూస్టుడే'కు వివరణ ఇచ్చారుగుట్టలుగా.. చెత్త కుప్పలుడీఆర్‌సీసీ కేంద్రాల్లో ఏ రోజుకారోజు ప్లాస్టిక్, ఘన వ్యర్థాలను సేకరించి మార్కెట్ రేటుకు విక్రయించడం ద్వారా పురపాలకానికి ఆదాయాన్ని పెంచాలి. తడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేయాలి. కానీ, అక్కడి కంపోస్టు బెడ్లు చాలా వరకు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కేవలం రెండు, మూడింట్లో మాత్రమే వర్మికంపోస్టు తయారు చేస్తున్నారు. పట్టణ స్వచ్ఛతతో పాటు పురపాలకానికి ఆదాయ వనరుగా మారాల్సిన కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఆదాయ వివరాలను పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా డీఆర్‌సీసీలను గాడిలో పెట్టి మరికొందరికి ఉపాధి కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

## 105 మందికి..21 మందే

కేతేపల్లి, ఫిబ్రవరి 2

,ఉమ్మడి జిల్లాలో 33 వేల ఎకరాల భూములకు సాగునీరు అందిస్తున్న మూసీ ప్రాజెక్టుని సిబ్బంది కొరత వెంటాడుతోంది. రిజర్వాయర్ డ్యామ్ నిర్వహణ, కుడి, ఎడమ కాలువలు, డిస్ట్రిబ్యూటరీల పర్యవేక్షణ, చిన్నచిన్న మరమ్మతులు తదితరాల కోసం ఇంజినీరింగ్ అధికారులు మొదలుకొని నీటి పారుదలశాఖలోని 21 విభాగాలకు సంబంధించి మొత్తం 105 పోస్టులను అప్పట్లో కేటాయించారు. అందులో ప్రస్తుతం 21 మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తుండటం గమనార్హం. చివరి ఆయకట్టు భూముల వరకు నీటిని అందించేందుకు 15 మంది లస్కర్లను ఓఅండ్ఎం, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. ఒక డీఈఈ, నలుగురు ఇంజినీర్లు, వర్క్ఇన్స్‌పెక్టర్లు, ఎలక్ట్రీషియన్, లస్కర్లు తదితర 17 మంది ఉద్యోగులు ఉన్నారు.వాస్తవానికి కుడి, ఎడమ కాలువలో నీరు చివరి ఆయకట్టు వరకు వెళ్లడం, ఎర్త్‌డ్యామ్ నిర్వహణ కోసం 52 మంది లస్కర్లు అవసరమని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ప్రారంభ కాలంలో పోస్టులను మంజూరు చేశారు. మూసీ కాలువలకు నీరు విడుదల చేసిన సమయంలో డ్యామ్‌పై, కుడి, ఎడమ కాలువలపై పగలు, రాత్రి నిరంతరం పర్యటించే అధికారులు, సిబ్బంది సంఖ్య ఏయేటికాయేడు తగ్గిపోతుండటంతో పర్యవేక్షణ కొరవడుతోంది.ఖాళీ అయితే భర్తీ లేదునీటిపారుదలశాఖ నుంచి మూసీ ప్రాజెక్టుకు కేటాయించిన సిబ్బంది పోస్టు ఖాళీ అయితే భర్తీ కాకుండా మిగిలిపోతుంది. అధికారులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందడం, ఇతర ప్రాంతాలకు బదిలీ అవడం, అనారోగ్య కారణాలతో మృతిచెందడం తదితరాలతో పోస్టులు ఖాళీలు అవుతున్నాయి.

# సమస్యలు అధికం.. మరమ్మతుల్లో జాప్యం



నందిపేట్: జిల్లాకు శివారు మండలం డొంకేశ్వర్. ఉమ్మడి నందిపేట్ మండలంలోని 16 గ్రామాల ప్రజలకు వైద్యానికి డొంకేశ్వర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే ప్రధాన ఆధారం. కానీ ఇక్కడ సరైన వసతులు లేక రోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సమస్యను గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులకు రూ.15 లక్షలు మంజూరు చేసింది. కానీ పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి త్వరగా పూర్తిచేయించాలని కోరుతున్నారు.ఏయే సమస్యలంటే..ఆసుపత్రిలోని గోడలు, గదుల్లోని అడుగు భాగం ధ్వంసమైంది. విద్యుత్తు వ్యవస్థ చెడిపోయింది. పైపులైను అస్తవ్యస్థంగా మారడంతో లీకేజీలు ఏర్పడ్డాయి. గతంలో నిర్మించిన ప్రహరీ కూలిపోవడంతో పశువులు ప్రాంగణంలోకి వస్తున్నాయి. పరిసరాల్లోని సీసీ ప్లాట్‌ఫాం లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. పీహెచ్‌సీలోని సమస్యలను రోగులు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లగా 14 నెలల కిందట నిధులు విడుదలయ్యాయి. టెండరు, ఒప్పంద ప్రక్రియ ముగిసి కొన్ని పనులు చేపట్టి బిల్లులు కూడా తీసుకున్నారు. మిగతా పనులు చేయడం లేదు. ఈ విషయమై ప్రజలు ఏడాదిగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు..ఇబ్బందులు పడుతున్నాం సురేందర్, పీహెచ్‌సీ పర్యవేక్షకుడుపెండింగ్ పనులు చేయకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. పశువుల సంచారం, పిచ్చి మొక్కలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.త్వరలో పూర్తిచేస్తాం రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈనేను మండలానికి ఇటీవలే వచ్చాను. పనులు పెండింగ్‌లో ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. గుత్తేదారుతో మాట్లాడాం.. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించాం. వీలైనంత త్వరగా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

## రైతులకు లక్ష్మి కటాక్షం!

బాల్కొండ: అధికారిక లెక్కల ప్రకారం 34,060 ఎకరాల చొప్పున ఏటా వానాకాలం, యాసంగి పంటలకు నీరందుతుంది. భూగర్భ జలాలు పెరగడం ద్వారా వేల ఎకరాలకు లబ్ధిచేకూరుతోంది. 38 ఏళ్ల కింద లక్ష్మి కాల్వ నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి పంటలకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ సాగు భూములను సస్యశ్యామలం చేస్తోంది. రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది.గతంలో రైతులు సాగు నీటికోసం బోరుబావులు తవ్వించుకునేవారు. నిజాంసాగర్ నీటి కోసం ఎదురు చూసే వారు. కాని లక్ష్మి కాల్వతో సాగు నీటి కష్టాలు తీరాయి. ఏటా రెండు పంటలు పండుతున్నాయి. గ్రామాల్లో చెరువులు నింపడంతో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. వేసవిలో పశువులకు తాగునీటి కొరత లేకుండా పోయింది.

ప్రత్యేకంగా హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణంశ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మి కాల్వకు నీటిని అందించడానికి ముప్కాల్ శివారులో హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉంది. ప్రధాన కాల్వ కొత్తపల్లి శివారు వరకు ఉంది. దీనికి నాలుగు డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. నాలుగో డిస్ట్రిబ్యూటరీ ద్వారా షెట్‌పల్లి వద్ద చౌట్‌పల్లి హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతలకు నీరందుతుంది. మూడో డిస్ట్రిబ్యూటరీ కాలువ పెద్దది. దీని కింద ఎక్కువ ఆయకట్టు ఉంది. సాగు నీటికి ఢోకా లేదు...బుల్లెట్ రాంరెడ్డి, రైతు, రెంజర్లలక్ష్మి కాల్వ నిర్మాణంతో సాగునీటికి ఢోకా లేదు. పంటలకు పుష్కలంగా నీరందుతుంది. సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. బోర్లు బాగా నీటిని పోస్తున్నాయి. చెరువులు సైతం నింపడం వల్ల జలకళ సంతరించుకున్నాయి.

# జిల్లాకో కేంద్రం.. అందుబాటులో ఔషధం



వరంగల్ ,ఫిబ్రవరి 2

జిల్లాకో 'సెంట్రల్ డ్రగ్ స్టోర్' ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వ వైద్య, మౌలిక సేవల సదుపాయాల సంస్థ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లాకు సంబంధించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్(కేంద్ర ఔషధ గిడ్డంగి)ని అధికారులు ఉర్సులోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం హనుమకొండలో కేయూ ఎదురుగా టీబీ ఆసుపత్రి పక్కన ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కేంద్రం ఉంది. ఇప్పటి వరకు ఇక్కడి నుంచే ఉమ్మడి ఆరు జిల్లాలకు ఔషధాలు, శస్త్రచికిత్సకు సంబంధించిన వస్తువులు సరఫరా అయ్యేవి. దీంతో దూరప్రాంత జిల్లాలకు మందుల సరఫరా ఒక్కోసారి కష్టతరమయ్యేది. రవాణా పరమైన ఇబ్బందులూ ఎదురయ్యేవి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కేంద్ర ఔషధ గిడ్డంగులు ఏర్పాటు చేయడం ద్వారా అడ్డంకులు అధిగమించాలని నిర్ణయించింది.ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సూచికఉమ్మడి జిల్లాలో తొలుత మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ప్రారంభించారు. తాజాగా వరంగల్ జిల్లాతో పాటు, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లోనూ కేంద్రాలు ప్రారంభించారు. వరంగల్ ఉర్సులోని సీకేఎం ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ప్రసూతి ఆసుపత్రిలో కేంద్రం ఏర్పాటు చేసి.. ఇటీవల కొన్నిరకాల ఔషధాలు, సర్జికల్ వస్తువులు నిల్వ చేశారు. దీని బాధ్యతలను హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఫార్మసీ సూపర్‌వైజర్ నాగమణి, మరో ఫార్మాసిస్టు సుధాకర్‌రెడ్డిలకు అప్పగించారు. త్వరలో కంప్యూటర్ల ఏర్పాటుతో పాటు సిబ్బందిని నియమించి, స్టోర్‌ను పూర్తిస్థాయిలో కొనసాగించనున్నారు. ఇకపై ఈ కేంద్రం నుంచే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రితోపాటు సీకేఎం ఆసుపత్రి, ప్రాంతీయ నేత్రవైద్యశాల, వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలకు మందులు, ఇంజక్షన్లు, సర్జికల్ వస్తువులు సరఫరా అవుతాయని అధికారులు తెలిపారు. జిల్లాల వారీగా కేంద్రాల ఏర్పాటుతో హనుమకొండలోని ఉమ్మడి జిల్లా సెంట్రల్ డ్రగ్ స్టోర్‌పై ఒత్తిడి తగ్గనుంది.

ప్రసూతి సేవలకు కష్టమేసెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటుతో ఉర్సు ప్రసూతి ఆసుపత్రిలో ఇకపై ప్రసూతి సేవలు పునరుద్ధరించడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 30 పడకల ఆసుపత్రిలో ఒకప్పుడు ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట, శివనగర్, ఖిలావరంగల్, జక్కులొద్ది, మామునూరు తదితర శివారు గ్రామాల ప్రజలకు సేవలందేవి. ప్రసవాలు, స్త్రీ వైద్యసేవల కోసం ప్రజలు వరుసకట్టేవారు. ప్రత్యేక రాష్ట్రంలో ఆసుపత్రిని పునరుద్ధరిస్తారని ప్రజలు ఆశించినా అది జరగలేదు. ప్రస్తుతం కేవలం ఓపీ సేవలు మాత్రమే అందిస్తున్నారు. ఇక డ్రగ్ స్టోర్ ఏర్పాటుతో భవిష్యత్తులో ఆసుపత్రి పునరుద్ధరణ అసాధ్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మత్తులో డ్రైవింగ్

జగిత్యాల, ఫిబ్రవరి 2

:పక్షం రోజుల కిందట జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో నడుచుకుంటూ వెళుతున్న వారిని తాకుతూ అతివేగంతో వంపులు తిరుగుతూ ద్విచక్రవాహనం దూసుకెళ్లింది. కొద్దిలో పెను ప్రమాదం తప్పింది.జగిత్యాల పట్టణంలో వారం కిందట దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఆకస్మాత్తుగా వెనుక నుంచి 80 కి.మీ పైగా వేగంతో ఓ ద్విచక్రవాహనం దూసుకెళ్లింది. ఆ వాహనంపై ఇద్దరు యువకులు ఉన్నారు. తృటిలో ప్రమాదం తప్పింది. అదృష్టం బాగుండి ఎవరికీ ఏం కాలేదు. ఈ ఘటనలే కాదు జిల్లా వ్యాప్తంగా ర్యాష్ డ్రైవింగ్ భయబ్రాంతులకు గురిచేస్తోంది. జిల్లాలో ఈ ఒక్క ఏడాదిలోనే 203 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితికి



ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీటితోపాటు డ్రంక్ అండ్ డ్రైవింగ్ 5,508 కేసులు నమోదయ్యాయి. చాలా మందికి కోర్టు శిక్షలు, జరిమానా విధించినా మార్పు రావటంలేదు. పోలీసులు కఠిన చర్యలు చేపట్టకపోతే కేసులు మరిన్ని పెరిగే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో ఎక్కువ..జిల్లాలో నిత్యం రూ.2 నుంచి రూ.3 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. పల్లెల్లోనూ గొలుసు మద్యం దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. మరో వైపు గంజాయి మత్తులో యువకులు, విద్యార్థులు మునిగిపోతున్నారు. ఆ మత్తులో ఇష్టారీతిగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ఏడాది 2024 రోడ్డు ప్రమాదాలు జరగగా వందలాది మంది క్షతగాత్రులుగా మారారు. చాలా మంది మృతి చెందారు. రాత్రి వేళల్లో యువకులు అతివేగంతో వాహనాలు నడపటం సర్వసాధరణమైపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నా వాహన నంబరు ఉండదని బాధితులు వాపోతున్నారు. జగిత్యాల పట్టణంతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి రహదారులపై ర్యాష్ డ్రైవింగ్ కనిపిస్తోంది. కానరాని తనిఖీలు..జిల్లాలో అతి వేగంతో వెళ్లే వారిని నియంత్రించేందుకు స్పీడ్‌గన్‌తో జరిమానాలు విధించేవారు. స్పీడ్‌గన్‌ను జగిత్యాల-కరీంనగర్ రహదారి, నిజామాబాద్ రహదారిపై ఉపయోగిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు హైవేలపై ప్రత్యేక బృందాలను గస్తీ తిప్పుతూ అతివేగంతో వెళ్లే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తే భయం పెరిగే అవకాశం ఉంది. ఎక్కడా లేని విధంగా ట్రాఫిక్ శిక్షణ కేంద్రం జిల్లా కేంద్రంలో ఉంది. గతంలో ప్రమాదాలకు పాల్పడిన వారికి శిక్షణ ఇచ్చి పంపేవారు. ఇప్పుడు ఎలాంటి శిక్షణ ఇవ్వటంలేదు. మద్యం తాగే వారిని గుర్తిస్తున్నా జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలోనూ తనిఖీలు చేసి కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేసి రోడ్లపై జులాయిగా తిరిగే వారిని గుర్తించి స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించి పంపేవారు. ప్రస్తుతం తనిఖీలు చేయటంలేదు.కఠిన చర్యలు తీసుకుంటున్నాం అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ర్యాష్‌డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే 5 వేలకుపై కేసులు నమోదయ్యాయి. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తాం. అన్ని స్టేషన్ల పరిధిలోనూ ఆదేశాలు జారీ చేస్తాం.

# ఎక్కడి దస్త్రం అక్కడే



కరీంనగర్ ,ఫిబ్రవరి 2,కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగం గాడీ తప్పింది. పన్నుల వసూలు, కొత్త ఇంటి నంబర్ల కేటాయింపు, వాణిజ్య భవనాల రీఅసెస్‌మెంట్ పనులు మినహాయిస్తే మిగతా దస్త్రాలన్నీ పెండింగ్‌లో ఉంటున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్రస్థాయి నుంచి విభాగం అధికారి వరకు దస్త్రం పెండింగ్‌లోనే లేదని దాటేస్తుండగా దరఖాస్తుదారులు మాత్రం పనులు చేయాలని కార్పొరేటర్ల చుట్టూ తిరుగుతున్నారు.నెలల తరబడి పెండింగ్‌రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్లతోపాటు నలుగురు రెవెన్యూ అధికారులు(ఆర్.ఐ), ఒక ఆర్వో ఉన్నారు. పేరుమార్పిడి, పన్ను మదింపు వంటి అర్జీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సి ఉండగా ఇటీవల నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్లు తెలుస్తోంది. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అన్నింటికీ కొర్రీలేపేరుమార్పిడి, ఇతరత్రా పనుల కోసం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోపాటు అవసరమైన కాగితాలతో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎక్కడ లేని నిబంధనలు జత చేసి, లేని కాగితాలు తీసుకు రావాలని ఆదేశిస్తుండటం, కొర్రీలతో అర్జీదారులు నానావస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక కొందరు అడ్డదారుల్లో వచ్చి ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేసుకుంటున్నారు. పైసలు ఇవ్వనిదే దస్త్రాలు కదలడం లేదని పలువురు పాలకవర్గ సభ్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.కొన్ని దృష్టాంతాలు ఇలా..తీగలగుట్టపల్లి ప్రాంతవాసి ఇంటినంబర్ కోసం దరఖాస్తు చేశారు. దీనికి కావాల్సిన దరఖాస్తుతోపాటు రిజిస్ట్రేషన్ దస్తావేజులు జత చేశారు. నిబంధనల ప్రకారం అంటూ ఆ దస్త్రాన్ని న్యాయ సలహా కోసం పంపించారు. దీనికి స్టాంపు డ్యూటీ రూ.40 వేలు చెల్లించాల్సి ఉంటుందని న్యాయ సలహాదారు చెప్పడంతో దరఖాస్తుదారు వెనక్కి తగ్గారు. లింకు కాగితాలు, రిజిస్ట్రేషన్ పక్కాగా ఉండగా కొర్రీ పెట్టడంలో మతలబు ఏమిటో తెలియక ఆ దస్త్రాన్ని అలాగే రెవెన్యూ విభాగంలో ఉంచారు.కమాన్ రోడ్డులో పేరు మార్పిడి చేసుకోగా బైఫరికేషన్ నంబర్ కోసం ఒకరు దరఖాస్తు చేశారు. ఒకరిపైనే పన్ను భారం పడుతుండగా కొనుగోలుదారుకు నంబర్ ఇవ్వాల్సి ఉండగా 9 నెలలుగా తిప్పుతున్నారు. దేనికోసం ఇబ్బందులు పెడుతున్నారని నిలదీసినా అధికారుల దగ్గరి నుంచి సమాధానంలేదని దరఖాస్తుదారు అంటున్నారు బుట్టిరాజరాంకాలనీకి చెందిన ఒకరు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత పేరు మార్పిడికి 3 నెలల కిందట దరఖాస్తు చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారి పరిశీలించాల్సి ఉండగా.. వెళ్లడంలేదు.ఉస్మాన్‌పురకు చెందిన ఒక ఇంటి యజమాని పేరు మార్పిడి చేసుకున్నారు. బై ఇంటి నంబర్ ఇచ్చేందుకు ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడు నెలలుగా ఇంటి నంబర్ మాత్రం రావడంలేదు. ఎందుకు జాప్యం అవుతుందని పేర్కొన్నా సమాధానం దాటేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. విద్యానగర్‌కు చెందిన ఒకరు ఆస్తిని గిఫ్టు చేస్తూ రిజిస్ట్రేషన్ చేశారు. అక్కడే ఆన్‌లైన్‌లో పేరుమార్పిడి జరిగిపోగా.. నగరపాలికలో తిరస్కరించారు. అన్ని ఆధారాలతో రిజిస్ట్రేషన్ జరిగిపోగా.. దేనికోసం ఆరా తీస్తే కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ తప్పనిసరి అని మెలిక పెట్టారు. రెవెన్యూ శాఖలో మాత్రం సాధారణ ప్రజలకు ఈ సర్టిఫికెట్ జారీ చేయడం లేదు. ఇలా 20 దరఖాస్తులను రిజెక్ట్ చేయడంతో ఆ సర్టిఫికెట్‌ను నగరపాలక అధికారులే ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. నోటీసులు ఇస్తున్నారు-స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్, నగరపాలికఆన్‌లైన్ ద్వారా వచ్చిన దస్త్రాలు పెండింగ్‌లో లేవు. మిగతా వాటికి దస్త్రాలు సరైన విధంగా లేకపోతే వాటికి నోటీసులు ఇస్తున్నారు. కొన్ని మ్యుటేషన్ ఫీజులు చెల్లించకపోవడంతో పెండింగ్‌లో ఉంటున్నాయి.

# నూలు.. నేతన్నకు మేలు

సిరిసిల్ల , ఫిబ్రవరి 2

,జిల్లాలో ఏడు దశాబ్దాల క్రితమే చేనేత నుంచి క్రమంగా మరమగ్గాలు విస్తరిస్తూ వచ్చాయి. నాటి నుంచి వస్త్ర పరిశ్రమ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే వేలాది మంది నేతన్నలకు ఉపాధినిస్తోంది. ఇటీవల ప్రభుత్వం వేములవాడలో రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో నూలు బ్యాంకు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. వేములవాడ మార్కెట్ యార్డులో దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వచ్చాక జిల్లా వస్త్ర పరిశ్రమకు నూతన జవసత్వాలు వస్తాయి.పొరుగు రాష్ట్రాల్లో...తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో మరమగ్గాల వస్త్రోత్పత్తి సమూహాలున్న చోట నూలు ఉత్పత్తి కంపెనీలే నేరుగా విక్రయశాలలు ఏర్పాటు చేస్తాయి. అక్కడ నూలు విక్రయాల్లో మధ్య దళారీ వ్యవస్థ కనిపించదు. చిన్న, మధ్య తరగతి వస్త్రోత్పత్తిదారులు తమకు వచ్చే ఆర్డర్లకు అనుగుణంగా నూలు కొనుగోలు చేస్తారు. వాటితో నేసిన వాటిని స్వయంగా విక్రయించవచ్చు. ఇలా చేయడం వల్ల తమ నైపుణ్యంతో కళాత్మకమైన ఉత్పత్తులు వెలువడతాయి. వీటిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ద్వారా తమ ప్రతిభకు గుర్తింపు లభించే అవకాశం ఉంటుంది.జిల్లాలో 30,352 మరమగ్గాలపై రోజుకు సగటున మూడు లక్షల మీటర్ల పాలిస్టర్ వస్త్రోత్పత్తి జరుగుతోంది. ఇది దక్షిణ భారతదేశంలోనే అత్యధికం. ఇక కాటన్ ఉత్పత్తులు లక్ష మీటర్లలోపే ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లన్నీ కలిపి ఏటా సుమారు 20 వేల టన్నుల పాలిస్టర్, ఐదు టన్నులపైగా కాటన్ నూలు వాడుతారు. ఇంత వినియోగం ఉన్నా దశాబ్దాలుగా ఇక్కడ నూలు బ్యాంకులు, ప్రైవేటు నూలు విక్రయశాలలు లేకపోవడం గమనార్హం. జిల్లాలో వివిధ కంపెనీల నూలు విక్రయ ఏజెంట్లు, మధ్యదళారులు మాత్రమే అమ్ముతున్నారు. ప్రైవేటు నూలు కంపెనీలు నేరుగా నూలు విక్రయశాలలు ఏర్పాటు చేస్తే జిల్లా వస్త్ర పరిశ్రమలో ఉపాధితోపాటు విస్తరణకు అవకాశాలున్నాయి.ఘనమైన చరిత్రజిల్లాలో సొంత ఉత్పత్తులు తక్కువ. అందుకే అయిదు దశాబ్దాలుగా మరమగ్గాల వస్త్రోత్పత్తులు




జరుగుతున్నా జిల్లాకు ప్రత్యేకంగా గుర్తింపు అంటూ లేకుండా పోయింది. ప్రభుత్వం ఆర్డర్లు వచ్చినపుడు ముడి సరకు కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది. సంఘాల వారీగా వచ్చిన ఆర్డర్లకు నూలు డిపో నుంచి ముడి సరకును తీసుకుని ఉత్పత్తి చేసిన వస్త్రాన్ని అప్పగించాలి. దీనిలో నూలు ఖర్చును మినహాయించుకుని మిగతా డబ్బులు చెల్లింపులు జరుగుతాయి. దీంతో చిన్న, మధ్య తరగతి ఆసాములు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉందివస్త్రాల సేకరణకు జిల్లాలో టెస్కో ఆర్‌డీడీ (రీజినల్ డిప్యూటీ డైరెక్టర్) స్థాయి ఉద్యోగిని నియమించాలి. ప్రస్తుతం ఈ విభాగంలో తాత్కాలిక ఉద్యోగులే చూస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లపై జిల్లాలో పర్యవేక్షణ పెంచాలి.మనుగడ కోల్పోతున్న కాటన్ ఉత్పత్తులతోపాటు దాని అనుబంధ రంగాలైన సైజింగ్, అద్దకం పరిశ్రమలకు పూర్వవైభవం వచ్చే అవకాశాలున్నాయి.కార్మిక, ధార్మిక క్షేత్రమైన జిల్లాలో రాజన్న ఆలయ అభివృద్ధితోపాటు నేతన్నల సంక్షేమానికి ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. వేములవాడ చేనేత క్లస్టర్‌కు నూలు డిపో మంజూరైంది. దీంతో సిరిసిల్లతోపాటు గర్షకుర్తి, కొత్తపల్లి వరకు నేతన్నలకు ఎవరికి అవసరమున్నా తీసుకెళ్లవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లకు అవసరమైన నూలు ఇక్కడ అందుబాటులో ఉంటుంది. అంచెలంచెలుగా దీని సామర్థ్యం రూ.100 కోట్లకు పెంచుతాం. త్వరలోనే ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# ఆ బస్సులకు మహిళలే యజమానులు

కరీంనగర్ ,ఫిబ్రవరి 2

,మహిళా ప్రగతి రథ చక్రాలు రోడ్డెక్కేందుకు కార్యాచరణ మొదలైంది. మండల మహిళా సమాఖ్యలతో బస్సులు కొనుగోలు చేయించి.. ఆర్టీసీకి అద్దెకు ఇప్పించి.. వారికి ఉపాధి అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ, టీజీఎస్-ఆర్టీసీ రవాణా శాఖల సంయుక్త నిర్వహణలో ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సులను మహిళా సంఘాల ద్వారా తీసుకోవాలన్న నిర్ణయంలో భాగంగా మొదట మూడు జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయగా అందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా కూడా ఒకటిగా ఉంది. మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలను కూడా చేర్చారు.ప్రాథమికంగా నిర్ణయం..

ఈ బాధ్యతను మెప్మాతోపాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి. వాటి ఖాతాల్లో ఉన్న కొంత డబ్బుతోపాటు బ్యాంకు రుణ సదుపాయం, ప్రభుత్వ రాయితీ వంటి వాటిని జోడించి బస్సులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. అద్దె బస్సుల్లోనూ అవసరమైన వారికి ఉపాధి కల్పించే అవకాశముంది. ఇందుకు అవసరమైతే వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో మహిళా శక్తిని చాటే అవకాశముంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 100 నుంచి 150 సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వాటి ద్వారా బస్సులు కొనాలనేది ప్రభుత్వ ఉద్దేశం.తీరనున్న బస్సుల కొరత..కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో 860 బస్సులు ఉండగా, ఇందులో 333 అద్దెవి ఉన్నాయి. ఇవి కాకుండా ఇటీవల 33 ఎలక్ట్రిక్ బస్సులు కూడా అందుబాటులోకి వచ్చాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది.



ఈ బాధ్యతను మెప్మాతోపాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి.

అంతకుముందు రీజియన్ వ్యాప్తంగా 2 లక్షల మంది ప్రయాణించగా పథకం అమల్లోకి వచ్చాక ఈ సంఖ్య అయిదు లక్షలకు చేరింది. ఉన్న వాటితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కొన్ని సందర్భాల్లో పరిమితికి మించిన ప్రయాణికులతో వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మండల మహిళా సమాఖ్యల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి, ఆర్టీసీకి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 61 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. బస్సుకు ఇద్దరు చొప్పున చోదకులను తీసుకున్నా మరో 122 మందికి ఉపాధి లభించనుంది. విధి విధానాలు రూపొందిస్తున్నాం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌మండల సమాఖ్యల ద్వారా బస్సుల కొనుగోలుకు సంబంధించిన విధి విధానాలు రూపొందిస్తున్నాం. మొదట కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ అమలు చేసిన తర్వాత అన్ని జిల్లాలకు విస్తరింపజేస్తాం. మహిళా శక్తి ద్వారా ఉపాధి కల్పించనున్నాం. త్వరలోనే తుది రూపకల్పన ప్రకటిస్తాం.

# తిరుగు ప్రయాణం తిప్పలు

కరీంనగర్ ,బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వచ్చిన వారు ఆదివారం తిరుగుముఖం పట్టడంతో కరీంనగర్ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. జేబీఎస్, హైదరాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాలలో అధిక రద్దీ కనిపించింది. డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు, సిబ్బంది బస్టాండ్‌లో మకాం వేసి ఆయా రూట్లలో బస్సులు నడిచేలా చూశారు. అయినా సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.అదనపు బస్సులు తిప్పినా..ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో బస్సులు సరిపోలేదు. అధికారులు అదనపు ట్రిప్పులు నడిచేలా చూశారు. జేబీఎస్‌కు వందకుపైగా అదనపు ట్రిప్పులు నడపగా, సిటీ నుంచి మరో 30 బస్సులను తెప్పించినట్లు అధికారులు తెలిపారు. చాలామంది ఇన్‌గేట్ వద్ద, కరీంనగర్-1, 2 డిపోల ముందు బస్సుల కోసం వేచి చూశారు. డిపో నుంచి బయటకు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు ఇన్‌గేట్‌లోకి రావడంతో సీట్ల కోసం పరుగులు తీశారు. కరీంనగర్-2 డిపోలో ఇటీవల అందుబాటులోకి వచ్చిన ఎలక్ట్రిక్ బస్సులు ఉన్నా కొన్నింటికి డ్రైవర్లు లేకపోవడంతో నడపలేదు. కొందరు విధుల్లోకి వచ్చినా బ్రీత్‌ఎనలైజర్ పరీక్షల్లో మద్యం తాగినట్లు చూపడంతో వారిని దూరంగా ఉంచినట్లు సమాచారం. 'న్యూస్‌టుడే' ఈ విషయంపై డీఎం మల్లయ్యను సంప్రదించగా 35 ఎలక్ట్రిక్ బస్సులు నడిచాయని, అదనపు ట్రిప్పుల కోసం చోదకులను పిలిపించామని చెప్పారు.

ప్రైవేటు వాహనాల దోపిడీ..దూరప్రాంతాలకు వెళ్లే వారు రిజర్వేషన్ చేసుకోవడంతో బస్సుల్లో సీట్లు నిండిపోయాయి. ఆది, సోమవారం కూడా రిజర్వేషన్ దొరకడంలేదని పలువురు తెలిపారు. ప్రయాణికులకు సమాధానం చెప్పలేక అధికారులు ఇబ్బందిపడ్డారు.




బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉండటంతో కొందరు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లడానికి మొగ్గు చూపారు. దీనిని ఆసరాగా చేసుకున్న కార్లు, ఇతర ప్రైవేటు వాహనదారులు జేబీఎస్‌కు రూ.1000 వసూలు చేశారు. బస్టాండ్ ముందు భాగంలో కార్లు, ఇతర వాహనాలు బారులుదీరాయి. బస్టాండ్‌లో కొందరు వ్యాపారులు నాసిరకమైన తినుబండారాలు, అధిక ధరలకు వస్తువులను విక్రయించారనే ఆరోపణలున్నాయి.పండుగ ముగిసింది.. పట్నం పిలిచింది తిమ్మాపూర్ : హైదరాబాద్ నుంచి దసరా పండుగ కోసం సొంతూళ్లకు వచ్చి తిరిగి వెళ్లే వారి వాహనాలు రేణికుంట టోల్‌ప్లాజా వద్ద బారులు తీరాయి. సోమవారం విధులకు హాజరు కావాల్సి ఉండటంతో ఆదివారం మధ్యాహ్నం నుంచే చాలా మంది తిరుగుముఖం పట్టారు. సాయంత్రం టోల్‌ప్లాజా వద్ద పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు దాదాపు 20 నిమిషాలు నిరీక్షించాల్సి వచ్చింది.

# రోగ నిరోధక శక్తిని పెంచి.. ఆరోగ్యాన్ని అందించే..

## కొత్త ఉత్పత్తులు పతంజలి నుంచి..

సహజసిద్ధమైన ఆహార ఉత్పత్తులతో శరీరాన్ని, మనసును ఆరోగ్యంగా ఉంచుకునే విషయంలో.. భారతీయులకు దశాబ్దాలుగా పతంజలి ఒక మంచి ఎంపికగా మారింది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, యోగా నిపుణులు బాబా రాందేవ్ ఈ బ్రాండ్‌ను ప్రారంభించారు. ఈ కంపెనీ విజయగాథ లక్షలాది మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిచ్చింది. తన విలువలను కొనసాగిస్తూ.. వినియోగదారుల సంక్షేమం కోసం మరో మూడు ఉపయోగకరమైన ఉత్పత్తులతో ముందుకు వచ్చింది. అవే పతంజలి తేనె, ఆవు నెయ్యి, చ్యవనప్రాశ్.




పతంజలి తేనె తియ్యదనంతో పాటు గొప్ప ఆరోగ్యకర ప్రయోజనాలనూ అందిస్తుంది. ఇందులో ఫ్రక్టోజ్, మినరల్స్, విటమిన్స్, ఇతర న్యూట్రిషన్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇక ఇతర ప్రకృతి సిద్ధమైన పతంజలి ఉత్పత్తుల మాదిరిగానే. ఈ తేనె కూడా ప్రకృతి నుంచి నేరుగా సేకరించిందే. మరిన్ని వివరాల కోసం క్లిక్ చేయండి..

నెయ్యి లేకుండా ఏ భారతీయ సంప్రదాయ వంటకం పూర్తి కాదు కదా..! మరి దీనికి పతంజలి వారు అందిస్తున్న స్వచ్ఛమైన ఆవు నెయ్యి కాకుండా ఇంకో ఎంపిక ఏముంటుంది?పసందైన రుచితో పాటు మీ శ్రేయస్సు కోసం తయారుచేసిన నెయ్యి ఇది. ఆవు నెయ్యిలో మానసిక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయనే విషయాన్ని మర్చిపోవద్దు. అది మన జ్ఞాపకశక్తితో పాటు మేధస్సును మెరుగుపర్చడంలో సహాయపడుతుంది. పతంజలి ఆవు నెయ్యితో ఆ ప్రయోజనాలన్నీ పుష్కలంగా ఉన్నాయి. ఇది త్వరగా జీర్ణమవడంతో పాటు మన హార్మోన్ సింథసిస్‌ను పెంచుతుంది. మరిన్ని వివరాల కోసం క్లిక్ చేయండి..

భారత సంప్రదాయంలో చ్యవనప్రాశ్ ఎన్నో శతాబ్దాల నుంచి కొనసాగుతూ వస్తోంది. దీనికి మన మార్కెట్లో ఎన్నో రకాల బ్రాండ్‌లు అందుబాటులో ఉన్నాయి. మరి అందులో దేన్ని నమ్మాలి..? దీనికి సరైన సమాధానమే పతంజలి చ్యవనప్రాశ్. దగ్గు, ఆస్తమా, ఆకలి లేకపోవడం, ఊపిరితిత్తుల రుగ్మత, చెవి, ముగ్గు, గొంతు నొప్పి వంటి ఎన్నో సమస్యలకు చ్యవనప్రాశ్ ప్రత్యామ్నాయ ఔషదం. జ్ఞాపకశక్తిని పెంచడంలోనూ ఎంతగానో దోహదపడుతుంది. కొవిడ్-19 మన జీవితాల్లోకి వచ్చిన తర్వాత రోగనిరోధక శక్తిని పెంచుకోవడం అత్యవసరంగా మారింది. దీనికి కూడా చ్యవనప్రాశ్ మెరుగ్గా ఉపయోగపడుతుంది. మరిన్ని వివరాల కోసం క్లిక్ చేయండి.

అందుకే.. మీ శరీరాన్ని, మనసును ఆరోగ్యంగా ఉంచుకునేందుకు పతంజలి తేనె, ఆవు నెయ్యి, చ్యవనప్రాశ్ అత్యుత్తమైనవి.

# కాలుష్యానికి ఆవిరి మంత్రం

పల్లెల్లో నివసించేవాళ్లు ఎక్కువ కాలం జీవిస్తారని, క్యాన్సర్లు వచ్చే అవకాశం తక్కువని భావిస్తుంటారు. ఇందులో నిజం లేకపోలేదు. దీనికి కారణం చాలావరకు స్వచ్ఛమైన గాలే. పట్టణాల్లో కాలుష్యం ఎక్కువ. నగరాలు, మహా నగరాల్లో నివసించిన వారి ఊపిరితిత్తుల్లోని లింపు గ్రంథుల్లో నల్లటి కాలుష్య కారకాలు ఉంటున్నట్టు శవ పరీక్షల్లో తేలింది. ఇవి రోగనిరోధక కణాలు, హానికారక సూక్ష్మక్రిములను మింగే మాక్రోఫేజస్ పనితీరును తగ్గిస్తాయి. దీంతో తరచూ శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు తలెత్తటమే కాదు.. క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. కాలుష్యాన్ని తగ్గించగలిగితే దీంతో ముడిపడిన జబ్బులూ తగ్గుముఖం పడతాయి. అలాగే క్రమం



తప్పకుండా ముఖానికి ఆవిరి పట్టటమూ మంచిదే. ఇది శ్వాసనాళం నుంచి కాలుష్య కారకాలు తొలగిపోయేలా చేస్తుంది. ఫలితంగా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు తలెత్తే అవకాశమూ తగ్గుతుంది. కాబట్టి గాలి కాలుష్యం అధికంగా ఉండే చోట్ల నివసించే వారు రోజుకు ఒకట్రెండు సార్లు ముఖానికి ఆవిరి పట్టుకోవటం ఎంతైనా మంచిది.

# మధుమేహానికి మంచి మందేది?

మధుమేహం చికిత్స అనగానే డాక్టర్లు ముందుగా ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామంతో పాటు మెట్‌ఫార్మిన్ మందు సూచిస్తారు. అప్పటికీ గ్లూకోజు మోతాదులు తగ్గకపోతే రెండో మందును జోడిస్తారు. అయితే ఈ అదనపు మందుల్లో ఏది మంచిది? ఏది బాగా పనిచేస్తుంది? అనే దానిపై శాస్త్రవేత్తలు ఇటీవల ఒక అధ్యయనం నిర్వహించారు. మెట్‌ఫార్మిన్‌తో పాటు సిటాగ్లిప్టిన్, లిరాగ్లుటైడ్, గ్లిమిపిరైడ్, ఇన్సులిన్ గ్లార్జిన్ యూ-100 మందులో ఏదో ఒకదాన్ని ఇచ్చి ఐదేళ్ల పాటు పరిశీలించారు. ఇవన్నీ గ్లూకోజు తగ్గటానికి తోడ్పడుతున్నట్టు తేల్చారు. మిగతావాటితో పోలిస్తే లిరాగ్లుటైడ్, ఇన్సులిన్ గ్లార్జిన్ ఒకింత ఎక్కువ ప్రభావం చూపుతున్నట్టు గుర్తించారు.




అయితే అధ్యయనం ముగిసేసరికి నాలుగింట మూడొంతుల మందిలో ఇంకా గ్లూకోజు నిర్ణీత మోతాదుల స్థాయికి చేరకపోవటం గమనార్హం. రక్తంలో గ్లూకోజు, గుండెజబ్బు, ఇతర సమస్యల విషయంలోనూ మందుల ప్రభావాల్లో తేడాలు కనిపించాయి. ఉదాహరణకు- లిరాగ్లుటైడ్ లేదా ఇన్సులిన్ గ్లార్జిన్ వాడినవారిలో గ్లూకోజు మోతాదులు ఎక్కువ కాలం నిర్ణీత లక్ష్యాలకు చేరుకున్నాయి. కానీ లిరాగ్లుటైడ్ వాడినవారికి జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం పెరిగింది. మధుమేహ నియంత్రణలో ఆయా వ్యక్తులకు అనుగుణంగా మందుల ఎంపికపై నిర్ణయం తీసుకోవటానికి ఈ అధ్యయన ఫలితాలు తోడ్పడగలవని భావిస్తున్నారు.

# స్టాటిన్ మాత్రలు వేసుకోవాలా?

: నాకు 62 ఏళ్లు. బీపీ, షుగర్ లేవు. నా ప్రధానమైన సమస్య కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు ఎక్కువగా ఉండటం. ఐదేళ్ల క్రితం ఎల్‌డీఎల్ మోతాదులు 200గా ఉండేవి. దీంతో మా డాక్టర్ స్టాటిన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. రోజూ ఉదయం, సాయంత్రం నడక, వ్యాయామాలు.. ధ్యానం ఆరంభించాను. శాకాహారమే తింటున్నాను. దీంతో ఎల్‌డీఎల్ 99.9, హెచ్‌డీఎల్ 54, యూరిక్ యాసిడ్ 6కు చేరుకున్నాయి. అయితే గత సంవత్సరం మాత్రలు మానేశాను. ఆహార, వ్యాయామ నియమాలు అలాగే పాటిస్తున్నాను. ఇప్పుడు ఎల్‌డీఎల్ 199కు పెరిగింది. హెచ్‌డీఎల్ 45కు తగ్గింది. యూరిక్ యాసిడ్ అంతే ఉంది. నేను తిరిగి మాత్రలు వేసుకోవటం మొదలెట్టాలా? జీవనశైలిలో ఏవైనా మార్పులు చేసుకోవాలా?



'మంచి జీవనశైలిని పాటిస్తున్నాను, సన్నగా ఉన్నాను. నాకు కొలెస్ట్రాల్ ఎక్కువవేమీ ఉండదు' అని చాలామంది అనుకుంటుంటారు. కానీ ఇది పూర్తిగా నిజం కాదు. కొలెస్ట్రాల్ మోతాదులపై ఒక్క జీవనశైలి మాత్రమే కాదు.. జన్యువులూ ప్రభావం చూపుతాయి. కొలెస్ట్రాల్ మోతాదులు పెరగటానికి మూడింట రెండొంతుల వరకు జన్యు స్వభావమే కారణం. ఆహార మార్పులు, వ్యాయామం వంటివి ఒక వంతు ప్రభావమే చూపుతాయి. మంచి జీవనశైలిని పాటిస్తున్నా కూడా కొందరిలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటానికి ఈ జన్యు స్వభావవే కారణమని గుర్తించాలి. ఇలాంటివారు సన్నగా ఉన్నా, లావుగా ఉన్నా ఒంట్లో కొలెస్ట్రాల్ ఎక్కువగా తయారవుతుంటుంది. అలాగని జన్యు స్వభావం బాగానే ఉన్నవారు ఎలాంటి జీవనశైలి పాటించినా ఏమీ కాదని అనుకోవటానికీ లేదు. సరైన ఆహార, వ్యాయామ నియమాలు పాటించకపోతే వీరిలోనూ కొలెస్ట్రాల్ పెరిగే ప్రమాదముంది. కాబట్టి కొలెస్ట్రాల్ విషయంలో ఏదో ఒక్కదాంతోనే సరిపెట్టుకోవటానికి లేదు. సాధారణంగా ఎల్‌డీఎల్ 100 లోపుంటే మంచిది. మీకు 199 ఉంది. ఇది చాలా ఎక్కువ. మీరు మందులు వాడినప్పుడు కొలెస్ట్రాల్ తగ్గింది, మానేస్తే ఎక్కువైందని అంటున్నారు. అంటే మీకు జన్యుపరంగా కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉత్పత్తయ్యే స్వభావం ఉన్నట్టుగా అనిపిస్తోంది. జన్యుపరంగా కొలెస్ట్రాల్ ఎక్కువయ్యే గుణం గలవారికి ఆహార, వ్యాయామ నియమాలతో 10-20% వరకే కొలెస్ట్రాల్ తగ్గే అవకాశముంటుంది. కాబట్టి మీరు మాత్రలు తిరిగి కొనసాగించటమే మంచిది. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఆహారంలో నూనె పదార్థాలు, వేపుళ్లు తగ్గించుకోవాలి. రోజూ నూనెను కొలిచి, వాడుకోవటం కుదరకపోవచ్చు. నూనె ఎందులో ఎక్కువుంది? ఎందులో తక్కువుంది? అని ప్రతిసారీ చూసుకోవటం సాధ్యం కాదు. దీని కన్నా నెల మొత్తమ్మీద ఎంత నూనె వాడుతున్నారో గుర్తించటం తేలిక. ఒకరు నెలకు అరకిలో వరకు నూనె వాడుకుంటే ఇబ్బందేమీ ఉండదు. కుటుంబంలో నలుగురుంటే నెలకు 2 కిలోల నూనె కన్నా ఎక్కువ మించకుండా చూసుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలతో కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు.

# నీరెప్పుడు తాగాలి?.. ఎంత తాగాలి?

మెదడు పనితీరు మెరుగవుతుంది. ఉత్సాహం పెరుగుతుంది. బరువు తగ్గుతుంది. వ్యాయామం చేస్తున్నప్పుడు చెమట రూపంలో కోల్పోయిన నీరు భర్తీ అవుతుంది. ఇలా చెప్పుకొంటూ పోతే నీరు తాగటం వల్ల కలిగే ప్రయోజనాలు ఎన్నో. మరి నీళ్లు తాగటానికి మంచి సమయం ఏది?

ఉదయం నిద్ర లేచాక ముందుగా గ్లాసు నీరు తాగటం మంచిది. ఇందులో కాస్త నిమ్మరసం కలుపుకొంటే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, పొటాషియం సైతం లభిస్తాయి. రోజంతా హుషారుగా ఉండొచ్చు.

వేళ కాని వేళ ఆకలి వేస్తున్నట్టు అనిపించినా ముందు కాసిన్ని నీళ్లు తాగటం ఉత్తమం. ఆకలి, దాహం.. రెండింటి ప్రేరేపకాలను మెదడు ఒకేలా గ్రహిస్తుంది. కాబట్టే చాలాసార్లు ఆకలి, దాహం మధ్య తేడా తెలియదు. నీళ్లు తాగాక కొద్ది నిమిషాల తర్వాత ఆకలి తగ్గితే దాహం వేసిందనే అర్థం. దీంతో అనసరంగా తినటాన్ని అరికట్టొచ్చు.

విరేచనాలు, వాంతులు, జ్వరం మూలంగా ఒంట్లోంచి చాలా నీరు వెళ్లిపోతుంది. వీటి లక్షణాలు ఆరంభమవుతున్న దశలోనే.. దాహం వేయకపోయినా కూడా తరచూ నీళ్లు తాగటం మంచిది. దీంతో జబ్బుల నుంచి త్వరగా కోలుకోవచ్చు. సాయంత్రం వేళల్లో నిరుత్సాహంగా, బడలికగా అనిపించినప్పుడు చాలామంది కాఫీ, టీ వైపు చూస్తుంటారు గానీ ముందుగా ఓ గ్లాసు నీరు తాగటం మేలు. దీంతో మెదడు చురుకుగా పనిచేస్తుంది. మూడ్ మెరుగవుతుంది.

తలనొప్పిగా అనిపించినప్పుడూ నీళ్లు తాగి చూడొచ్చు. ఎందుకంటే ఒంట్లో నీటిశాతం తగ్గినప్పుడు తలనొప్పి ప్రేరేపితమయ్యే అవకాశముంది.



మంచి ఆరోగ్యానికి నీరు అత్యంత అవసరం. మరి రోజుకు ఎంత నీరు తాగాలి? అందరికీ ఒకే నియమం సరిపోదు. మన శరీరానికి ద్రవాలు ఎందుకు అవసరమనేది తెలుసుకుంటే రోజుకు ఎంత నీరు తాగాలనే అంచనాకు రావొచ్చు. ప్రతీ కణం, కణజాలం, అవయవం సరిగా పనిచేయటానికి నీరు తప్పనిసరి.

ఉదాహరణకు- మూత్రం, చెమట, మలం ద్వారా మలినాలు బయటకు పోవటానికి.. శరీర ఉష్ణోగ్రత నార్మల్‌గా ఉండటానికి.. కీళ్లు తేలికగా కదలటానికి.. సున్నితమైన కణజాలాలు దెబ్బతినకుండా ఉండటానికి నీరు తోడ్పడుతుంది. ఒంట్లో నీటి శాతం తగ్గితే ఇలాంటి పనులన్నీ మందగిస్తాయి. కొద్దిపాటి నీరు తగ్గినా శక్తి, ఉత్సాహం సన్నగిల్లుతాయి. అలసట ముంచుకొస్తుంది. కాబట్టి తగినంత నీరు తాగటం ప్రధానం.

రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగాలనేది సాధారణ సిఫారసు. అయితే ఎంత నీరు అవసరమనేది మన ఆరోగ్యంతో పాటు ఉష్ణోగ్రత, మన శారీరక శ్రమ, పనుల వంటి వాటి ఆధారపడి ఉంటుంది. తగినంత నీరు తాగుతున్నామా? లేదా? అనేది గుర్తించటానికి తేలికైన మార్గం మూత్రం రంగు. మామూలుగానైతే ఇది లేత పసుపు రంగులో ఉండాలి. ఏమాత్రం ముదురు రంగులోకి మారినా తగినంత నీరు తాగటం లేదనే అర్థం.

నీరు తాగటానికి దాహం వేసేంతవరకు ఆగటం సరికాదు. మనకు దాహం వేసే సరికే ఒంట్లో నీటి శాతం తగ్గిపోయి ఉంటుందని తెలుసుకోవాలి. కాబట్టి అప్పుడప్పుడు గొంతు తడిచేసుకుంటూ ఉండాలి.

# విరేచనాలకు అరటికాయ

అవును.. మంచి ఆహారం మందుగానూ పనిచేస్తుంది. ఇది జబ్బులను పూర్తిగా నయం చేయలేకపోవచ్చు గానీ కొన్ని పదార్థాలు లక్షణాల తీవ్రత తగ్గటానికి తోడ్పడే మాట నిజం. శరీరానికి కొత్త శక్తిని కల్పించి త్వరగా కోలుకునేలా చేస్తాయి. ఉదాహరణకు- అరటికాయనే తీసుకోండి. విరేచనాలు తగ్గటానికివి బాగా తోడ్పడతాయి. వీటిల్లో కఠినమైన పిండి పదార్థముంటుంది. చిన్నపేగులు దీన్ని త్వరగా గ్రహించుకోలేవు. ఇది మంచి బ్యాక్టీరియాకు ఆహారంగానూ ఉపయోగపడుతుంది. చెడు బ్యాక్టీరియాను బయటకు పంపిస్తుంది. అరటికాయల్లో పొటాషియం వంటి ఎలెక్ట్రోలైట్లు దండిగా ఉంటాయి. విరేచనాలతో కోల్పోయిన ఎలెక్ట్రోలైట్లు భర్తీ కావటానికివి తోడ్పడతాయి. ఇక తేనె గురించి చెప్పుకోవాలంటే చాలానే ఉంది. అనాదిగా ఔషధంగా వాడుతూనే వస్తున్నాం. ఇది వాపును తగ్గిస్తుంది. నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. హానికర బ్యాక్టీరియాను చంపుతుంది. వైరల్ ఇన్‌ఫెక్షన్లతో పోరాడే యాంటీబాడీలూ తేనెలో పుష్కలంగా ఉంటాయి. నియాసిన్, విటమిన్ సి వంటి విటమిన్లు.. క్యాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలు కూడా లభిస్తాయి. ఇవన్నీ శక్తిని పెంచేవే. గోరువెచ్చటి నీటిలో రెండు చెంచాల తేనె కలిపి తాగితే దగ్గు తగ్గుముఖం పడుతుంది కూడా.



# అలర్జీకి కొత్త చికిత్స

పుప్పొడి, పెంపుడు జంతువుల నూగు, తవిటి పురుగులు, చెమ్మ వంటివి కొందరికి పడవు. వీటితో కూడిన గాలిని పీల్చుకున్నప్పుడు అలర్జీ ప్రేరేపితమవుతుంది. ముక్కు దిబ్బడ, ముక్కు కారటం, ముక్కు దురద, తుమ్ములు మొదలవుతాయి. దీనికి కారణం రోగనిరోధక వ్యవస్థ అతిగా ప్రేరేపితం కావటం. దీంతో బాధపడేవారిలో కొందరికి అలర్జీ సూదిమందు ఇస్తుంటారు. వీటి ద్వారా అలర్జీ కారకాలను పెద్ద మోతాదులో ఇస్తారు. దీంతో రోగనిరోధక వ్యవస్థ క్రమంగా వీటికి ప్రతిస్పందించకుండా ఉండటం నేర్చుకుంటుంది.



దురదృష్టవశాత్తూ అలర్జీ ఇంజెక్షన్లు అందరికీ పనిచేయవు. పైగా వీటిని కనీసం మూడేళ్లయినా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పరిశోధకులు కొత్తరకం చికిత్సను రూపొందించారు. అలర్జీ ఇంజెక్షన్లతో పాటు పరిశోధనశాలలో తయారుచేసిన ఔషధాన్ని కలిపి ఇవ్వటం దీనిలోని కీలకాంశం. ఇది శరీరంలో అలర్జీ ప్రతిస్పందనలను ప్రేరేపించే పదార్థాలను అడ్డుకుంటుంది. ఈ కొత్త చికిత్సను పిల్లి అలర్జీతో బాధపడేవారిపై పరీక్షించి చూశారు. అలర్జీ ఇంజెక్షన్లు మాత్రమే తీసుకున్నవారితో పోలిస్తే.. రెండింటినీ కలిపి తీసుకున్నవారిలో మరింత మంచి ఫలితం కనిపించింది. పిల్లికి సంబంధించిన ప్రొటీన్లకు గురైనా కూడా వీరిలో తక్కువ లక్షణాలు పొడసూపాయి. చికిత్సలు ఆపిన ఏడాది తర్వాత అలర్జీ ఇంజెక్షన్ల ప్రభావం క్షీణిస్తూ వచ్చింది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy